నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 9-4-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 218 పేజీలు: 8 వెల: రూ.1/-

'మీ కోసం యాప్'ను ప్రారంభించిన మంత్రి జగదీష్ రెడ్డి

సూర్యాపేట ,ఏప్రిల్ 8 సూర్యాపేట మున్సిపాలిటీలో ఇంటి వద్దకే సరుకుల పంపిణీకి 'మీ కోసం యాప్'ను మంత్రి జగదీష్ రెడ్డి ప్రారంభించారు. నిత్యావసర సరుకుల సరఫరా కోసం మున్సిపల్ అధికారులు ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కరోనాను తరిమికొట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రజలు లాక్‌డౌన్‌ను సహకరించాలి.

కరోనా నియంత్రణకు సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న విధానాలు దేశానికే ఆదర్శం. కరోనా కట్టడికి ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. మరోవైపు ప్రభుత్వ ఉద్యోగులకు బత్తాయి పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని కూడా మంత్రి ప్రారంభించారు.

కేటీఆర్‌ని కలిసి రూ.25 లక్షల విరాళం అందించిన ఎఫ్ఎన్‌సీసీ సభ్యులు

హైదరాబాద్, ఏప్రిల్ 8:విపత్కర సమయాలలో తమవంతు విరాళాన్ని అందిస్తూ వస్తున్న ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్ఎన్‌సీసీ) తాజాగా సీఎం సహాయనిధికి రూ. 25లక్షల విరాళాన్ని అందించారు.

కరోనా కట్టడిలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యలలో తమ వంతు భాగం అయ్యేందుకు ఎఫ్ఎన్‌సీసీ విరాళాన్ని అందించింది. కొద్ది సేపటి క్రితం మంత్రి కేటీఆర్‌ని కలిసి ఈ విరాళాన్ని అందించారు. ఆది శేషగిరిరావు కేటీఆర్‌కి చెక్ అందించగా కేఎల్ నారాయణ, ఈటల రాజెందర్ తదితరులు ఆయనతో ఉన్నారు.

తెలంగాణలో ప్రస్తుతం కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 400 దాటగా, 308 మంది చికిత్స పొందుతున్నారు. 45 మంది ఇప్పటికే డిశ్చార్జ్ అయ్యారు. మంగళవారం ఒక్క రోజే 40 కేసులు నమోదు అయిన సంగతి తెలిసిందే.

కరోనాతో పెరగనున్న నిరుద్యోగ సమస్య

40 కోట్ల మంది భారతీయులుపై ప్రభావం ఐక్యరాజ్యసమితి అధ్యయనంలో వెల్లడి

జెనీవా,ఏప్రిల్8(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ ప్రభావం వల్ల వివిధ రంగాల్లో పనిచేస్తున్న 40 కోట్ల మంది భారతీయులు పేదరికంలోకి వెళ్లే ప్రమాదం ఉందని ఐక్యరాజ్యసమితి పేర్కొన్నది. ఇప్పటికే నిత్యకూలీలు ఆందోళన చెందుతున్న వేళ ఈ ప్రకటన మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది రెండవ క్వార్టర్‌లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 19.5 కోట్ల మంది ఉద్యోగ్యాలు కోల్పోయే ప్రమాదం ఉందని కూడా యూఎన్‌కు చెందిన ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ హెచ్చరించింది. అంటే 6.7 శాతం వర్కింగ్ హవర్స్ తగ్గిపోతాయని ఐఎల్ఓ అంచనా వేసింది. ఐఎల్ఓ మానిటర్ సెకండ్ ఎడిషన్.. కోవిడ్19 అండ్ ద వరల్డ్ ఆఫ్ వర్క్ పేరుతో ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ఈ నివేదికను రిలీజ్ చేసింది. ఎక్కువ శాతం ప్రభావం అరబ్ దేశాల్లో ఉంటుందని ఐఎల్ఓ అంచనా వేసింది. అరబ్ దేశాల్లో 8.1 శాతం మంది ఉద్యోగాలు కోల్పోతారు. అంటే సుమారు 50 లక్షల ఫుల్‌టైం వర్కర్లు పనికోల్పో తారు. ఇక తర్వాత స్థానంలో యురోప్(7.8 అంటే, కోటి 20లక్షల మంది), ఆసియా(7.2 అంటే 12 కోట్ల మంది) దేశాలు ఉన్నాయి

కరోనా వైరస్ మహమ్మారి వల్ల రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన పరిస్థితుల కన్నా దారుణమైన పరిస్థితులు ఏర్పడనున్నట్లు యూఎన్ పేర్కొన్నది. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలకు చెందిన కార్మికులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఐఎల్ఓ డైరక్టర్ జనరల్ గయ్ రైడర్ తెలిపారు. చాలా వేగంగా సరైన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో కోట్లాది మంది బ్రతుకులు కూలిపోయే ప్రమాదం ఉన్నట్లు ఆయన అన్నారు.

దేశంలో విస్తరిస్తున్న కరోనా ఉధృతి

కరోనా బాధితుల సంఖ్య 5194కు చేరిక

149కి చేరిన మృతిచెందిన వారి సంఖ్య

తెలుగు రాష్ట్రాల్లో పెరుగుతున్న కేసులు

న్యూఢిల్లీ,ఏప్రిల్8(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా కోవిడ్-19 మహమ్మారి అంతకంతకూ విజృంభిస్తోంది. ఇప్పటి వరకు ఈ వైరస్ బారిన పడిన వారి సంఖ్య 5194 దాటినట్టు కేంద్రం వెల్లడించింది. కరోనా కారణంగా మృతిచెందిన వారి సంఖ్య 149కి చేరిందని పేర్కొంది. కాగా ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 402 మంది కరోనా నుంచి కోలుకుని ఇళ్లకు వెళ్లారు. ఈ నెల 14న లాక్‌డౌన్ ముగియనున్న తరుణంలోనే కోవిడ్-19 కేసులు మరింత పెరుగుతున్నాయి. దీంతో లాక్‌డౌన్ మరింత పొడిగించాలంటూ పలు రాష్ట్రాలు కేంద్రాన్ని కోరుతున్నాయి. మరోవైపు ఉదయం 10 గంటల సమయానికి ప్రపంచ వ్యాప్తంగా కరోనా బారిన పడిన వారి సంఖ్య 14.3 లక్షలకు చేరింది. మొత్తం 82 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఇటలీలో అత్యధికంగా 17 వేల మంది చనిపోగా.. అమెరికాలో 13 వేల మంది, స్పెయిన్‌లో 14 వేల మంది బలయ్యారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 200 లకు పైగా దేశాలకు విస్తరించి.. కంటి మీద కునుకులేకుండా చేస్తోంది. ఈ మహమ్మారి బారిన పడుతున్నవారి సంఖ్య రోజురోజుకూ శర వేగంగా పెరుగుతోంది. భారత్‌లోనూ వైరస్ విస్తరిస్తోంది. దేశంలో 211 రాష్ట్రాలు వైరస్ బారినపడి అల్లాడుతున్నాయి. తెలుగు రాష్ట్రాలపై కూడా కరోనా కోరలు చాస్తోంది. ఏపీలో కరోనా బాధితుల సంఖ్య 329 కాగా, తెలంగాణలో 404కు చేరింది. ఏపీలో కరోనా వైరస్ కేసుల సంఖ్య 329కి చేరింది. మంగళవారం రాత్రి 10 గంటల నుంచి బుధవారం ఉదయం 9 గంటల వరకు నమోదైన లెక్కల ప్రకారం ఈ మేరకు బులిటెన్ విడుదల చేశారు. నెల్లూరులో 6, కృష్ణా 6, చిత్తూరు జిల్లాల్లో 3 కొత్త కేసులు నిర్ధారణ అయ్యాయి. అత్యధికంగా కర్నూలులో 74 కేసులు నమోదయినట్టు తెలిపింది. రాష్ట్రంలో కరోనాతో నలుగురు మృతి చెందగా ఆరుగురు కోలుకొని డిశ్చార్జ్ అయ్యారు. కర్నూలు జిల్లాలో అత్యధికంగా 74 కేసులు నమోదయ్యాయి. నెల్లూరు జిల్లాలో కేసుల సంఖ్య 49కి చేరింది. గుంటూరు జిల్లాలో 41, కృష్ణా జిల్లాలో 35, కడప జిల్లాలో 27 కరోనా కేసులు నమోదయ్యాయి. ప్రకాశంలో 24, పశ్చిమగోదావరిలో 21 కేసులున్నాయి. ఏపీలోని మొత్తం కేసుల్లో సగానికి పైగా కర్నూలు.. నెల్లూరు, గుంటూ రు జిల్లాలోనే ఉన్నాయి. రోజురోజుకూ కేసులు పెరుగుతుండటంతో టెన్షన్ నెలకొ ంది. ఏపీ సర్కార్ కరోనా పరీక్షా కేంద్రాల సామర్థ్యం పెంచింది. ప్రాథమిక స్థాయిలోనూ పరీక్షల నిర్వహణకు అనుమతి ఇచ్చింది. అధికారులు రెడ్‌జోన్లను క్లస్టర్లుగా విభజించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇటు తెలంగాణలోనూ గత 24 గంటలలో మరో 40 కొత్త కేసులు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 404కి చేరింది. హైదరాబాద్‌లో అత్యధికంగా 154 కేసులు నమోదయ్యాయి. కరోనాతో 11 మంది చనిపోయారు. ఇప్పటివరకు 45 మంది పూర్తిగా కోలుకొని ఆస్పత్రుల నుంచి డిశ్చార్జి అయ్యారు. ప్రస్తుతం 348 మంది ఆస్పత్రు ల్లో చికిత్స పొందుతున్నారు. అయితే మరో రెండు రోజుల్లో మర్కజ్ కేసులతో లింకున్న వారందరి పరీక్షలన్నీ పూర్తికానున్నాయి. అందులో ఎంత మందికి పాజిటివ్‌గా ఉందనేది తేలనుంది.

ప్రధాని మోడీకి పెరుగుతున్న ప్రజాదరణ

కరోనా నేపథ్యంలో మరింతగా ప్రజల మద్దతు

లాక్‌డౌన్ పొడిగించినా ఆమోదించేందుకు జనం సిద్ధం

న్యూఢిల్లీ,ఏప్రిల్8(ఆర్ఎన్ఎ): కరోనా వ్యాప్తి, లాక్‌డౌన్ నేపథ్యంలో ఇప్పుడు ప్రజలంతా ప్రధాని మోడీ తీసుకునే నిర్ణయాలకు ఇప్పుడు జై కొడుతున్నారు. మరో వారం లేదా పదిరోజులు లాక్‌డౌన్ పొడిగించినా అంగీకరించే స్థితిలో ఉన్నారు. దీనికి తోడు సామాజిక మాధ్యమాల్లో మోడీకి అనుకూలంగా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలకు మద్దతు లభిస్తోంది. లాక్‌డౌన కఠినంగా అమలు చేయడం వల్లనే భారత్ బచ్‌గయా అన్న సందేశాలు వస్తున్నాయి. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ మాత్రమే ముందస్తు చర్యలు తీసుకుందన్న భావన ప్రజల్లో ఉంది. ఫేస్‌బుక్‌లోనూ, ఇతరత్రా సోషల్ మీడియాలోనూ, పత్రికా ప్రకటనల ద్వారా ప్రజలను ఈ విషయంపై చైతన్యపరిచేందుకు చాలా మంది ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుత కరోనా వైరస్ సంక్షోభ సమయంలో దేశ ప్రజలకు మోదీ మరింత దగ్గర కావడానికి అనేక కారణాలున్నాయి. కరోనా మహమ్మారిని గుర్తించి త్వరగా నిర్ణయం తసీఉకున్నారన్న ప్రశంసలు వస్తున్నాయి. మోదీకి సంక్షోభ సమయాన్ని అవకాశంగా మార్చుకోగలిగిన శక్తి ఉన్నది. వైరస్ ముదిరిపోతున్నదని గ్రహించి ఆయన వెంటనే మార్చి 22న లాక్‌డౌన్ విధించారు. మరెఉసటి రోజే దానిని పొడిగిస్తూ ప్రకటన చేశారు. కరోనా మొత్తం ప్రపంచవ్యాప్త సమస్య కాబట్టి భారత దేశంలో పరిస్థితిని అదుపులోకి తీసుకుని రాష్ట్రాలకు మార్గదర్శకత్వం అందించాల్సిన బాధ్యత ఆయనపై పడింది. దీంతో ప్రధాని నరేంద్ర మోదీ ఎటువంటి విశేష అధికారాలను ప్రయోగించకుండానే రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకుని కరోనా వైరస్ ను అరికట్టేందుకు చర్యలు తీసుకున్నారు. అంటువ్యాధుల చట్టం, ఎన్డీఏంఏ చట్టం ఈ రెండు చట్టాల ద్వారా దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించాలని మోదీ నిర్ణయం తీసుకున్నారు. ఇది కలిసికట్టుగా ఎదుర్కొవాల్సిన సమస్య కనుక రాష్ట్రాలు కూడా వెంటనే సానుకూలంగా స్పందించవలిసి వచ్చింది. ఇది ప్రభుత్వాల ద్వారా ఎదుర్కోవాల్సిన సమస్య కనుక ప్రజల కళ్లముందు ప్రభుత్వాలు ప్రత్యక్షంగా పనిచేస్తున్నట్లు కనపడాల్సిన అవసరం కూడా ఏర్పడింది. ఈ నేపథ్యంలో కేంద్ర స్థాయిలో నరేంద్రమోదీ, రాష్ట్ర స్థాయిలో వివిధ ముఖ్యమంత్రులు తమ సమర్థతతో పాటు తమ ఉనికిని నిరూపించుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారు. ముఖ్యమంత్రులు కూడా ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ఆందోళనల నేపథ్యంలో కరోనా కట్టడికి మోడీతో సహకరించాల్సి వస్తోంది. మొత్తంగా మన దేశం పరోక్షంగా అధ్యక్ష పాలన అమలులో ఉన్నదా అన్నట్లుగా మోడీ మాటే చెల్లుబాటు అవుతోంది. దేశంలో కరోనా కంట్రోల్ అవుతుందనుకుంటున్న తరుణంలో ఢిల్లీ తబ్లిగీ సంఘటన తర్వాత మోదీ పట్ల జనానికి ఆదరణ మరింత పెరిగింది. ఈ ఘటన కారణంగా కరోనా పాజిటివ్ కేసులు పెరగడం, తబ్లిగీ వెళ్లొచ్చ వారు సమాచారం ఇవ్వకపోవడంతో ప్రజల్లో సహజంగానే ఆగ్రహం పెరిగింది. దీంతో ఈప్రచారాన్ని మెజారిటీ ప్రజలు నమ్మేందుకు ఆస్కారం ఏర్పడింది. ఈ సంఘటన తర్వాత భారత దేశమంతా దీపాలు వెలిగించాలని మోదీ ప్రజలకు పిలుపు ఇవ్వడంతో అంతా సరేనంటూ ముందుకు వచ్చి దీపాలు వెలిగించి ప్రధాని మోడీకి మద్దతుగా నిలిచారు. సిఎం కెసిఆర్ లాంటి వారు కూడా మద్దతుగా నిలిచి ..విమర్శలను తీవ్రంగా కొట్టేశారు. భారత దేశంలోని మెజారిటీ ప్రజల జీవితాల్లో దీపాలకున్న ప్రాధాన్యత, పవిత్రత మోడీ బాగా ఉపయోగించుకున్నారు. ఇంతకాలం మోడీ తీసుకుంటున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ వచ్చిన వారు సైతం ఇప్పుడు కరోనా కారణంగా సమర్థిస్తున్నారు. తాజాగా లాక్‌డౌన్ తర్వాత లక్షలాది వలస కూలీలు దుర్భరమైన ఇక్కట్ల పాలు కావడం అందరికీ తెలిసిందే. ఇవి కాక వ్యవస్థలను ఆయన గుప్పిట్లో పెట్టుకున్నారని, కేంద్రంలో అధికారం పూర్తిగా మోదీ చుట్టే కేంద్రీకృతమైందని విమర్శలు చేసే వారు ఉన్నారు. విమర్శలు చేసే వారికి నమ్మరగినంతగా జన బలం లేదని భావించవచ్చు. మోదీతో పోలిస్తే చాలా మంది ప్రతిపక్ష నాయకులకు ప్రజల్లో విశ్వసనీయత లేకుండ ఆపోయింది. ఇది కూడా బాగా కలసివచ్చే అంశం. మొత్తంగా కరోనా కారణంగా మోడీ ప్రజామోదం పొందిన నేతగా మరింత ఆదరణ సంపాదించారని చెప్పకతప్పదు.

నేరెడుమెట్‌లో పోలీస్ సిబ్బందికి మాస్కులు అందచేస్తున్న రాచకొండ కమిషనర్ మహేశ్ భగవత్

యువతి వదిలేసిందని టెక్కీ ఆత్మహత్య

హైదరాబాద్,ఏప్రిల్8(ఆర్ఎన్ఎ): సహజీవనం చేసిన యువతి వదిలి వెళ్లిపోవడంతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. చంద్రకిరణ్ (32) మాదాపూర్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో పని చేస్తూ ఓ యువతితో రెండు సంవత్సరాలుగా సహజీవనం చేస్తున్నారు. బేగంపేటలో నివాసమున్న చంద్రకిరణ్ ఇటీవల కేపీహెచ్‌బీ పరిధిలోని తులసిన గర్‌లోని ఓ అపార్టుమెంట్‌కు మకాం మార్చారు. కాగా.. 25 రోజుల క్రితం ఆ యువతి చంద్రకిరణ్‌ను వదిలి వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం సోదరుడు రాకేష్ ఫోన్‌చేస్తే ఎత్తకపోవటంతో అనుమానం రావడంతో వచ్చిచూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలం దొరికిన ఆత్మహత్య లేఖలో 'ఆ అమ్మాయి లేనిదే నేను బ్రతకలేనని' రాసి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక పరిస్థితులు

లాక్‌డౌన్‌తోనే కరోనా కట్టడి సాధ్యం

ప్రజలంతా ఇంటికే పరిమితం కావాలి

అమెరికా, ఇటలీ పరిస్తితులు రాకుండా చూడాలి

-ప్రజలను కోరిన మంత్రి హరీష్ రావు

సిద్ధిపేట,ఏప్రిల్8(ఆర్ఎన్ఎ): ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడొక ప్రత్యేక పరిస్థితిని ఎదుర్కొంటున్నామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడంతో ఇక్కడ కరోనా అదుపులో ఉందని మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. ఇదే పరిస్థితి కొనసాగిని ప్రజలు కట్టుబడి ఉండాలని, అప్పుడే కరోనా పూర్తిగా దరికి చేరదని అన్నారు.

సిద్ధిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన నర్సరీని హరీష్ రావు పరిశీలించారు. అనంతరం గ్రామంలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి హరీష్ రావు.. కరోనాకు ముందు లేదని, ఇంట్లో ఉండి ప్రభుత్వానికి సహకరించడమే మందు అని పేర్కొన్నారు. అగ్రరాజ్యాలైన అమెరికా, ఇటలీ వంటి దేశాలు కరోనాతో విలవిలలా డుతున్నాయని అన్నారు.

కేవలం 6 కోట్ల జనాభా ఉన్న ఇటలీనే కరోనాను అదుపు చేయలేకపోతోందని, అలాంటిది 130 కోట్ల జనాభా ఉన్న దేశంలో కరోనా అదుపు తప్పితే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు కరోనాపై కొట్లాడుతూనే మరోవైపు రైతుల సంక్షేమానికి కృషి చేస్తోందని మంత్రి హరీష్ రావు చెప్పారు. గ్రామగ్రామానికి సెంటర్లు పెట్టి రైతుల వద్దకే వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తామని మంత్రి చెప్పారు. రైతులు కూడా ఇందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పంట కోసిన తరువాత బాగా ఆరబెట్టి, ఇచ్చిన టోకెన్ నెంబర్ ప్రకారం కొనుగోలు కేంద్రాలకు రావాలని సూచించారు. అన్ని పంటలకు మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పారు. రాష్ట్రానికి 14 కోట్ల గన్ని బ్యాగులు అవసరం ఉన్నాయని, అయితే ప్రస్తుతం రాష్ట్రంలో సగం మాత్రమే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మిగతా బ్యాగుల కోసం ప్రయత్నాలు చేస్తున్నామని హరీష్ చెప్పారు. రైతులు కూడా పాత గన్ని బ్యాగులు ఉంటే తీసుకురావాలని సూచించారు.

అకాల వర్షాలు వచ్చే అవకాశం ఉందని, రైతులు తమ వెంట టార్పాలిన్ కవర్లు తెచ్చు కోవాలని సూచించారు. అదేవిధంగా రైతులు ఒకరికి ఒకరు సహకరించుకోవాలన్నారు. పంజాబ్ నుంచి 150 ప్యాడి మిషన్లు సిద్ధిపేటకు తెప్పిస్తున్నామన్నారు. లాక్‌డౌన్ ఇంకో వారం, పదిహేను రోజులు పెంచినా ప్రజలు సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. కరోనాకు కులం, మతం, పేద, ధనిక బేదం లేదని, అందరికీ వస్తుందన్నారు.

మనిషి ప్రాణాల కంటే ముఖ్యమేది కాదు.. లాక్‌డౌన్ పొడిగిస్తే సహకరిద్దామని హరీష్‌రావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సామాజిక దూరంతోనే కరోనాను అడ్డుకోవడం సాధ్యమవుతుందని మంత్రి స్పష్టం చేశారు. లాక్‌డౌన్ ముగిసేదాకా ఎవరూ బయటకు రావొద్దని, ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తుందని, ప్రభుత్వ సూచనలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. ఇటలీ, అమెరికా పరిస్థితి మనకు రావొద్దంటే.. స్వీయనియంత్రణ పాటించా లని హరీష్‌రావు కోరారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

జిల్లా కేంద్రమైన సిద్ధిపేట కొండ భూదేవి గార్డెన్స్‌లో మంగళవారం రాత్రి పట్టణంలోని లైట్ మోటారు వెహికిల్, మెకానిక్, మ్యాజిక్ ఆటో అసోసియేషన్లకు చెందిన 325 సంఘ సభ్యులకు బియ్యం, 8 రకాల నిత్యావసర సరుకుల వస్తువులు కలిగిన కిట్స్ ను ఏంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ప్రముఖ సినీ హాస్య నటుడు శివారెడ్డితో కలిసి మంత్రి పంపిణీ చేశారు. అందరి క్రమశిక్షణ, దేవుడి దయ వల్ల సిద్దిపేటలో ఒక కరోనా కేసు నమోదు కాలేదన్నారు. ఇప్రభుత్వానికి లాక్ డౌన్ వల్ల ఆదాయం నష్టం జరుగుతుందని తెలిసినా, సీఎం కేసీఆర్ ప్రజల ఆరోగ్యం ముఖ్యమని తలిచారని అన్నారు. ఈ సమయంలో పేదలు, వలస కార్మికులు, రోజూ రెక్కాడితే కానీ డొక్కాడని దినసరి కార్మికులైనా మీ గురించి తన ఉడుతా భక్తిగా ఆలోచన చేసి ఈ సాయాన్ని చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ సామాజిక దూరాన్ని బాధ్యతగా పాటించాలని అలా సోషల్ డిస్టెన్స్ పాటించినట్లయితే ఆ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడం సాధ్యమవుతుందన్నారు. లాక్ డౌన్ పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉంటూ తప్పనిసరి అయితే తప్ప బయటకు వెళ్లొద్దని, ఎవరి ఇంటిలో వారే ఉన్నట్లయితే మన కుటుంబాన్ని, మన రాష్ట్రాన్ని, మన దేశాన్ని కాపాడుకున్న వాళ్లమవుతామని చెప్పారు.

అంతకు ముందు ఏంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. మీకు ఏ ఆపదొచ్చినా ఆదుకునేందుకు ముందుండే వ్యక్తి హరీశ్ రావు గారని, ఈ విపత్కర పరిస్థితుల్లో మీ కోసం ఆలోచన చేసి ఉడుతా భక్తిగా సాయాన్ని అందిస్తున్నారని చెప్పారు. కరోనా వ్యాధి ప్రభావంతో ప్రపంచమే వణుకుతున్నదని, సామాజిక దూరంతోనే కరోనాను అడ్డుకోవడం సాధ్యమని, లాక్ డౌన్ ముగిసే దాకా ఇంటి నుంచి బయటకు రావొద్దని, ప్రభుత్వ సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు నీళ్లు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దే: మంత్రి ఎర్రబెల్లి

మహబూబాబాద్:, ఏప్రిల్ 8 తొర్రూర్‌లో వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కాకిరాల హరిప్రసాద్, కలెక్టర్ గౌతమ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..'పాలకుర్తి నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు నీళ్లు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దే. కరోనాతో ప్రపంచం అతలాకుతలమవుతోంది. తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తున్నారు. ప్రజలకు నిత్యావసర సరుకులు, కూరగాయలు అందుబాటులో ఉంచారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తది. రైతు సమన్వయ సమితి సభ్యులు, కో ఆర్డినేటర్లు రైతాంగం కోసం పనిచేయాలని' మంత్రి కోరారు.

తొర్రూరులో పారిశుద్ధ్య కార్మికులకు మాస్కులు, నిత్యావసర సరుకులను మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ గౌతం, మున్సిపల్ కమిషనర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లాక్‌డౌన్ వేళ నగరంలో ప్రజల నిర్లక్ష్యం

ఏదో కారణంతో రోడ్డు మీదకు వస్తున్న జనం

హైదరాబాద్,ఏప్రిల్8(ఆర్ఎన్ఎ): ఓ వైపు లాక్‌డౌన్ పొడిగిస్తారని ప్రచారం జరగుతున్న వేళ నగరంలో ప్రజల్లో మాత్రం పెద్దగా ప్రభావం కనిపించడం లేదు. తెల్లవారుతూనే ఏదో పనిమీద వాహనాలు వేసుకుని బయటకు తిరుగుతూనే ఉన్నారు. పాదచారులు కూడా బయట తిగుతున్నారు. ప్రభుత్వం లాక్ డౌన్ విధించినా జనం మాత్రం పట్టించుకోవడం లేదు. గుంపులు గుంపులుగా రోడ్లపైకి వస్తున్నారు. ప్రభుత్వం, పోలీసులు రోడ్లపైకి రావద్దని చెబుతున్నా జనాలు లాక్ డౌన్‌ను బేఖాతరు చేస్తున్నారు. 50 శాతం మంది వాహనదారులు ఎటువంటి కారణం లేకుండానే రోడ్డుమీదకు వస్తున్నారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో కుంటిసాకులు చెబుతున్నారు. దీంతో పోలీసులు అలాంటివారిపట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు. పదేపదే పోలీసులు చేస్తున్న హెచ్చరికలను బేఖాతరు చేస్తున్నారు. కరోనా బారిన పడవద్దని పోలీస్ కమిషనర్లు పదేపదే కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఇదిలావుంటే వ్యాపారులు కూడా ఇదే అదనుగా అక్కడక్కడా నిత్యావసర వస్తువుల ధరలు పెంచి దోచుకుంటున్నారు. బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజు కాలనీలో ఉన్న రెండు కిరాణా దుకాణాల యజమానులపై పోలీసులు కేసులు నమోదు

బాలిలో చిక్కుపడ్డ 80 మంది భారతీయులు

న్యూఢిల్లీ,ఏప్రిల్8(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి కారణంగా ప్రపంచ దేశాలు స్తంభించిపోవడంతో జనం ఎక్కడివాళ్లు అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. విదేశాలకు విహారయాత్రలకు వెళ్లిన భారతీయులు విదేశాల్లోనే, భారత్‌లో విహారయాత్రకు వచ్చిన విదేశీయులు భారత్‌లోనే చిక్కుకుపోయారు. ఈ క్రమంలోనే ఇండోనేషియాలోని బాలిలో కూడా 80 మంది భారతీయులు చిక్కుబడిపోయారు. వారిలో హైదరాబాద్‌కు చెందిన వారు ఐదుగురు, విజయవాడకు చెందిన వారు ఐదుగురు, ఇద్దరు తిరుపతి వాసులు ఉన్నట్లు తెలిసింది. విహారయాత్రల కోసం ఇండోనేషియా వెళ్లిన వారంతా లాక్‌డౌన్ కారణంగా రవాణా వ్యవస్థ స్తంభించడంతో బాలిలో ఉండిపోయారు. ప్రస్తుతం బాలిలోని ఒక హోటల్‌లో ఆశ్రయం పొందుతున్నారు. డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వదేశం చేరుకునేందుకు ప్రభుత్వాలు సహకరించాలని కోరుతున్నారు.

చరిత్రలో నేటినిజం

కం॥ చిరుప్రాయమునా నటనను
పరయోగముగా దలంచి పద్ధిల్లంగన
పరమేశుండు ఆటాబై
పరవశమును గూర్చెను "జయబాధురి" కిధరన్!!

(ఏప్రిల్ 9 జయబాధురీ బచ్చన్ జననం..)

-రాధశ్రీ

సెల్: 9494481210

బాల వికాసం

నెల్లూరు జిల్లాలోని కొండాపురం మండలంలో గల గొట్టి గుండాల బి.సి. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కవితలు ... సాహిత్యం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు వెలుగోటి నరేష్ (సెల్: 7382392390)కు అభినందనలు

సూరీడు

పొద్దున్నే వచ్చాడు సూరీడు
వెలుతురూ తెచ్చాడు సూరీడు
చీకటీ మాయం చేసాడు సూరీడు
అందరినీ నిద్ర లేపాడు సూరీడు.
ఆకాశంలోన మెరిశాడు సూరీడు
మబ్బులోన దాగాడు సూరీడు
ఎండనూ ఇచ్చాడు సూరీడు
వేడినీ పంచాడు సూరీడు
పంటలూ పండించాడు సూరీడు
కొండల్లోన అస్తమించాడు సూరీడు
ఆకాశాన నిలిచాడు సూరీడు.

– పి. మాధురి,
4వ తరగతి

నాన్న

నాన్న నాన్న ఓ మంచి నాన్న...
నానే నా ప్రాణం, నానీ నా దైవం
నానే నా హృదయం, నానే నా జీవం
నానే నా గురువు, నానే నా ప్రేమ
నాన్న నాన్న ఓ నాన్న...
నాన్న నాన్న ఓ చిట్టి తండ్రి
నానే నా స్వర్గం, నానే నా సర్వం
నానే నా వజ్రం, నానే నా వరం
నానే నా ధైర్యం, నానే నా ధ్యాస
నాన్న నాన్న ఓ నాన్న....
నాన్న నాన్న ఓ బంగారు తండ్రి....
నానే నా ప్రపంచం, నానే నా దీపం
నానే నా శక్తి, నానే నా ఊపిరి
నాన్న నాన్న ఓ నాన్న ....
నాన్న నాన్న ఓ ముద్దుల నాన్న
నానే లేనీ జీవితమే లేదు
నాన్న నాన్న ఓ నాన్న....

-ఓ. అనూహ్య,
4వ తరగతి

బడి పిల్లలం

పిల్లలం మేము బడి పిల్లలం
ఎల్లప్పుడూ బడిలో ఉంటాము
పలక, బలపం పట్టుకొని
బొమ్మలు చకచక వేసేస్తాం
టీచరు చెప్పిన పాటాలు వింటాం
చక్కగా చదువులు చదువుతాం
కమ్మని పాటలు పాడుతాం
అందరు కలిసిమెలిసి ఉంటాం
ఆనందంగా గడిపేస్తాం

-టి.శ్రీనాద్,
2వ తరగతి



దీపావళి సందడి

దీపావళి... దీపావళి...
వెలుగు వెలుతురుల దీపావళి.
ఇల్లంతా సందడి దీపావళి
ఊరంతా వెలుగుల దీపావళి
అందరు మెచ్చే దీపావళి
కలిసిమెలిసి జరపాలి దీపావళి
లడ్డు, మిటాయిల దీపావళి
రంగురంగుల దీపావళి
జాగ్రత పాటించాలి దీపావళి

-టి. నరేష్,
2వ తరగతి

బొంగరం

రంగుల బొంగరం
రత్నాల బొంగరం
గిరా గిరా బొంగరం
గుండ్రటి బొంగరం
పందెపు బొంగరం
పరుగెత్తు బొంగరం
చిట్టిపొట్టి బొంగరం
చిన్నదైన బొంగరం

-ఎం.అనూహ్య
4వ తరగతి

శుభ్రత

పళ్ళను నేను తోమలేదు.
పళ్ళు బాగా పుచ్చాయి.
డాక్టర్ దగ్గరకు వెళ్లాను.
డాక్టర్ సూది పొడిచాడు.
పళ్ళు రెండు పీకాడు.
రక్తం చాలా వచ్చింది.
నాకు నొప్పి పుట్టింది.
రోజూ పళ్ళు తోముతాను.
ఆరోగ్యంగా ఉంటాను.

– పి. యేసుకుమారి,
4వ తరగతి

మా మంచి మామ

మామ మామ మా మంచి మామ
పండగకు ఊరి నుండి వచ్చిన మామ
అందరితో బాగా ఆడే, పాడే మామ
కథలు చక్కగా చెప్పే మామ
బొమ్మలు ఎన్నో నేర్పే మామ
అందరితో కలిసిమెలిసి ఉండే మామ
అందరు మెచ్చే మా మామ
మామ మామ మా మంచి మామ

– టి.శ్రీనాద్, 2వ తరగతి

రెలు బండి



రైలు బండి రైలుబండి
చిక్ చిక్ చిక్ రైలు బండి
పొడవైన రైలు బండి
చిన్నారి రైలు బండి
షికారు రైలు బండి
ఊరూరు తిప్పే రైలుబండి
అందరు ఎక్కే రైలుబండి
అందమైన రైలుబండి
అందరికి నచ్చే రైలుబండి
రండి రండి రారండి
రయ్యిన చక్కగా పోరండి.

-పి. యేసుకుమారి,
4వ తరగతి

చెట్టు

వరమై వచ్చెను చెట్టు
నా వరమై వచ్చెను చెట్టు
పూలు, పండ్లను ఇచ్చేను
చల్లని గాలులు వీచెను
నా తోడుగా ఉండేను
ఎండకు వానకు అండగా
పచ్చపచ్చని ఆకులతో
కళకళ లాడే చెట్టు
కోయిలమ్మ రాగాలతో
కిలకిల లాడే చెట్టు
అందమైన చెట్టు
ఆకాశమంత చెట్టు
అందరు మెచ్చే చెట్టు
ఆనందాన్నిచ్చే చెట్టు
వరమై వచ్చెను చెట్టు
నా వరమై వచ్చెను చెట్టు.

-పి.మాధురి,
5వ తరగతి

సీతాకోకచిలుక

సీతాకోకచిలుకల సందడి చూడు
రంగురంగుల రెక్కల రాశి
ఎన్నో రంగుల రెక్కలతో అలరించే
సీతాకోకచిలుకల సోయగం
నింగిలోన ఎగిరే నేస్తమా
ఇంద్రధనస్సు రంగుల సంగమం

-పి.యేసుకుమారి
4వ తరగతి



దీపావళి

దీపావళి పండుగ వచ్చింది.
పిల్లలకు సందడి తెచ్చింది.
అందరు టపాసులు పేల్చండి.
చిచ్చు బుడ్డి, కాకరొత్తి పట్టండి.
రాకెట్, బాంబులు కాల్చండి.
ఇల్లంతా వెలుగులను నింపండి.
అందరూ జాగ్రత్తలు పాటించండి.

– సి.హెచ్.మహీధర్,
2వ తరగతి

పిల్లలు

అందమైన పిల్లలు
చక్కగా బడికి వచ్చారు
చేయి చేయి కలిపారు
ఆటలు ఆడే పిల్లలు
అందరు జట్టుగా చేరారు
ఆటలు బాగా ఆడారు
అందరు ఒకటిగా మెలిగారు
చక్కగా చదివే పిల్లలు
సంతోషంగా ఉన్నారు.

– టి. నరేష్, 2వ తరగతి

మంచి అమ్మాయి

అందమైన అమ్మాయి
ఆటలు ఆడే అమ్మాయి
పాటలు పాడే అమ్మాయి
చూడ చక్కని అమ్మాయి
చదువులు ఎన్నో చదివింది
పిల్లలకు పాటాలు నేర్పింది
పిల్లలను బాగా పెంచింది.
అందరి మెప్పులు పొందింది.
ఆనందంతో గడిపింది.

-టి.నరేష్,
2వ తరగతి

చెట్టు

చెట్టు... మనకు నీడ ఇచ్చే
చల్లటి గాలి మనకు ఇచ్చే
పూలు, పండ్లను మనకు ఇచ్చే చెట్టు
ఆకులు, కలపను ఇచ్చే చెట్టు
ఎండ, వాన నుంచి కాపాడే చెట్టు
చచ్చి కూడా చీల్చి ఇచ్చు తనువు
చెట్లు లేనిదే బతుకేలేదు.
చెట్లు లేనిదే మనిషే లేదు.

-టి. శ్రీనాద్, 2వ తరగతి

బడి- మొగ్గలు

పసి హృదయాలను నిత్యం వికసింపచేస్తూ
ఆనంద వేదికకు ఆనవాలు అయ్యేది
ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే యాగశాల 'బడి'

ప్రపంచ జ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిస్తూ
బాలల భవితవ్యానికి దిశా నిర్దేశం చేసేది
శాస్త్రవేత్తలను తయారు చేసే ప్రయోగశాల 'బడి'

ఎంత ఎదిగినా ఒదిగి ఉండే గుణాన్ని అలవరిస్తూ
ఒడిదుడుకులను ఎదుర్కునే మనోధైర్యాన్నిచ్చేది
ప్రేమ, వాత్సల్యానికి నిలువెత్తు పర్ణశాల 'బడి'

అంతర్గతంగా ఉన్న నైపుణ్యాలను వెలికి తీస్తూ
సమాజానికి మన పేరును పరిచయం చేసేది
ఉన్నతులుగా తీర్చిదిద్దే తొలి బారసాల 'బడి'

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

కరోనా బాలగేయం

ఈశాన్యం నుంచి వచ్చింది...
ఊహన్‌లో ఊపిరి పోసుకుంది...
అన్ని దేశాలకు ఎగబాకింది
అందరిని భయపెడుతోంది....

తుమ్మితే వస్తుంది...
దగ్గితే వ్యాపిస్తుంది....
కరచాలనానికి అంటుకొస్తుంది...
శుభ్రంగా లేకుంటే అల్లాడిస్తుంది ...

లోకమంతా వ్యాపించింది....
అనారోగ్యాన్ని కలిగిస్తుంది...
నరకాన్ని చూపిస్తుంది...
చివరకు ప్రాణాలు తీసేస్తుంది...

కలవరాన్ని రేపుతోంది..
కల్లోలాన్ని సృష్టిస్తుంది...
కలిసుంటే వ్యాపిస్తుంది....
విడిగుంటే నశిస్తుంది...

శుభ్రత పాటిస్తే భద్రత ఇస్తుంది...
లేకపోతే నరకం చూపిస్తుంది...
మానసిక జాడ్యం కలిగిస్తుంది...
ముచ్చెమటలు పోయిస్తుంది..

కల్మష మెరుగనిది
కనికరం చూపనిది
కాఠిన్యం చూపేది
కరోనా దాని పేరది...

-కాళంరాజు వేణుగోపాల్
8106204412

కరోనా నానీలు

గృహమే కదా
స్వర్గసీమ
ఇల్లు విడిచావో
పరలోకం తథ్యం ..!

నిబద్ధతతో
నిర్బంధంలో ఉండు
నియంతలా తిరిగితే
నింగికెళతావ్ ..!

ప్రభుత్వ ఆంక్షలు
బేఖాతర్ చేయకు
కరోనా ను
ఇంటికి తేకు ..!

అగ్ర రాజ్యాలు
అతలాకుతం
నిర్లక్ష్యానికి ఇది
ప్రతిఫలం ..!

పల్లెటూర్లలో
ఆంక్షలు పకడ్బంది
పట్టణాలలో
ఎందుకు ఇబ్బంది ..!

కరోనా భూతాన్ని
కట్టడి చేస్తున్నారు
వైద్యులు
కనిపించే దేవుళ్ళు ..!

మోచేతి వరకు
శుభ్రపరచు
మహమ్మారి
కరోనాను మట్టుపెట్టు ..!

ఒక క్షణం
నీ నిర్లక్ష్యం
ఒక జీవిత కాలానికి
యావజ్జీవం ..!

ఎవరింట్లో
వాళ్ళు ఉండాలి
జనాభా లెక్కల్లో
అందరూ ఉండాలి ..!

నిబంధనలను
ఉల్లంఘించారో
మిమ్మల్ని మీరే
హంతం చేసుకుంటారు ..!

స్వీయనిర్బంధం
ప్రతిరోజూ
సంబరాల ఉగాది
లేకుంటే సమాధి ..!

అనవసరంగా
బయట తిరగకండి
కరోనా భూతానికి
బలికాకండి ..!

బాహుబలివని
బయట తిరగొద్దు
కరోనాకు
బలి కావొద్దు ..!

విపత్కర స్థితుల్లో
క్రమశిక్షణ ముఖ్యం
నిర్లక్ష్యం వహిస్తే
మరణమే ..!

కరోనా కోరల్లో
చిక్కుకుని
అల్లాడిపోతున్న
ప్రపంచ దేశాలు ..!

శ్వాస వ్యవస్థపై
ప్రభావకారి
మానవజీవన
వినాశకారి ..!

భాద్యతగా
మెలగండి
కరోనా వైరస్
దరి చేరనీయకండి ..!

మనషులపై
తీవ్ర ప్రభావం
భయం గుప్పిట్లో
జనసందోహం..!

అనుక్షణం
జాగురూకత
ఇదే సిసలైన
కరోనా విరుగుడు..!

పొడి దగ్గుతో
మొదలవుతుంది
నిమ్మోనియాకు
దారితీస్తుంది ..!

కరోనా వైరస్
మహమ్మారి
శక్తివంతమైన
వినాశకారి..!

అధిక జనాభా
గల దేశాలకు
అప్రమత్తతే
అసలైన మంత్రం..!

సామాజిక దూరం
పాటిద్దాం
అవగాహనతో
పయనిద్దాం..!

స్వీయ నియంత్రణ
పాటిద్దాం
వ్యాదిని దరి
రాకుండా చేద్దాం..!

ముఖానికి మాస్కు
కడదాం
సమావేశాలకు
దూరంగా ఉందాం.!

మాయదారి
మహమ్మారి
ప్రపంచం మొత్తాన్ని
వణికిస్తుంది ..!

కంటికి కానరాని
సూక్ష్మజీవి
కంటికి కునుకు
లేకుండా చేస్తుంది ..!

నిశబ్ద యుద్ధం
చేద్దాము
కరోనా భూతాన్ని
తరిమి కొడదాం ..!

ఆత్మవిశ్వాసం
ఆయుధంగా చేద్దాం
క్వారైంటైనే రక్షనని
తెలుపుదాం ..!

ఔషదం లేని
సూక్ష్మజీవి
అతలాకుతలం
చేసేస్తుంది ...!

కాలుష్య చీకటిలో
చిక్కుకోవద్దు
పరిశుభ్రతతో
వెలుగుల్ని పెంచుదాం ..!

పారిశుద్ధ్య కార్మికుల
త్యాగం
అందరి ఆరోగ్యం
వారి నినాదం..!

ఉద్యోగ నిర్వహణనే
వారి ధ్యేయం
త్యాగనిరతి
అభినందనీయం ..!

ఎండ మండుతున్నా
గస్తీ చేస్తున్న
రక్షకభటులారా
వందనం..!

రాత్రి పగలు
వృత్తి నిబద్ధత
పౌరుల ఆరోగ్యమే
వారి కర్తవ్యం ..!

కల్లోల పరిస్థితులు
కట్టడి చేసే వరకు
కునుకు లేదు
ప్రభుతకు ..!

వీధుల్లో యధేచ్ఛగా
తిరగవద్దు
దుర్మార్గులుగా
మారవద్దు..!

వైరస్ వ్యాప్తిని
అరికడదాం
ఇంట్లో సురక్షితంగా
ఉందాము ..!

సిసలైన
ప్రాణ బంధువులు
వైద్యుల సేవలు
అజరామరం ..!

తమ ప్రాణాలను
పణంగా పెట్టారు
కరోనాపై
యుద్ధం చేస్తున్నారు..!

కుటుంబాన్ని వీడి
చేస్తున్న త్యాగం
చరిత్రలో
నిలవడం ఖాయం..!

కనీ విని ఎరుగని
కల్లోలం
పిట్టల్లా రాలుతున్న
జనం..!

కల్లోల పరిస్థితులు
తొలగిద్దాం
ప్రభుత్వ ఆంక్షలు
పాటిద్దాం ..!

అప్రమత్తతతో
ప్రవర్తించాలి
కలిసి కట్టుగా
కరోనాను తోలాలి ..!

అంటువ్యాధులకు
దూరంగా ఉండాలి
కరోనా బాధితులు
కాకుండా చూడాలి ..!

జనతా కర్ఫ్యూకి
మద్దతు ఇద్దాం
ఇంట్లో ఉంటూ
రక్షణ పొందుదాం ..!

స్వీయ క్రమశిక్షణ
పరిశుభ్రత
సామాజిక దూరం
మన ధర్మం..!

గుంపులుగా
దరి చేరవద్దు
కరోనా పంజాకు
గురికావొద్దు ..!

అవసరాల సాకుతో
బయటికెళ్లకు
కరోనా చావును
తెచ్చుకోకు ..!

లాక్డౌన్ పాటించు
కరోనాను పంపించు
లాఫర్వా చేశావో
చావే శరణ్యం ..!

-సునీత బండారు
8500330700

నాల్గు రాళ్ళు

అతనూ పోగేశాడు
నాలుగు రాళ్లు
తీరా చూస్తే
అవి కిడ్నీలో...

కాకి పోగేసింది
నాలుగు రాళ్ళు
ఆశ్చర్యం
దాని దాహం తీరింది.

కవి విసిరాడు
నాలుగు రాళ్ళు
శిలాక్షరాలై
నిలిచిపోయినై.

ప్రతిపక్షం
విసిరింది రాళ్ళు!
పాలకులకు
లేదు కునుకు!.

అవినీతి
పోగేసింది నల్లరాళ్ళు
ధరలు
భగ్గుమన్నాయి.

పోలీసులపై
విసిరిన రాళ్ళు
లాఠీలన్నీ
విరిగిపోతున్నై!

నేనూ విసిరా
లోకంపైకి రాళ్ళు
తిరిగి వచ్చి
తాకినై నాకే!

-సి.వి.శ్రీనివాస్
9985809434

హృదయదీపాలను వెలిగించుకుందాం...రండి

ఎవరో ఎప్పుడో చెప్పారనికాదు
స్వయంప్రకాశిత ఆలోచనలతో
స్వచ్ఛమైన మనస్సులతో
జీవనవిధానాలను
చక్కపెట్టుకోగలిగేవారే
ఆదిత్యునిలా ఉదయాస్తమయల్లోనూ
అందాలను చిందించగలరు
ఆపదలారంభమైనపుడు
అన్నిట్లో మేమున్నామంటూ
అందరికీ హితబోధ చేయరు
తమలోకి అడుగిడుతుందనుకున్న
మహమ్మారిని బహిర్గతం చేసి
పదిమందికీ అంటించ సంకల్పించరు
అనుమానాలకు తావివ్వక
తమకు తామే స్వీయ క్వారంటైన్‌లోకి
వెళ్ళిపోతారు
పుంజుకున్న శక్తితో
మళ్ళీ ఎప్పుడు కలుస్తావు మిత్రమా!
అని సంబోధించే
ధీర గుణాన్ని రప్పించుకోగలుగుతారు
చమురు కరువైన దివ్వెల్లో
వేతనాల కోతల చేతులతో వెలిగించేవి
గాలిలో దీపాలే అవుతాయని
తెలుసుకుంటారు
కరోనా ముగింపుకు స్వాగతం పలుకుతూ
అందమైన ఆశల పల్లకీకి బోయీలై
హృదయదీపాలను వెలిగించుకుందాం...రండి
నినాద నాదాలతో
కొత్త లోకాలకు ఆహ్వానిస్తారు

-పొత్తూరి సుబ్బారావు
సెల్:9490751681

పంజా

కనిపించే శత్రువు పై
కరవాలం దువ్వడంలో
ఏముంది మజ
కనిపించని శత్రువునెదిరించడానికి
దమ్ముంటే విసురు పంజా.

ఊ అంటే కలబడడానికి సిద్ధపడతావ్
చేతలు ముడుచుకొని కూర్చోమంటే
భయపడుతున్నావ్
ఏం మనసయ్యా బాబు.

గడియ రికాం లేక సంపాదనలో సతమతమయ్యావ్
గడప లోపల ఉండమంటే గునుగుతున్నావ్
ఏం బుద్ధయ్యా బాబు.

పాశ్చాత్య పలకరింపుల మోజులో పడ్డావ్
సొంత నాగరికమే శ్రీ రామ రక్ష అంటే
దిక్కులు చూస్తావ్
ఏం నడతయ్యా బాబు.

ఇంపైన బాడీ స్ప్రే లో కంపును దాచావ్
పరిశుభ్రతలో పరమాత్ముడున్నాడంటే
లెక్కచేయవ్
ఏం అలవాట్లయ్యా బాబు.

కళేబరాల ఫాస్ట్ ఫుడ్ రుచిమరిగావ్
అమ్మచేతి ముద్ద అమృతమంటే
చెవికెక్కనీయవ్
ఏం టేస్టయ్యా బాబు

కాలం చెంపదెబ్బ వేస్తే
కలిసిరాలేదంటావ్
కనికరిస్తే కాలరెగరేస్తావ్
ఎలా చెప్పాలయ్యా బాబు.

చెప్పడం నా వల్ల కాదు
నేల మీద నడవవయ్యా బాబు
మైకం కమ్మిన కళ్ళజోడు తీసి
చూస్తే తెలుస్తుంది
కరోనా మాటేసిందని
నీ చేయి నీ నెత్తి మీదే పెట్టిందని.

-డా. శారదా హన్మాండ్లు
9912275801

నేటినిజం
సాహితీ కిరణాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
గురువారం 9-4-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

నమ్మలేని నిజాలు

ఐదు పదిచేయి
నమస్కార సంస్కృతి
మళ్లి మొదలు.

చావు కేకలు
వందేళ్లకు వచ్చింది
కొత్త గత్తర.

సైన్యంలో నారీ
అబల సమబల
అంతటా ఆమె.

మురికి వాడ
నేడు స్వచ్ఛత జాడ
మోడి జీ మిషన్.

మాటలనేత
బొరియల్లోని పీత
ఐదేళ్ళరోత.

– రేడియమ్
9291527757

శ్రీనిజాలు

అడ్డుపెట్టె గుడ్డలేక
అందరిలో తుమ్మి !
రోగిష్టుల పెంచవద్దు
రోడ్డుమీద ఉమ్మి !

తొక్కామనితెలిసి అదే
తోవ కెట్ల వస్తాం?
కళ్ళుమూసితెరిచెలోగ
లక్ష కొలది చస్తాం!

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



కరోనా నీకు వీడ్కోలు

బ్రహ్మముగారు చెప్పినట్టి
వింతరోగాలు వొచ్చి జనాలు చచ్చేరు

అన్నట్టు సమస్త మానవ ప్రపంచాన్ని గడగడలు ఆడిస్తున్నది కరోనా! యావత్తు.

ప్రపంచమును వణికిస్తున్న భయంకరమైన మహమ్మారి కరోనా చైనాలోన పుట్టి చాపకింద నీరులా వ్యాపిస్తూ అందరి ప్రాణాలను కనులు ముందే తీస్తున్నది. మితిమీరిన అలవాట్లు కలిగి మనిషి అన్నింటినీ భుజించడము వలన వచ్చిందో లేక శాస్త్రీయత మేధస్సు నెత్తిపైకి కిరీటంలా వస్తుందని చేసిన ప్రయోగముల ఫలితమో గానీ ఇలా కంటికి కనిపించని మహమ్మారి ప్రపంచమును చుట్టుముట్టింది.

మనిషి లోపల చేరి సాధారణ జలుబు దగ్గు జ్వరం అనే భ్రమలో మనిషిని ముంచి నిలువెత్తు విషము మనిషిలోకి చిమ్మి ఊపిరితిత్తుల వ్యవస్థను దెబ్బ తీస్తూ ఎదుటి వారు ఎవరైనా సరే ముందుకు వెళ్లి అందరినీ హత్తుకుంటున్నది కరోనా ముద్దులతో ముంచి మనిషిని ఓ అంటురోగిని చేస్తూ పండగ చూస్తోంది. మాయల మారి కరోనా రక్కసీ!!!

మనిషిలో శరవేగముతో వ్యాపిస్తూ కుటుంబాన్ని మొత్తాన్ని రోగాల మయం చేస్తూ పక్కనున్న బంధువులు స్నేహితులు అందరినీ కరోనా మనిషిగా మారుస్తూ ఇంటికి ఇంటికి మధ్య హద్దులు పెట్టి.మనిషికి మనిషికి మధ్య కరోనా చిచ్చును పెడుతున్నది కరోనా జిత్తులు మారి!

ఓ పక్క పోలీసులు మరొక వైపు డాక్టర్లు ప్రాణాలు ఫణముగా పెట్టి పోరాడుతూనే వున్నారు. ఎవ్వరూను అడ్డుకోలేక పోతున్నారు. ఓ పక్క ప్రజలు అందరూ లాక్ డౌన్లో వున్నారు. మరొక వైపు వలస కూలీలు గుప్పెడు బువ్వకోసము ఎదురు చూస్తూ బిక్కుబిక్కుమంటూ వున్నారు.

భూమాతను నమ్ముకొని పంటపండించిన రైతులు పంటను అమ్ముకోలేక కన్నీరు పెడుతున్నారు .నిత్య అవసరములకు ఇల్లు దాటి వెళ్లలేక ఓవైపు భయము గుప్పెట్లో ఒదిగి పోతూనే

కొనుటకు డబ్బులు లేక కొందరూ రోదిస్తూ ఉంటే ఎప్పుడు మారును జనుల బాధలు అంటూ ముక్కున వేలు వేసుకుంటున్న సమస్త జనవాహిని ధీన గాథ తీరేదెన్నడు ?బ్రతుకులు బాగుపడేదెన్నడు ?అంటూ ఇష్ట దేవుళ్లను ప్రార్థిస్తున్నారు.

కాలము ఒడిలో కన్నీటిని కరోనా బాధను కవులు తమ కవితల రూపములో ఉత్తేజ పరుస్తూ కరోనాను ముక్కలు ముక్కలుగా తుంచి ఖండిస్తున్న సాహితీ లోకము ఓ వైపు.

ఆగర్భ శ్రీమంతులు అయిన కరిక పేదోడు అయినా కరోనా ఏ రూపములో వస్తోందో ఎలా వస్తుందో తెలియక ప్రాణాన్ని గుప్పెట్లో పెట్టుకొని భయముతో విలవిలలాడిపోతున్నారు.

జీతము మీదనే ఆధారపడి బ్రతుకుతున్న సగటు బ్రతుకులు త్రిశంక స్వర్గములో అలా ఊగిసలాడుతున్నాయి. ఎలాంటి వైద్యం చేయాలో ఏ మందులు వాడాలో తెలియని సంకట స్థితిలోఎన్నో ప్రాణాలు గాలిలో దీపములా ఆరిపోతున్నాయి.

వైద్యము చేస్తూ దేవుడిలాంటి మనిషి డాక్టర్ ని కూడా కరోనా కాటేస్తూ ఉంటే ఇక జనుల ప్రాణాలు కాచేదెవరో ? బడి పిల్లల భవితవ్యము మధ్యలో ఆగిపోయి పరీక్షలు కూడా లేకుండానే పై తరగతులకు వెళుతున్న వైనము. సూర్యునికి గ్రహణము పట్టినట్టు అన్ని దేవాలయాలకు కరోనా గ్రహణము పట్టింది కాబోలు. పూజలు వ్రతాలతో కిటకిటలాడే దేవాలయాలు జనాల సందడి లేక మూగపోయాయి ఇదేమీ కళికాలము మాయ.

అగ్ర రాజ్యాలు కూడా దిబ్బలుగా పడివున్న శవాల మధ్య కన్నీటి సంద్రమై ఆక్రందనల్లో నిలువెత్తున విలవిలలాడుతున్నాయి.

లాక్ డౌన్ లో జనాలు ఏప్పుడూ వీడ్కోలు పలుకుతామో అన్న తరుణములో అనేక మంది మత ప్రార్థనల ఫలితముగా ప్రపంచ మంతా శరవేగముతో మరోసారి కరోనా అన్ని ప్రాంతాలకు విస్ఫోటనంతో ఇంకా లాక్ డౌన్ పటిష్టమై మనిషిని చిక్కుల్లోకి నెట్టింది.

రోజురోజుకు పెరుగుతున్న కరోనా మరణాలతో భీతుల్లుతున్న ప్రభుత్వాలు లోటు బడ్జెట్లో మునిగి జీతాలు చెల్లించలేక చేతులు ఎత్తేస్తుంటే సగటి ఉద్యోగి సమస్యల సుడిగుండములోశవమై పోతుంటే దయలేని కరోనా మహమ్మారికి విరుగుడెప్పుడో మరి. తన వారిని కరోనా మాయదారి కమ్మి యమపురికి అలా తీసుకుపోతుంటే తనవారికిదూరమై రోధిస్తున్నా జాలి కలుగదేమి ఈ కరోనా రాక్షసికి. మలేరియా ప్లూ మందులు కరోనా కు వాడవచ్చు అంటూ మందులను అవపోసన పడుతున్నా ఏటూ తెరుకోక పోతూ ఉన్న స్థితి. పోలీసులు రక్షణ కోసము ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని ఓ వైపు ఇంటిలోనే ఉండలేక యువత రోడ్డుపైకి వస్తూ కరోనా ను వ్యాపిస్తూ ఉన్నారని ఓ వైపు నిత్య వాహనాలు జనాలు రద్దీ తగ్గి కాలుష్యం తగ్గిందని ఓ వైపు స్వంత ఊర్లు చేరే ప్రయత్నంలో మార్గ మధ్యములో చిక్కుకుని గుప్పెడు బువ్వకోసము చుక్క నీరు కోసము విలవిలాడుతూ ఉంటే ఎవ్వరికీ చెప్పాలో ఏమి చేయాలో తెలియని దుర్భిక్షం.

తచెప్పలేని వారి బాధ ఏ దేవుడికి కనిపించ దాయె. రెడ్ జోన్ హై అలెర్ట్ జోన్ అంటూ ఎన్నో సెక్షన్లు. సగం వేతనపు గుది బండలో ఉద్యోగుల అగచాట్లు. పరీక్షలు లేక పిల్లలు అష్టకష్టాలు పాలుఅవుతూ చదువుకు దూరము అవుతూ వుంటేను. ఎప్పుడు ముగుస్తుందో కరోనా మరణాల పర్వము అంటూ ప్రతి ఒక్కరూ ఎదురుచూస్తున్నారు.

కరోనా పై యుద్ధము ప్రకటించి గృహ నిర్బంధములో సామాజిక దూరమును పాటిస్తూ, కరోనాను నాశనము చేసే దిశలో దూసుకుపోతూ సాంప్రదాయ పద్ధతుల్లో మనం స్వచ్ఛ భారత్ కోసమై శ్రమిస్తూ .కరోనా రహిత సమాజం కోసమై ముందుకు సాగుదాము.

జై భారత్ .జై జై భారత్...!!!

–ధనాశి ఉషారాణి
9121096397

యుద్ధం!

కరోనా రంగప్రవేశంతో
శిథిలావస్థలో ఉన్న క్రమశిక్షణకు
అందమైన పునరుజ్జీవనం.
ప్రపంచ వ్యాప్తంగా మన భారతీయ
'నమస్తే' సంస్కృతికి గుర్తింపు.
'అంటు, ముట్టు నిషేధం'
అక్షరాలా అమలు.
తోపుళ్ళు, తొక్కిసలాటలు
ఎక్కడా కానరావు ఇప్పుడు.
ఆప్యాయ కౌగిళ్ళకు
ఆరడుగుల దూరంతో విరామం.
మనిషి మనిషికి ఎడం
తప్పనిసరిగా పాటిస్తే ఆరోగ్యం
దాటేస్తే ఘోరం.
'టచ్ మీ నాట్'.. ప్రపంచానికంతా
నేటి ప్రజారోగ్య సూత్రం.

'గాలి ముద్దుల' కాలమిది
నాటి మేఘ సందేశాలు
మరపురాని మధుర జ్ఞాపకాలు.
ఫేస్‌బుక్, వాట్సప్, ట్విట్టర్లు
నేటి క్షేమ సమాచార సౌకర్యాలు.
ఊహించామా కలలోనైనా..
'మన చేతులే' మన ఆయురారోగ్యాలకు
భస్మాసుర హస్తాలవుతాయని!
తుమ్ము, దగ్గు తుంపరలే
తోటివారికి ప్రాణాంతకాలవుతాయని!

ప్రళయంలా ప్రపంచమంతా విస్తరించి
మానవ జాతి ఉనికినే ప్రశ్నిస్తున్న
కరోనా మహమ్మారిపై మనిషి సాగిస్తున్న
ఓ విషమ పోరాటం ఇది.
ఏ ప్రళయానికైనా
జీవిత కాలం తక్కువ.
ఆ కాల వ్యవధిలోనే అరికట్టాలి
కరోనా వైరస్ విజృంభించకుండా.
భయంతో పారిపోతే తరిమి పట్టుకుంటుంది
ఎదురొడ్డి నిలబడితే
తోక ముడిచి పారిపోతుంది.
ఒక్కరి కోసం అందరు కలిసి
అందరి కోసం ఒక్కరు నిలిచి
పోరాడాల్సిన సమయమిది.
గాలిలో దీపం పెట్టి
దేవుడిపై భారం వేయొద్దు.
ఇప్పుడు చేయాల్సింది యుద్ధమే
ఒక విచిత్రమైన యుద్ధం ఇది.
కలిసి కట్టుగా అయినా, ఒక్కుమ్మడిగా కాదు..
విడివిడిగా.. ఒకరికొకరు దూరంగా
స్వీయ నిర్బంధంలో ఉంటూ
ప్రభుత్వ యంత్రాంగానికి సహకరిస్తూ.

కరోనా బారి నుండి అందరిని కాపాడాలని
కుటుంబానికి దూరంగా ఉంటూ
అహర్నిశలు అపాయం అంచుల్లో
అనునిత్యం పోరాడుతూ
పరిశ్రమిస్తున్న పాలనా వ్యవస్థకు
వైద్య, పోలీసు సిబ్బందికి పారిశుద్ధ్య సైనికులకు
శతకోటి వందనాలు సమర్పించడం తప్ప
ఇంకేమిచ్చి రుణం తీర్చుకోగలం?!

– ఆచార్య కడారు వీరారెడ్డి
9392447007

సంపన్నుల (సా)పాట్లు

జీవితాన్ని పిప్పి చేసి
కుడి ఎడమల దోచేసి
త్రిజోడీని నింపేసి
సంపన్నునిగా ఎదిగి
నేనే రాజు నేనే మంత్రంటూ
విర్రవీగి లాభమేమి ?

అంగట్లో అన్నీ ఉన్నా
నా ఒంట్లోనే శని ఉంది
సంపన్నుల రోగాలు
శేష జీవితమే బుగ్గిపాలు !

ఖరీదైన పరుపుంది
నిద్రే సన్నపూసైంది
పల్లెం నిండా స్వీట్లు
బిపి, షుగర్లతో పాట్లు !

బియండబ్యు కార్లు
ఊబకాయ నడకలు
బాసుమతీ సువాసనలు
దివ్య ఔషధ జొన్నన్నాలు !

అల్పాహార ఘుమఘుమలు
ఒంటిపూట సాపాట్లు
లేనప్పుడు గంజి గట్కు
ఉన్నప్పుడు ఓట్స్ మజ్జిగ !

పేదోడిగ తిండి కరువు
ఉన్నోడిగ తినవివ్వరు
గుట్టలుగా సంపదలు
పుట్టలుగా ఖరీదైన రోగాలు!

సంపాదన విషవలలో
చిక్కిశల్యం కాక ముందే
ఆరోగ్యమే భాగ్యమంటు
సాగాలి మున్ముందుకు !

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

సన్నద్ధం

నీ మనసే మహారాజు
నీవే ఒక సైన్యం
స్వీయ నిర్బంధమే నీ ఆయుధం
విడిచి పరిశుభ్రతాదాలుని.. గాయపడకు!

ఇల్లే నీ రక్షిత దుర్గం
ఇంటిచుట్టూ పాంచివుంది శత్రుమూక
సంకల్పమే నీ లక్ష్మణరేఖ
గీతదాటి.. ఓడిపోకు!
'మాస్క్' నీ కవచం 'శానిటైజర్' రక్షా వలయం
భౌతిక దూరం నువ్వెక్కిన రథం
ఆమోదించకు.. మోహపు శల్య సారథ్యం!

సమాజహిత తంత్రం రచించు...సహకార రణనీతి నాచరించు
సడలని నియమాల వ్యూహాన్ననుసరించు
చిన్న అజాగ్రత్తతో.. ఫలితాన్ని చేజార్చుకోకు!

వైద్య, ఆరోగ్య వీరుల నిబద్ధతకి నమస్కరించు
పారిశుద్ధ్య కార్మికుల ఘనసేవల నభినందించు
రక్షక భటుల ధైర్య సాహసాలను కీర్తించు
ప్రభుత్వ దారిదీపాల నొదిలి చీకటి కూపాన పడకు!
ఆరోగ్యం కోసం తప్పదీ యుద్ధం
ఇందు మానవ జాతంతా ఒకే పక్షం
ఇది కరాళి 'కరోనా'తో సాగుతున్న ఘోర యుద్ధం
కడదాకా పోరుకు కావాలి నువ్వు సన్నద్ధం!

–కాశింబి
సెల్: 9052216044



"కరోనా" తుంపర్లు!

"మంత్రాలబలం లేకున్నా
తుంపిర్ల బలముండాలి"
అన్నది ఆనాటి పాత సామెత!
"మంత్రాల బలంకన్న
తుంపిర్ల బలమే మిన్న"
అన్నది నేటి కొత్త సామెత!
ఎందుకంటే
తుమ్ములు– తుంపర్లు
అధునాతన మహమ్మారి 'కరోనా'కు
ఆధారమైన 'బంపర్లు'

ఒకరి నుంచి మరొకరికి "జంపర్లు"!
అందుకే బలీయమైన కరోనా
అంటువ్యాధి ప్రబలడానికి
ఆసరా అవుతున్నవీ తుమ్ములు– తుంపర్లు!
కావున మాస్కులతో సామాజిక దూరాలతో
కట్టడి చేయాలి వాటి 'టెంపర్లు"!

– డా॥ వడ్డేపల్లి కృష్ణ
9246541699

యుద్ధంలో గెలవండి

వందనం వందనం వైద్యులకు వందనం
పారిశుద్ధ్య కార్మికుల పాదాలకు వందనం
మా అందరి ప్రాణాలకు మీ అందరి ప్రాణాలను
ఫణంగా పెట్టుతుంద్రు కరోనాతొ పోరుతుంద్రు
సాటి లేరు మీకు ఎవరు....
మేటి రారు మీకు ఎవరు.... "వందనం"

కరోనాను ఖతం చేయ ప్రాణం లెక్క చేయకుండ
పోరుతుంద్రు మా కొరకు మీరెంతో తెగువతోని
ఇల్లు నొదిలి పల్లె నొదిలి ఉధ్యోగమె ఉధ్యమంగ
కుటుంబాలను వదిలి చేస్తున్నరు త్యాగాలను "వందనం"

కరోనా అంటు కుంటె అంతం నీ జీవితం
పంతంతో లాక్ డౌన్ పాటించు ధీక్ష తీరు
ఇంటిలోనె వుండండి రోడ్డు మీది కెక్కకండి
దెబ్బలాట ఆడకండి యుద్ధంలో గెలవండి "వందనం"

రాత్రి పగలు కష్టపడి కరోనాను తరిమి కొట్టె
సేనలకు నీ పంతు మద్దతును అందించూ
అందరము ఒక్కటిగా ఇంటిలోనె వుందాము
కరోనాను తరిమెద్దాం మన కర్తవ్యం బ్రతికిద్దాం "వందనం"

– ఉప్పెన
8106073661

నేటి నిజాలు

బతుకుబాటలో
రక్తమోడుతున్న నడకలో కుప్ప జీవులు గాయాలు
అలుగడుగునా దుఃఖిస్తున్నాయి... మౌనంగా
కరోనా' మహమ్మారి విలయతాండవంలో
కడుపుకావిన పేగుకాసనంతో
అటూ - ఇటూ కదులుతున్న ఆ.. బాటసారులు
దిక్కు తెలియని పక్షులై ఈకన్ని రాల్చుకుంటున్నాయి

ఆ.. దుఃఖితులు ఆకలితీర్చే నాథుడేడి
ఆ.. బాధితులను ఆదుకునే ఆపన్నహస్తాలేవీ ...?

- కెరె జగదీష్

దిగ్బంధం

నిశ్శబ్దాన్ని చీల్చుకుంటు
ఓ శబ్దం నిట్ట నిలువునా
పుట్టుకొచ్చింది!
ఆ శబ్దం చేస్తున్న ప్రకంపనలకు
ప్రజల స్థితిగతులు అతలాకుతలం
అవుతున్నాయి!
వింతగా అనిపించినా
ఇంతకు ముందు చూడని
జన హననం అది!
మానవ తప్పిదాలకు మచ్చు తునక
అవునన్నా కాదన్నా
తప్పించుకోలేమిక!
సామ్రాజ్యవాదమో..
వ్యాపార స్వలాభమో
చీకటి కోణంలో
ఇంతకాలం నిశ్శబ్దంగానే వుంది

ప్రపంచపు చావు కేకల శబ్దం
ఒక్కసారిగా నిజాన్ని వెలికి తీసింది..!
జీవరసాయనాయుధం
కరోనాతో యుద్ధం
కనిపించని శత్రువుతో
జీవన్మరణ పోరాటం!

ఇప్పుడు కావల్సింది
దాన్ని నిలువరించే అస్త్రం
రాజు, పేద తేడాలేని
స్వీయ నిర్బంధనం..!

– శివ మంచాల
సెల్: 9004428159

చుట్టూ కోరలు చాచి
మనిషిని కాటేద్దామని
మనిషిలోనే దాగి
ఒక విషపు తుంపర
ఎన్నో పొలిమేరలు దాటి
మనదాకా వచ్చింది.
మిత్రమా.....!
నిన్నటిదాకా కరచాలనంతో
కలిసి ఊరేగినోళ్లం
మళ్లీ దగ్గరవాలంటే...
కొన్నాళ్లు దూరముందాం.
"నమస్కారం" ప్రక్రియతో
పలకరించుకుందాం.
-మునిమడుగుల

రావమ్మా ! శార్వరీ
సంపదలిమ్ము శార్వరీ
సంక్షోభమును బాపగ
స్వాగతము శార్వరీ !
ఎటుపడితె అటుమ్మబోకు
ఏదంటది పట్టుకోకు
నీతో పాటందరినీ
కరోనాకు బలిచేయకు !
సాకులేవి చెప్పమాకు
సాహసాలు చేయబోకు
నీతో పాటందరినీ
కరోనాకు బలిచేయకు !
చైనాగతి పట్టనీకు
మరో ఇటలి కానీయకు
నీతో పాటందరినీ
కరోనాకు బలిచేయకు !
రానుంది మంచికాలం
ఋషిపథమున కనుకూలం
జగతియంత భారతినీ
ఎరిగి కొలుచు చిరకాలం!

-పటేల్ శివకుమార్ (యోగా)

చైనాదే దుష్టబుద్ధి
చైనాదే దొంగబుద్ధి
వైరస్‌లు కుట్టిన దొంగ
చైనాదే నీచబుద్ధి !
వైరస్‌లకు బ్యాంకులంట
చైనాలో ఉన్నవంట
వూహాను నగరమంతా
పాపాలవి పుట్టలంట !
నక్కబుద్ధి ఉన్నవాడు
తిక్క తిక్క కుక్కవాడు
జన్‌పింగ్‌ను మించినోడు
లోకాన లేనేలేడు !
కరోనా విషపంజరం
ప్రపంచం వసి పావురం
హననానికి కారణమిది
చీనీ కండకావరం !
గడప దాటెళ్లొద్దంది
ఇంటిపట్టు నుండమంది
మన నూతన వత్సరం
శార్వరీ నామ ఉగాది !

-శ్రీవారి దామోదర్

అలింగనము వద్దు
కరచాలనము వద్దు
కరోనా నివారణకు
నమస్కారమె ముద్దు !
ఇంటిలోనే ఉందాము
సరిపెట్టుకొని తిందాము
కరోనాను పారదోల
కష్టాలను ఓర్చుదాము !

- ఈర్ల సమ్మయ్య

యుగయుగాల మన ఉగాది
సరికొత్త మలుపులుగాది
జాతకాలు జెప్పుటకై
వచ్చె శార్వరి నామాది !
కోయిలమ్మ పలుకులేవి
స్వచ్ఛమైన మనసులేవి
ప్రకృతి కళ విహీనమున
మన పండుగ శోభలేవి !
కరోనాయె వచ్చుడాయె
జనులందరు సచ్చుడాయె
నూతన కార్యములేల ?
మన బ్రతుకులు ఆగమాయె !

-ఆంజనేయులు

మన పండుగే "ఉగాది"
తెలుగు సంవత్సరాది
కొత్త ఆశల చిగురు
స్వాగతం పలుకుతుంది !
నవ వసంత ఆగమనము
మామిడాకుల తోరణము
ఉగాది పచ్చడిలో
షడ్రుచుల సమ్మేళనము !
ఊరిలోన ఉత్సాహము
పంచాంగ పఠన శ్రవణము
పన్నెండు రాశులందు
ఉండును మన కర్మఫలము !
శార్వరి సంవత్సరము
అందించాలి విజయము
కరోనాపై 'పైచేయి'
సాధించాలి దేశము !

-ప్రతిభా భారతి

ఓ శార్వరి స్వాగతము
షడ్రుచులనే తాపుము
ఆనందము మదిన నింపి
దీవించుము యీ దినము !
వికారి తెలివితోని
శార్వరినిటు రమ్మని
కరోనాను అప్పజెప్పి
జారితివే సెలవని !
కరోనా నీ వొచ్చితివి
గుబులునెంతో రేపితివి
ఇండ్లలోనే బంధించి
మా తమాషాలు జూస్తివి !

-గోపాల్

శార్వరి తెలుగు ఉగాది
ఋతుచక్రమునకు ఆది
కష్టసుఖాలు తెలిపేది
షడ్రుచులున్న ఉగాది !
వికారిలోన వచ్చెను
వింతలెన్నో చేసెను
ఓ శార్వరి నిను వేడెద
విడిపించుము కరోనను !

-బోయ శేఖర్

రోగము లేదని తిరుగకు
పదిమందిలోకి వెళ్లకు
తుమ్ము దగ్గులంటుకొనీ
కరోనాకు ... దొరికిపోకు !
విచ్చలవిడి తిరుగవద్దు
రోడ్లపైకి రానెవద్దు !
ప్రమాదాన్ని గుర్తించుట
నీవెప్పుడు మరువవద్దు !
ప్రభుత్వాల మాటలిను
వైద్యుల సలహాలవిను
మూర్ఖత్వం వదిలిపెట్టి
భద్రముగా మసలుకొను !
వచ్చిందా ! ... ఆగదది
మన గొంతును వదలదది
ప్రాణం పోయేంతవరకు
తనువు నుండి కదలదది !
మిత్రులార ! జాగరతా !
దానిముందు మనమెంతా ?
అద్దుబందులో నున్నా !
చూస్తాడు ... దేవుడంతా !!

-సి. అర్జునయ్య

మధురమైన మాటలు
చక్కనైన చేతలు
ఉన్నవారి బతుకుల్లో
నిండుతాయి వెలుగులు !
దేశములో పేదప్రజలు
చదువుకుంటె కలుగు మేలు
విద్యవలన కొంతవరకు
మార్చవచ్చు తలరాతలు !

-కె. భానుశ్రీ

ఈ సృష్టికి ఆరంభము
తెలుగు జాతి శ్రీకారము
యుగానికి ఆది మన
నవ ఉగాది పర్వదినము !
మనకు జీవన పాఠాలు
ఉగాది పచ్చడి గుణాలు
తీపి పులుపు వగరు చేదు
కారం ఉప్పు షడ్రుచులు !
శిశిరాన రాలె ఆకులు
మనలోపలి దుర్గుణాలు
నవ వసంత పల్లవులే
మన ఆనందపు గుర్తులు !
దుర్గుణాలను రాల్చాలి
కోరికలు చిగురించాలి
నిత్య వసంతముతో
చిరునవ్వులే మెరవాలి !
మన చేతులే శత్రువులు
మాస్కులయ్యె మన మిత్రులు
కరోనాతో ఘోషించె
సకలజనాల హృదయాలు !
మామిడి తోరణం లేదు
ఉగాది పచ్చడియు లేదు
కరోనా బాధితులకు
పంచాంగ శ్రవణం లేదు !
కాలు బయటపెట్టలేము
జనములోన తిరగలేము
ఐన శుభాలివ్వాలని
శార్వరికిది ఆహ్వానము !
వికారి వినాశనము
కరోనా కర్కశము
చూపినా పలకాలి
శార్వరీకి స్వాగతము !

-శీలోజు శోభన్‌బాబు

పుట్టలోన సైన్సు వుంది
తట్టలోన సైన్సు వుంది
చెత్తనంత ఊడ్చివేసె
కట్టలోన సైన్సు వుంది !
కష్టమొచ్చినప్పుడు
నష్టమొచ్చినప్పుడు
భయపడకు ఓ నేస్తం
చావు వచ్చినప్పుడు !

-జె. భవాని

గతి తర్కం తెలుసుకొనె
గ్రహగతులను కనుక్కొనె
గతంలోనే ఉగాదితో
కాలం గణియించుకొనె !
పండుగ ప్రారంభమాయె
ప్రతి గడపకు చేరువాయె
ప్రతీ సంవత్సరము
ఉగాది వాసంతమాయె !
ప్రభవ నుండి మొదలుపెట్టె
ప్రతీ యేడు లెక్కగట్టె
పంచాంగం ఉగాదినే
భవిష్యత్తు తెలుపవట్టె !
గతించిన ఉగాది కంటె
వికారి వర్షంబు కంటె
ఘనమైన బ్రతుకునిచ్చు
శార్వరి యన్నింటికంటె !

-శివాజి రవీందర్

ఓ ! నూతన వత్సరమా !
శార్వరి నామ, రూపమా !
స్వాగతమమ్మా నీకు
నవవసంత లంకృతమా !
నునులేత కిరణాలతో !
వికసించిన కలువలతో
లేమామిళ్ళ వాసనలు
వ్యాపించె పరిమళముతో !
కోకిలల రాగాలతో !
తెలుగువత్సర రాకతో !
అవని పరవశించెను
ప్రకృతి రమణీయతతో !
సంస్కృతి సంప్రదాయాలు
పసుపు, కుంకుమ తిలకాలు
నూత్నశోభతో వెలుగును
"ఉగాది"న మన గ్రామాలు !
తెలుగు సంవత్సరాది
కష్టాలనే సమాధి
చేస్తూ ... సరికొత్తగా
వస్తూంది మన ఉగాది !
నూతన శోభలు తెస్తూ
చేతనత్వాన్ని మోస్తూ
ప్రకృతి ఆకృతిలోకి
ఉగాది నాహ్వానిస్తూ

-మణికర్ణిక

మణిపూసల ప్రక్రియలో

శ్రీ శార్వరి నామ ఉగాది కవిసమ్మేళనము

ఒక పక్క దేశమంతా లాక్‌డౌన్ ...
మరోపక్క కరోనా విజృంభణ ...
ఈ రెండింటి మధ్యలో జరిగిన శ్రీ శార్వరి నామ ఉగాది

ఈ నేపథ్యంలో వినూత్న రీతిలో జాతీయ స్థాయిలో జరిగిన మణిపూసల కవి సమ్మేళనం

మణిపూసల సాహితీ వేదిక అనే వాట్సప్ గ్రూప్‌ల ద్వారా శ్రీ శార్వరీ నామ ఉగాది రోజున మధ్యాహ్నం 2 గం. నుండి రాత్రి 12 వరకు ఉగాది కవి సమ్మేళనం జరిగింది. మణిపూసల రూపకర్త వడిచర్ల సత్యం అధ్వర్యంలో టి. ఆశీర్వాదం, ఘనపురం పరమేశ్వర్, ఈడ్గి సుధాకర్ గౌడ్, కల్లూరి ప్రభాకరాచారిల సహకారంలో అత్యంత వైభవంగా వినూత్న పద్ధతిలో జరిగిన ఈ అపూర్వ కవి సమ్మేళనములో 64 మంది కవులు పాల్గొని, తెలుగు సంవత్సరాది, ఉగాది మరియు కరోన మహమ్మారి అంశాలను కవితా వస్తువులుగా చేసుకొని, తాము సొంతంగా రచించిన మణిపూసలను ఆడియో, వీడియోల ద్వారా కవితా పఠనం చేసి వాట్సప్‌లకు పంపించారు. మణిపూసలకు చెందిన రెండు వాట్సప్ గ్రూప్‌లలో ఈ కార్యక్రమం కొనసాగింది. ఇందులో ఉన్న 400 మంది సభ్యులు ఈ కవిసమ్మేళన మును విన్నారు. వీక్షించారు.

కరోనా మూలంగా ప్రభుత్వాలు విధించిన కర్ఫ్యూ వలన ఎవ్వరు కూడా బయట సభలు, సమావేశాలు ఏర్పాటు చేయడానికి అనుమతి లేదు. ఇట్టి సందర్భంలో 3 రాష్ట్రాల నుండి పాల్గొన్న ఈ కవులందరూ ప్రత్యామ్నాయమార్గంగా సామాజిక మాధ్యమాలలోని వాట్సప్‌ను వేదికగా తీసుకొని ఒక నిర్దిష్టమైన సమయంలో ఈ కవి సమ్మేళనమును వారి ఇండ్లలోనే నిర్వహిం చుకోవడం విశేషం. తెలుగు సాహిత్యంలో ఇది ఒక నూతన ఒరవడిగా చెప్పవచ్చు. ప్రజలను చైతన్యపరిచే ఉద్దేశంతో సాగిన ఈ కవి సమ్మేళనంలోని కొన్ని మణిపూసలు 'నేటినిజం' పాఠకుల కోసం ....

-సంపాదకులు

ఈ శార్వరి నామమున
ఉగాది పర్వదినమున
అందరికి శుభాకాంక్షలు
తెలిపెద ఈ సుదినమున !
ప్రపంచాన్ని చదవాలి
కలము చేతబట్టాలి
కరోనాను ఎదిరించెడి
కవితల్నే రాయాలి !

-చౌకి రాజేంద్ర

కరోనా సూక్ష్మజీవులు
కలికాలపు అణుబాంబులు
ఆరోగ్య రక్షణ కొరకు
తీసుకొనుము జాగ్రత్తలు !
ఇంటిలోపల ఉండండి !
నియమాలు పాటించండి !
ఇటలీకి పట్టిన గతి
పట్టకుండను చూడండి !
రోడ్లపైన తిరగరాదు
గుంపులుగా ఉండరాదు
లాక్‌డౌన్ పాటిస్తే ...
కరోనా రోగము రాదు !
కరచాలనం వద్దు
నమస్కారం ముద్దు
కరోనా నివారణకు
మన సంస్కృతే హద్దు !

-కరణం మాణిక్‌రావు

కాలుష్యపు ఆహారము
తీసుకున్నను ప్రమాదము
మానవులే ఈ సృష్టి
నాశనానికి కారణము !
మదిలో సంకల్పముంటె
నిత్యం పనిని చేస్తుంటె
ఏదైనా సాధ్యమగును
ధైర్యంబును వీడకుంటె !
రైతే మన దేవుడు
గురువే మన దేవుడు
ప్రాణాలను కాపాడెటి
వైద్యుడు మన దేవుడు !

-జె. నవనీత

మన సంస్కృతి నిలపాలి
పద్ధతులను తెలుపాలి
అన్ని పండుగలను జరిపి
మహిమనంత చాటాలి ...
సిద్ధముగుండు పర్వముకు
జరుపుకోకుండ ఉండకు
సాంప్రదాయబద్ధమైన
పండుగలెన్నడు మరువకు !
ఋతువును అనుసరించి
తిథులను అనుసరించి
వచ్చే పండుగలను
చేయవలె పాటించి ...
మన పండుగలు ఉండగ
దేశేతరము దండుగ
షడ్రుచుల కలయికలో
జీవితసార ముందిగ !
వివిధ రకాల రుచులతో
జీవితానుభవాలతో
ఆరోగ్యం కలిగించును
మన ఉగాది శోభలతో !

-స్వాతి సునీల్

చైన దేశ మహమ్మారి
మనదేశం వచ్చి చేరి
ఒకరి కొకరు కలువకుండ
మూసివేసెను రహదారి !
కరోనయే వచ్చెను
జనుల ముందు నిలిచెను
స్వచ్ఛభారతము నాకు
నచ్చదంటు పలికెను !
షేక్‌హ్యాండు ఇష్టమట
హాగింగు ప్రాణమట
నమస్కారము కూడిన
నమస్కార మొద్దట !
వేప గొప్ప తెలిపెను
పసుపు ఒంటి చేర్చెను
వెల్లల్లి మిరియాలే
ఔషధమని చాటెను !

-యం. రాఘవేందర్

వసంతానికి స్వాగతం
వసుధపై మా స్వాగతం
వికారికి వీడ్కోలుతో
శార్వరికి మా స్వాగతం !
యుగానికి ఆది ఉగాది
కలియుగానికిదే నాంది
సంబరాలు కొనితెచ్చి
మనకు తెలుగువత్సరమిది !
నులివెచ్చని కిరణములు
ఆకుపచ్చని తరువులు
ఆమనికి పరవశించు
కోయిల మధుర రవళులు !
జీవితం ఒక పంటకం
ఆరు రుచులకు మూలకం
సమపాళ్లలో కలిసిన
అనుభవాలకు కేంద్రకం !

-దేశపతి మోహన్‌శర్మ

వీడుకోలును వికారి
ఆహ్వానమో శార్వరి
కరోనా కారణంగా
ఉత్సవాలు లేవుమరి !
ఆదాయం పోతుంది
నష్టమేమో వస్తుంది
కరోనా ఉగాది మనకు
బాధ్యత బోధిస్తుంది !
వైద్యులు రక్షకుల రణము
కరోన వైరస్ బాణము
ఇల్లే లక్ష్మణరేఖ
దాటిపోయినను మరణము

-యెలకంటి సత్యనారాయణ

పరిశుభ్రత పెంచినాము
పాటలాట వీడినాము
సభలు పెండ్లి సంబరాల
సందడి దగ్గించినాము !
కరస్పర్శ మానినాము
కైమోడ్పుడ పూనినాము
కరములను సబ్బుతో
కడగమొదలు పెట్టినాము !
దగ్గువార లెదురైన
దరికిపోము సుంతైన
దస్తిచేత ముక్కునోరు
దాచుకొందుమెట్టైన !
తాకలేవు మమ్మింక
చూడకింక మా వంక
తగు జాగ్రత్తలు పెరిగె
చింతలేదు మాకింక !

-గండూరి లక్ష్మీనారాయణ

ఉగాదులు నాకులేవు
ఉషస్సులు నాకులేవు
కరోన భూతం వలన
నాకేమి దొరకలేవు !
పచ్చని చెట్లన్నివాయె
పంటచేలు బీడులాయె
రియలెస్టేట్ మహిమ వలన
వేపపూత దొరుకదాయె !
కొత్త చింతపండులేక
కొత్త కుండ తెచ్చుకోక
ఎటుల జేతునే ఉగాది
చెరుకు గడలు గానరాక !
పక్కింటికి వోదమన్న
సంతలోన కొందమన్న
కరోన భూతంబు వలన
అన్నీ బందాయె నన్న !
ఏమి సేతు పండుగ
ఎట్ల జేతు పండుగ
కరోన కాటు వలన
చేదొకటి మిగిలెనుగ !

-టి. ఆశీర్వాదం

ఉగాది పండుగొచ్చింది
ఊరు వాడలు తిరిగింది
పండుగ సందడి లేదని
బిత్తరపోయి చూసింది !
ఇంటి నుండి కదలొద్దు
ఎవరితోను కలవద్దు
చుట్టాలు పక్కాలు
మిత్రులెవరు రావద్దు !
శార్వరి సంవత్సరమా
బాధలెన్నో చూడుమా
ఆ కరోనా బూచిని
నీవే తరిమి కొట్టుమా !

-ఎడ్ల లక్ష్మి

కరోన వచ్చి జనులంత
తల్లడిల్లుచుండిరంత
నియమాలను పాటించుతు
భీతిల్లుచు నుండి రంత !
జీవనకాంతులు తప్పెను
శోక విదారకమాయెను
శార్వరి యేమిచేయునో
శాంతము నొంద ప్రజలకును !
వికారి వికారములను
శార్వరి తొలగించగను
స్వాగతించుచుంటిమి
నవ యుగాది పండుగను !
షడ్రుచులు ఆస్వాదించు
షడ్గుణాలను వదిలించు
సద్గుణాల పెంచుకొని
సౌఖ్యముగాను జీవించు !

-వేముల శ్రీ చరణ్ సాయిదాస్

ఏమని రాయాలి నేను
ఆమని నే చూడలేను
ఇంట్లో బందీనయ్యా
నిలువరించ కరోనాను !
వేప పూత దొరకలేదు
మావిపిందె జాడలేదు
కొత్త చింతపండు కరువు
కుండనసలు కొననె లేదు !
కడిగి కడిగి చేతులరిగె
హస్తరేఖలన్ని చెదిరె
ఏది ముడితె యేమౌనో
ననుచు జగతి జనం బెదిరె !
చేతులు జోడిస్తున్నరు
చేతలు మానేస్తున్నరు
వెతలు దీరు దినము వరకు
బతుకు లెల్లదీస్తున్నరు !
ఏమమ్మా శార్వరి
చూపవమ్మ ఓ దరి
పండగ చేస్కుంటాము
దాటి వచ్చి ఈ గిరి !

-శాడ వీరారెడ్డి



పిల్లలేమొ చదువాలి
పెద్దలు పనిచేయాలి
జ్ఞానసంపదల తోడ
దేశం బాగుపడాలి !
కోపమొద్దు కోపమొద్దు
నీకెప్పుడు కోపమొద్దు
మనసుకు భారంబయ్యే
అనవసరపు కోపమొద్దు !
ఆశలున్న వారందరు
ఆకలాకలని యంటరు
ఆశలేని వారందరు
ఆకలి తీరుస్తుంటరు !
పచ్చనైన పొలాలు
పసందైన ఫలాలు
చైతన్యము కురిపించును
కవుల చేతి కలాలు !
అవార్డులను అందుకున్న
సన్మానము జేసుకున్న
కారణమేంటని అడిగితె
మణిపూసని జెప్పుకున్న !
జంతుజాతి వుండాలి
పక్షిజాతి వుండాలి
జీవులకు జీవించే
హక్కు తప్పకుండాలి !

-బి. నాగరాజు

పోయి రావమ్మ వికారి
కావు మమ్ముల శార్వారి
కబళించవచ్చె జనులను
కరోనాను మహమ్మారి !
పంచాంగ పఠనం లేదు
పచ్చడెవరు బోయలేదు
కరోనా వచ్చెనంటు
బయటికెవరు రానులేదు !
శార్వరి శరణంటినమ్మ
శాంభవి మము బ్రోవవమ్మ
అంటువ్యాధుల నుండి
అవనిని రక్షింపవమ్మ !

-కావేటి వీరమల్లేష్

వికారి వెళ్ళిపోయెను
కరోనానిట నిలిపెను
ఓ శార్వరి నీవైనా
సంతసాలను పంచుము !
ఉగాదియే ప్రథమిది
ఇదే తెలుగు వారిది
నవ సంవత్సరం కొరకు
చూడాలి యేడాది !
షడ్రుచులన్ని కలపగా
పచ్చడియౌను చక్కగా
దానిని సేవించినచో
రోగాలిక దూరముగా !

-వనజ

వచ్చెను ఉగాది పండుగ
తెచ్చెను ఆశలు మెండుగ
సుఖశాంతుల ఊయలపై
ప్రజలుండాలి పసందుగ !
కోయిల సరాగాలతో
ఆరు రుచుల పచ్చడితో
ఆనందము పొందాలి
అందరు విజ్ఞానముతో !

-హాజీపూర్ శ్రీనివాస్

చైనాలో పుట్టింది
సంచారం చేస్తుంది
జాగ్రత్తగ వుండమని
తెలంగాణకొచ్చింది !
సైనికులకు వందనాలు
రక్షకులకు వందనాలు
కరోనరోగుల జూసెడి
డాక్టర్లకు వందనాలు !
మోదిమాట విన్నారు
ఇంటిలోనె ఉన్నారు
ప్రజలంతా కరోనపై
యుద్ధము జేస్తున్నారు !
కరోనాకు మందులేదు
ఇంకా కనిపెట్టలేదు
ప్రయత్నాలు చేస్తున్నరు
దేవుడు కరుణించలేదు !

-బి. రాజయ్య

శ్రీ శార్వరీ రావమ్మ
నవ వసంతం తేవమ్మ
కరోనా కల్లోలమును
నీవైనా దీర్చవమ్మ !
షడ్రుచులతో శార్వరీ
సంతోషంపై స్వారీ
చేస్తు, కరోన కట్టడికి
అభయమివ్వుము శాంకరీ !

-బి. అనంత్

స్వాగతము స్వాగతము
శార్వరికి స్వాగతము
కరోనా రాగాలతో
పలికెదము స్వాగతము !
మధుమాసము చిన్నబోయె
కోకిలమ్మ మూగబోయె
ఉగాది ఉషస్సులేక
లోకమంత చీకటాయె !
ఆరురుచుల పర్వదినము
నేడాయెను విషతుల్యము
కరోనతో లోకమంత
అవుతున్నది బీభత్సము !
పంచాంగా శ్రవణము
కవుల సమ్మేళనము
చరవాణిలో జరిగెను
ఇదియేమీ చిత్రము !
రావమ్మా శ్రీ శార్వరి
రాక్షస విధ్వంసకారి
కరోనాను హతమార్చి
కట్టవమ్మ దాని ఘోరి !

-గాండ్ల వీంమణి

కొత్త బీమారి వచ్చెను
అందరిని పట్టి సంపును
దానిపేరు కరోనంట
అందరికి పాడెగట్టును !
దూరంగుండాలంట
గట్టైతె పాకదంట
శాన సెద్ద బీమారిది
ఎవ్వరిని వదలదంట !
చేతులు కడగాలంట
నీళ్లను తాగాలంట
నియమాలు పాటించిన
కరోనాయె రాదంట !
కరోనా గత్తరంట
చైనకెళ్లి వచ్చెనట
ప్రపంచ దేశాలనిపుడు
దు:ఖంలో ముంచెనట !
సెప్పింది ఇనుండ్రి జరా
ఇంట్లనె ఉండుండ్రి జరా
కరోన రాకూడదంటె
ఏడికి పోకండ్రి జరా !

- డా. వాఘ్మారే జలంధర్

పోరుతోటి ఆరంభము
ఈ యుగాది సంరంభము
కరోనాను ఖతం చేసి
మొదలువెట్టుము సంబరము !
మొక్కవోని దీక్షతోటి
బయటపడని అడుగుతోటి
వైరస్‌ను ఎదుర్కొంటు
జయమునొందు ఘనాపాటి !
నిర్లక్ష్యం అస్సలొద్దు
మన ఇల్లే మనకు హద్దు
వైరస్ దాడి చేస్తే
క్వారంటైనులే ముద్దు !
నమస్తే సంస్కారము
శుభ్రతే ఆచారము
కరోనా కట్టడికి
సామాజికపు దూరము !
నియమాలు పాటించాలి
జనులు సల్లంగుండాలి
ఉగాది ఉషస్సులే
ఇక మన ఇంట కురవాలి !

-గుంటి గోపిలత

ఏమమ్మా శార్వరి
ఏల మేము ఒంటరి
గోడువినని ప్రకృతి
ఏడమూకుడే మరి !
విధియునెంత బలీయము
ఊహించని దారుణము
కరోనా మహమ్మారి
చేసె కరాళ నృత్యము
ఎవరు చేసిన పాపము
ఎవ్వరికి ఈ శాపము
కాలరాత్రివై వచ్చి
కరోనాను త్రుంచుము !
శాత్రవమే మానుము
శామనము చూపుము
కూపస్త శాలూరులను
శాంబరిలో ముంచకుము !
శారదవై రావమ్మా
శార్వరమును త్రుంచమ్మా
శాండిల్యముల గొల్తుము
శార్వరి వందనమమ్మా !

-అడ్డగూడి ఉమాదేవి

షడ్రుచుల పచ్చడేది
పంచాంగ శ్రవణమేది
ప్రజలందరి ముఖాల్లో
పండుగ సంబరమేది !
కనపించని శత్రువంట
కనికరమే లేనిదంట
కరోనా మహమ్మారి
కబళించే వేయునంట !
ప్రపంచాన్ని వణికించెను
ప్రాణభయము కలిగించెను
మన దేశ సంస్కృతిని
మానవాళి కందించెను !
కరములనే కడుగవలెను
కడుదూరము మెలుగవలెను
కరచాలనమే మాని
కరోనాను తరుమవలెను !
విషకరోనా విషాదము
వికారి నామ వత్సరము
శార్వరి రాకతోడ
కావాలి దాని అంతము !



-గొర్రె రాజేందర్

నూతనత్వముగాది
కాలగణనముగాది
ఏకమైన ఆరురుచుల
ఆనందనె ఉగాది !
ఇంటిలోనె ఉందాము
కర్ఫ్యునమలు చేద్దాము
నియమాలు పాటిస్తూ
కరోనాని తరుముదాము !

-వడిచర్ల సత్యం

బీద లేదు ధనికలేదు !
కులంలేదు మతంలేదు !
అంటుకుంటె చాలురా
కరోన నిను వదలబోదు !!
అడ్డులేదు అదుపులేదు !
కన్నీటికి కరుగబోదు !
పరిశుభ్రత పాటించిన
పరిసరాల దరికిరాదు !!
మనిషికింత దూరముండు !
చేతులతో తాకకుండు !
తుమ్మినపుడు తగ్గినపుడు
దస్తి అడ్డుపెట్టుచుండు !!
బయటెపుడు తిరుగకయుండు !
బాధ్యతగ ఇంట్లోయుండు !
పదిమంది మేలుకోరి
మానవతా కలిగియుండు !!

-కల్లూరి ప్రభాకరాచారి

మాసాల రాణి చైత్రం
పుడమిని చేసెను చిత్రం
చిగురుల రుచి కోయిల
మది మరువదు ఏ మాత్రం !
ఆమని కాలిమువ్వలు
వేపపూవుల నవ్వులు
ఆరు రుచుల ఉగాది
వేళ నవ్వుల పువ్వులు !
గుమ్మాలకు తోరణాలు
కరములపై కంకణాలు
దైవం ముందు వెలిగె
ఆ దీపాల కిరణాలు !
శిశిరం చేసిన గాయం
వసంతం తోని మాయం
మోదు వారిన చోట
కాలం చేసే సాయం !

-మాధవీలత

మన ఉగాది పండుగొచ్చె
చెట్లన్నీ పూతకొచ్చె ... !
వసంతపు కోయిలలు
షడ్రసాలు మోసుకొచ్చె !
గుమ్మానికి వరుసలు
మావిడాకు వరుసలు ... !
శోభితముగ ఇంట నిలచె
తెలుగు జాతి వెలుగులు !!
లేత మావిచిగురులు
కోకిలమ్మ కూతలు !
మధుమాసం మనకిచ్చిన
మరువరాని గుర్తులు !!
శార్వరి యనె నామము
నీవు ఒక వత్సరము !
శుభముల నొసగు తల్లి
జనులకు నిరంతరము !!
పరివర్తన పరుగులని
మార్పులు సరి దప్పవని !
ప్రకృతియే బోధించే
నరుని అనుసరించమని !!
ఉగాది ఆరాధనా
గోవిందుని శోధనా !
శుభమును చేకూర్చగలదు
హరిహరులకు అర్చనా !!

-గోవింద వాణి

కోకిలమ్మ కూతలతో
లేతమావి పిందెలతో
మన ఉగాది వచ్చింది
చేదు వగరు తీపులతో !
ఆనందం నిండుగ
జరుపుకొనె పండుగ
తెలుగువారందరికి
శుభములిచ్చు మెండుగ !
గుమ్మానికి తోరణాలు
మంచి చెడుల జాతకాలు
పండితులు తెలియజెప్పు
పంచాంగపు శ్రవణాలు !
దారిద్ర్యపు రోగము
విస్తరించె వేగము
పారదోలగా రావె
ఓ నవ్య వసంతము !
పాడు రోగములను బాపు
జర మాపై కరుణ జూపు
ఓ శార్వరి నీవు వచ్చి
చెడునంతట రూపుమాపు !

-ఘణపురం పరమేశ్వర్

ప్రపంచాన్ని ఊగించి
యుద్ధభేరి మోగించి
కరోనా నవ్వుతుంది
మనుషులనే విభజించి !
చేయి చేయి కలుపుకోకు
చేటును కొని తెచ్చుకోకు
నిర్లక్ష్యముగ నీవుండి
బతుకుపుట్టి ముంచుకోకు !
కౌగిలింత కరువాయెను
పలకరింత చేదాయెను
ఎదురు తిరిగినోడి శవం
పాడెకైన బరువాయెను !
అది తాగిన రాదన్నరు
ఇది వాడిన చాలన్నరు
శుద్ధి చెప్పినోళ్ళంతా
తమ ఇండ్లే మేలన్నరు !

శార్వరీ ! స్వాగతమమ్మ !
జనులపై దయచూపమ్మ !
కరోనా మహమ్మారిని
నీవు అరికట్టాలమ్మ !
శ్రీ శార్వరీ వత్సరము
తెలుగోల్ల తొలి ఉత్సవము
కరోనా భయాలన్నీ
తొలగించే మహోత్సవము !
సుస్వాగతం శార్వరీ !
కష్ట - నష్ట సంహారీ !
సంకట విమోచనీ !
సుఖ-సంతోష విహారీ !
నవ్యతకు నాంది ఉగాది
భవితకు పునాది ఉగాది
షడ్రుచుల కలబోతయే
మన నవ సంవత్సరాది !
కరోనాతో సతమతం
జనమంత భయకంపితం
గిరిగీసుకొని ఉండాలి
ఇల్లొదిలితే ఇక హతం !

-కె. పాండురంగ విఠల్

ఓ మాయా ! మన్మథుడా !
సృష్టికి నీవు ఆద్యుడా !
కిలుబొమ్మలమని తెలిసె
అయ్యయో ! భగవంతుడా !
మనిషిగ మన పొరబాట్లు
ఆపగలమా ! అగచాట్లు
హద్దు పద్దు తెలియకుంటె
తప్పవింక కట్టుబాట్లు !
లోతు పాతు తెలియకుండ
అహం విర్రవీగకుండ
మసలుకుంటె మనిషిలాగ
నిలబడతవు కూలకుండ !
చేతివ్రేళ్ళ ఉదాహరణ
సిద్ధాంతముల ప్రేరణ
చావు పుట్టుకలకుందా !
భేదాలతోడ ప్రకరణ !
చెరపకుమా ! చెడేవని
తెలిసె సుమా ! ఈ అవని
కరోనాతో కనువిప్పు
కాదా ! కలవరమవని !

-రామకృష్ణంరాజు

కరోనా భూతమురా
కనికరమే లేదురా
జగతిని పరేషాన్ జేస్తు
మన ముందుకు వచ్చెరా !
చైనా దేశంబున
వేల జనులు చచ్చిన
అంతటితో ఊరుకొనక
మన దేశము వచ్చిన !
జనత కర్ఫ్యూ జేసినం
లాకుడౌను విధించినం
కోరలన్ని పీకివేసె
మార్గాలు కనిపెట్టినం !
మాస్కులు ధరించినము
హ్యేండ్‌వాష్ మరచినము
ఇంటిలోన బందియయ్యి
నీ భరతము పడతము !
డాక్టరులే దేవుళ్లై
నర్సులేమొ దేవతలై
పోలీసులు రక్షకులుగ
పాలకులే ప్రతినిధులై !
ధారులేమొ మూసినం
నిర్బంధము చేసినం
ఏ రూపున వస్తవని
కాచుకొని చూస్తున్నం
పండుగ లేకున్నను
బాధలేదు మాకును
నిన్ను మట్టుబెట్టడమే
మా లక్ష్యమెప్పుడును !
కులమతాలు విడిచినము
సమైక్యతను చాటినము
మా బిడ్డల రక్షణకై
అందరమే పోరుతము !
అమెరిక యనుకుంటివా
ఇటలీ యనుకుంటివా
దుబాయి నుండి దుంకియు
ఇండియాకు వస్తివా !
భారతీయ శక్తి ముందు
నీ యుక్తులు సాగవెందు
భూస్థాపిత మిక్కడనే
చేసి తీరుతాము ముందు !

-వరుకోలు లక్ష్మయ్య

అడ్డమైన గడ్డితిని
చేతులను కడగందని
లేనిపోని పనివెట్టే
చైన నేడు ఇద్దరణి !
కంటికి కనబడని జీవి
కలుసుకుంటె వచ్చె జీవి
ఏడ తాకినా గాని
వెంబడించునంట జీవి !
కర్రెగుండునా జీవి
ఎర్రగుండునా జీవి
ఎట్ల ఉండునో తెల్వదు
కరోనా మాయ జీవి !
ఎన్ని కోట్లు నీకున్నా
ఎంత బలం నీకున్నా
ప్రకృతి ప్రకోపానికి
నీ బతుకుదెరువు సున్నా !
బయట వృథా తిరుగవద్దు
కాళ్ళు గడుగక రావద్దు
పూర్వాచారమె గొప్పది
తెలుసుకోర ఓరి మొద్దు !

-పిన్నింటి మహేంద్రారెడ్డి

మహాసంగ్రామం జరుగ
ఉద్భవించె నూతనంగ
శార్వరిమాత ఇంటింట
కరోనను పారద్రోలగ !
గడపలోనె ఉంటాము
కాలమే గడుపుతాము
పరిపరి చేతులు కడుగుతు
కరోనను జయిస్తాము !
కరచాలనమును మాని
కరోన మహమ్మారిని
జయిద్దాం మనమంత
పెద్దల మాటలను విని !
పెండ్లి కూతురునిచట
పెండ్లి కొడుకును అచట
కరోన రోగము వల్ల
పెండ్లి జరుగును ఎచట !

-పిడపర్తి అనితాగిరి

పచ్చని కల్లాపిని
చీరగా కట్టుకుని
పసిడి ముగ్గులనేమొ
ఒడిలోన నింపుకొని !
శార్వరీ రావమ్మ
శాంతినే తేవమ్మ
మా ఆపదల గాసి
హాయి చేకూర్చమ్మ !
ప్రతియేడు వస్తావు
ప్రతి గడప తడతావు
మా అడబిడ్డోలే
పసుపు రాసేడతావు !
షడ్రుచుల కలిపేవు
పచ్చడిగ చిలికేవు
ప్రతి నోటి కందించి
పరవశాలొలికేవు !
పదవులచె కవనంబు
పంచాంగా శ్రవణంబు
పతివ్రతల పూజల
ఫలితంబుల తరుణంబు !

-మల్కనెల్లిలాల్ రెడ్డి

శార్వరి నామ వర్షము
ఎవరికి లేదు హర్షము
'ఉగాది'న మన ప్రతిజ్ఞ
'కరోనా' ఇక అంతము !
గ్రామాల్లో చైతన్యం
పట్నాల్లో చైతన్యం
కరోనా మహమ్మారిని
తరిమికొట్టె చైతన్యం !
ప్రతి ఒక్కరిలో రావాలి
ప్రభుత్వం మాట వినాలి
లక్ష్మణరేఖ హద్దుగా
ఇంటిపట్టునె ఉండాలి !
కరోనాకు మందులేదు
నిర్లక్ష్యము పనికిరాదు
సామాజిక దూరమే
సంక్రమణం ఆపగలదు !
కవుల కలం కదలాలి
గళం విప్పి పాడాలి
మనకు మనమె క్వారంటైన్
కరోన నెదిరించాలి !

-నానాపురం నర్సింహులు

కొత్త చిగురు తొడుగుకొని
కొత్తందం దాల్చుకొని
వేచియుంది మావిచెట్టు
నిన్ను స్వాగతిస్తనని !
పచ్చరంగు పులుముకొని
పూవులు విరబూసుకొని
ఎదురువచ్చె వేపచెట్టు
నీకు హారతిస్తనని !
కోకిలమ్మ మేలుకొని
తన గొంతును దిద్దుకొని
స్వాగతాలు పలుకుతుంది
మధురగాన మందుకొని !
రయమున రావె శార్వరి
శుభములిచ్చు శుభంకరి
కష్టమేమి కలుగకుండ
మమ్ముల గాచు కాపరి !
కరోనాను తరిమికొట్టు
కమ్మనైన తేనెపట్టు
మా చేతికి అందించి
ఎక్కించవే తొలిమెట్టు !

-రాజేందర్ గౌడ్ దొనికల

రావమ్మా రా శార్వరి
ఈ కరోన మహమ్మారి
దుమ్ము దులుపి నీవైన
రక్షించు మా దరి జేరి !
నిన్ననే వికారి వెళ్లి
విషాదం నెంతో జల్లి
తనదే తప్పు కాదులె
చైనా వాడిదే లొల్లి !
చెట్టు పూజలకు నవ్విరి
పుట్ట పూజలకు నవ్విరి
ఇప్పుడు వారందరూ
చెట్టు పుట్ట కొక్కరైరి !
నమస్కారం అనొద్దట
కిస్సు, హగ్గు లందములట
కరోన నేర్పెను గదరా
ఖలునికి మంచి చెడులనట
శార్వారి దేవిని నమ్ము
వత్సరమంతా సుఖమ్ము
దేశపద్ధతి పాటించు
కాదంటే చైన పొమ్ము !

-మోహన్ పూదోట

ఆదిన మురిపించితివి
అంతము నేడిపిస్తివి
వికారి సంవత్సరమా
కరోన కానుకిస్తివి !
స్వాగతం శార్వరీ
మాగతం విను మరీ
కరోనా బారినుండి
రక్షింపగ రామరీ !
శార్వరీ శక్తి రూపు
కరోనా రూపుమాపు
ప్రపంచాన్ని రక్షించే
చల్లనైన నీ చూపు !
ధనమున్నను తృణముదప్ప
భాగ్యమున్న భక్తి దప్ప
నైవేద్యము పెట్టలేను
కరోనా వదిలితె దప్ప !
కనికరించి కాపాడగ
ఆశీసులనందించగ
రావమ్మా ! శార్వరీ
ఆనందము చిందించగ !

- పోతుల ఉమాదేవి

వికారికి వీడుకోలు
శార్వరికి స్వాగతాలు
సర్వజనుల హితముకోరి
సాగమని వేడుకోలు !
కరుణలేని కరోనా
శాంతించు ఇకనైనా
చాప కింది నీరులా
పాకినావు జాగానా !
మందులేని మహమ్మారి
నా భారతావని జేరి
కులుకుద మనుకున్నవా ?
కట్టెదమే నీకు ఘోరి !
గలెమె మిల్ నా కరోనా
హాత్మె హాత్ నా కరోనా
దో హాతోం జోడ్ కర్
సబ్కో సలామ్ కరోనా !

-బూరెమ్ రాజు (రేరాజు)

నూతన ఉగాది శార్వరి
తెచ్చినావు మహమ్మారి
అందరము ఇంట్లో ఉండి
అంతము చేయగలము మరి !
ఇంటిని జైలుగ జేస్తివి
ఒంటిని హూనం జేస్తివి
కరోన పేరుతో వచ్చి
పండుగ ఆగం జేస్తివి
జాతిని కాపాడుకొనుట
మన అందరి లక్ష్యమంట
కర్రోనా రాకుండా
స్వీయ రక్షణ మార్గమట !
మణిపూసల కవులము
కవితలను అల్లెదము
జగమును మేల్కొల్పుటకై
నిరతముగ పోరెదము !

-మల్లెకేడి రామోజీ

ఓ శార్వరీ స్వాగతం
కటిక చీకటి పంతం
ఎలాగైనా తొలగాలి
కరోనా ఆసాంతం !
శార్వరీ శుభంకరీ
మాపాలిటి శుభకరీ
మా జీవితాల గాచి
మమ్మేలు మనోహరీ !
ఆనందం నిండుగ
ఆస్వాదన మెండుగ
పిల్లా పాపల తోడ
జరుపుకొనే పండుగ !
ప్రారంభం ఖేదమైన
ఆసాంతం బాధలైన
కోర్కెలు తీర్చి నీవు
దాటవేయుమెలాగైన !
నూతన సంవత్సరమా
ఇంటిలో బందీలమా
ఇది ఎక్కడి ఉగాది
శార్వరీ ఇది న్యాయమా !

-తుమ్మ జనార్దన్ (జాన్)

కరోనాయె చిచ్చుపెట్టె
లేని చిక్కు తెచ్చిపెట్టె
కొత్త రోగమై వచ్చి
ప్రపంచమే చుట్టిపెట్టె !
కరోనాకు కరుణలేదు
తిరుగాడని జాగాలేదు
కట్టడి చేయకున్నను
మనకు జీవితమే లేదు !
కరోనా వేగము గనుడు
ఇటలీ బాధల చూడుడు
ఆ గతి రాకుండునట్లు
ఇంక సోయి దెచ్చుకొనుడు !
ప్రభుత్వపు మాట వినుడు
ఇకను బయట తిరుగకుడు
ఇంటి పట్టున యుండి
బుద్ధిగను మసలుకొనుడు !
షడ్రుచులే మందయితే
కరోనా బంధి అయితే
ఎంత సంతసింతుమో
ఆ పీడ విరగడయితే !

-గుగ్గిళ్ళ నాగభూషణాచారి

కలికాల మహాభూతము
కరోనాయనే భూతము
జగమంతా వణికించిన
జాలిలేనిదీ భూతము !
సూక్ష్మరూప జీవులు
సుకుమారపు జీవులు
సున్నితంగ తనువుచేరి
ఉసురుదీయు జీవులు !
చుంబనం వలన వచ్చును
కరచాలనమున సోకును
తుమ్మినా దగ్గినా
సన్నిహితులకది తగులును !
ఇనుప చువ్వల దాగు
గోడల యందు దాగు
మరుగుదొడ్డి లందున
ఆక్రమించియు దాగు !
కరోనా వైరస్ చేరి
కల్లోలంబయ్యె దూరి
ప్రాణభయం కలిగించె
పరదేశీయ సంస్కారి !

-విశ్వశ్రీ దివాకర శాస్త్రి

స్వాగతం సుస్వాగతము
శార్వరికి సుస్వాగతము
కొత్త పాతల మేలుకల
యికే ఈ చైత్రమాసము !
సుప్రభాతపు వేకువలు
గుమ్మాలకు తోరణాలు
ప్రకృతిని తలపించే
ముంగిట్ల రంగవల్లులు !
షడ్రుచుల మేళవింపు
కమ్మనగు పలకరింపు
జన్మ ఆయుషును తెలిపె
రాశులవి గుబాళింపు !
నూతన తేజముతో
సరాల సరిగమతో
జీవితమే ఆనందము
కుటుంబ సభ్యులతో !
వికారికి వీడ్కోలు
జరిగిన సంఘటనలు
గతకాలపు గుర్తులే
తీయటి జ్ఞాపకాలు !

-గంగ్వార్ కవిత కులకర్ణి

వికారికి వీడుకోలు
శార్వరికి వేడుకోలు
కరోనా మిగిలించెను
ఇంటింట గుబులు గుబులు !
చింతపండు పులుపుతో
లేమామిడి ఒగరుతో
ఉప్పుకార మొసగు బలం
షడ్రుచుల పచ్చడితో !
కరోనిటకు వచ్చెనంట
ప్రాణభయం బెట్టెనంట
దేశాలనె వణికించెను
కంటికి కనిపించదంట !
తెంచాలి ప్రతీకారము
పంచాలిక అనురాగము
చేయి చేయి కలుపకుంటె
కరోన యౌ సంహారము !

-కోణం పరశురాములు

కాలమనే కాగితాన
ప్రకృతియనే కలంతోన
రచించి వెలువరించిరి
అరవై పేజీలలోన !
మొదటిదేమో ప్రభవ
ండోదియో విభవ
యాభై తొమ్మిది గడిచి
కడ అక్షయ వెల్లువ !
వికారికి వీడ్కోలు
శార్వరికివె వినతులు
తెలుపుతూ కోకిల
తీస్తుంది రాగాలు !
షడ్రుచుల పచ్చడితోన
పంచాంగ శ్రవణంతోన
ఉగాదిని జరుపుకుందాము
మధుకర భక్ష్యాలతోన !
శార్వరి సంవత్సరాన
జగమంత హర్షంతోన
ఉండాలని కోరుదాము
చెలిమి విరుల తావిలోన !

-బొమ్మ విమల

చైనాలో పుట్టితివి
ప్రపంచాన్ని చుట్టితివి
ప్రజలందర్ని భయపెట్టి
చావుదెబ్బ కొట్టితివి !!
శుభ్రతమనకు ఆయుధం
పోరాటమే సాయుధం
కఠినంగా లేకుంటే
అదేర మారణాయుధం !!
ఇల్లుదాటితే నీవు
వెళ్ళితే తిరిగిరావు
పరిహాసం అనుకుంటే
నీ ప్రాణాలే పోవు !!
దూరముంటె తప్పుగాదు
దగ్గరున్న ఒప్పుగాదు
మన శుభ్రతె మనకు రక్ష
ఇంటనున్న ముప్పుగాదు !!
సైనికులకు నమస్సులు
వైద్యులకే నమస్సులు
నిరంతరం శ్రమిస్తున్న
రక్షకులకు నమస్సులు !!
ఉగాదన్న తృప్తిలేదు
మదికి ఉత్సాహంలేదు
వైరస్‌ను చంపెదాకా
మనందరికి నిదురలేదు !!

-తాండ్ర చిరంజీవి

కలలన్నీ కల్లలాయె
ఆశలన్ని అణిగిపోయె
మనుషులంత ఒకతీరుగ
బతుకెట్లని బెదిరిపోయె !
వికారినామ వత్సరము
విసిరినదొక విషవలయము
రావమ్మా శార్వరీ !
కనికరించి కాపాడుము !
శార్వరియన చీకటని
భయపడుటే తగనిపని
చీకటిలో చిరుదీపపు
కాంతి హెచ్చు నమ్మమని !
కరోనా సూక్ష్మక్రిమికి
కబళించబడే భవితకి
కాంతినివ్వ నేతెంచగ
స్వాగతమిదే శార్వరికి !
కలవరమిక కనుమరుగై
ప్రజలుప్పొంగిన గంగై
కలిసి తిరుగ వరమీయవె
కరోనాయె తెరమరుగై !

-గుడిపూడి రాధికారాణి

చైత్ర శుద్ధ పాడ్యమిని
కల్పాది అంటారని
సూర్య సిద్ధాంతమున
ఉన్నదని నే వింటిని !
పులుపు తీపి వగరు చేదు
షడ్రుచులకు సాటిరాదు
ఉప్పు కారమెక్కువైన
ఉద్రేకము చూపరాదు !
స్వస్థత పరంగౌషధము
ఆధ్యాత్మికంగ దైవము
షడ్రుచులు చేకూర్చును
మానసికాత్మస్థైర్యము !
కులమతాలు కలిసిపోయి
మానవులందరికి హాయి
షడ్రుచులు కలిసినట్లు
జరిగేది యెన్నటికోయి !?

-పసుల హనుమంత్

వచ్చెనులె శుభ ఉగాది
తెలుగు సంవత్సరాది
ప్రకృతిలో చూడరా
స్పష్టమైన మార్పిది !
శార్వరి సంవత్సరము
దీని భావము చూడుము
కటిక చీకటితో పాటు
చంపేది యని అర్థము !
ఈశాన్యపు ఇసపుగాలి
ఇక్కడ వచ్చెనుగ తరలి
దైవాలకె పూజలాగె
నీవే చూపాలి జాలి !
అమ్మ శార్వరి జనని
జనులపై పగమాని
రక్షించెద 'నంటు' మాకు
నుడువుము దీక్షబూని !

-సుధాకర్ గౌడ్

కరోనా కనుమరుగే!!

మన ఇంట్లో మనమే బందీలం
లేకుంటే మ్రోగుతుంది మరణ మృదంగం
ఆయుధం పట్టనన్న ఆనాటి కృష్ణుడు
అధర్మాన్ని అవరోధిస్తే
ఈనాటి కణజీవి తానే ఆయుధమై
అంతర్వాహినిలా చొచ్చుకొస్తోంది
ఈనాడు అందరూ కృష్ణులే
ఆయుధం పట్టక్కర్లేదు!
ఆలోచన కావాలి!
ఆరోగ్య సూత్రాలే నీ
అమ్ములపొదిలోని బాణాలు
పాలకుల స్వచ్ఛభారత నినాదాలే
నీకు ఆదర్శప్రాయాలు!
ఆచరణీయ ఆరోగ్య చిట్కాలు!
గజం దూరం ఎడం కాదు!
గజాల దూరం ఎడంగుండు
అనవసర ప్రయాణం వద్దు
అత్యవసర ప్రయాణాలే ముద్దు
రేయింబవళ్లు నీక్షేమమే పరమావధియై
ఎళ్ళవేళల ఎదిరించే సైనికుల్లా
ముందుండి జాగృతం చేస్తున్న
వైద్యులకూ, సఫాయీ సిపాయిలకు సలాం చేద్దాం!
రక్షణ వ్యవస్థకు జైకొట్టి
నియమాల నిబద్ధతలోనిక్కంగా నిలబడదాం!
భయంవదిలి ధైర్యంగా నిలబడితే
కరోనా కదలికలు కనుమరుగే!!1




-యెనిశెట్టి గంగా ప్రసాద్
సెల్:9866447234

కరోనా మెరుపులు

మనుషులను చంపేది
కనపడని వైరస్
మనుషులను బతికించేది
ఐక్యంగావుండే కోరస్ !!

కరోనాకు కళ్లులేవు
అందరిని చూస్తుంది
కరోనాకు చేతుల్లేవు
అందరిని చంపేస్తుంది !!

కరోనాకు జాలిలేదు
అందరిని మింగుతుంది
కరోనాకు బాధలేదు
చంపికుప్ప పెడుతుంది !!

నీళ్ళు తాగకుంటే
కరోనా వచ్చు
శుభ్రంగా వుంటే
కరోనా చచ్చు !!

ఇంట్లో ఉండడం
కరోనాకు మందు
కుటుంబంతో గడపడం
అందరికి విందు !!

మాస్కులు వాడితే
కరోనా చచ్చు
దండాలు పెడితే
మర్యాద హెచ్చు !!

పెంపొందు అనురాగం
ఇంట్లో వుంటే
అదేమనకు బంగారం
అందరితో కలిసుంటే !!

లాక్ డౌన్ అంటే
లాక్ వేయడంకాదు
మనుషులు అంటే
బయట తిరగడంకాదు !!

మనకు మనం వేసుకోవాలి
కఠినమైన శిక్ష
ఆరోగ్యాలను దాచుకోవాలి
అదే మనకు రక్ష !!

కరోనాను చంపుట
డాక్టర్ల లక్ష్యం
కరోనాను పంపుట
మనందరి లక్ష్యం !!

రోడ్లను ఊడ్చేను
సఫాయి కార్మికులు
రోగాలతో ఏడ్చేను
కష్టబోతు శ్రామికులు !!
వారివల్ల మనకు
ఎపుడు శుభ్రత
కలలోనైన కనకు
కరోనాకులేదు భద్రత !!

చేతులెత్తి మొక్కాలి
వారి త్యాగాలకు
విలువిచ్చి చూడాలి
వారి పనులకు !!

కరోనాను చంపుటకు
డాక్టర్లే దేవుళ్ళు
దాన్ని తరిమేయుటకు
మన ఇల్లే లోగిళ్ళు !!

రక్షకదలాలు మనపాలిట
సురక్షిత వలయాలు
కరోనావైరస్ పాలిట
వారువేసిరి కంచెవలయాలు !!




-తాండ్ర చిరంజీవి
9959180762.

పుస్తక సమీక్ష

మానవతా వాదానికి మలి వివరణ

అఖిలాంధ్ర దేశానికి, 'అఖండ జ్యోతి'యై వెలుగునిచ్చే గొప్ప వ్యక్తిత్వం డా॥సి. నారాయణరెడ్డి (1931-2017) గారిది. ఆయన జీవించి ఉన్నపుడూ, గతించినాక కూడా ఆయన కవితా వైభవం గురించి ఎన్నో వ్యాసాలు సంకలనాలు వెలువడ్డాయి. తరచిన కొద్దీ రుచులూరే రచనలు నారాయణరెడ్డి గారివి. ఆయనకు మూడు తరాల శిష్య-ప్రశిష్యులు ఉన్నారనటంలో ఏమాత్రమూ అతిశయోక్తి లేదు. ఆశ్చర్యము కాదు. నారాయణరెడ్డిగారి బహుముఖీన ప్రజ్ఞకు పరాకాష్ఠ (magnum opis) ఆయన రచించిన "విశ్వంభర" అనవచ్చును. విశ్వాత్మ భావంతో విరాజిల్లే ఈ కావ్యానికి దేశకాల పరిధులు లేవు. విశ్వస్థాయి గల ఈ కావ్యానికి దేశ విదేశ 'పురస్కారాలు ఎన్నో వచ్చి, తమను తాము గౌరవించుకున్నాయి. వీరి 'తపఃఫలం'గా సమ్మానించబడే యీ కావ్యం 1980 తరువాత పది మలిముద్రణలు వచ్చాయి. ఇంగ్లీషు , హిందీ, కన్నడం, మళయాళం, సంస్కృతంలోకి అనువదింపబడిందీ రచన.

ప్రగతిశీల మానవతా వాది(Progressive Humanist) గా ప్రస్తుతించబడే నారాయణ రెడ్డిగారి "విశ్వంభర"ను విశ్లేషించి, అందున్న వివిధ మానవతా వాదాలను ఎత్తిచూపటానికి, రావికంటి వసునందన్ రెడ్డి ప్రథమ జయంతి సందర్భంగా (12 జూన్ 2018) ఈ పుస్తకాన్ని మనముందుకు తెచ్చారు.

కవి శిరోమణి కావ్య కళానిధి ఆచార్య రావికంటి వసుందన్ డా॥ నారాయణగారి అభిమాని అనుచరుడు. గురువుకు నూటికి నూరు పాళ్ళూ సరిపోగల శిష్యుడు. వందకుపైగా గ్రంథాలకు రచయితయై, తెలుగు సాహిత్య ప్రాభవాన్ని, రసజ్ఞులైన పాఠకులకు పరిచయం చేయతలపెట్టారు వసునందన్.

ప్రగతిశీల మానవతావాదం శాఖోపశాఖలుగా విస్తరిల్లి, విశ్వరూపం ధరించిన "విశ్వంభర"లోని ఈ మానవతా వాదాలను మనకు పరిచయం చేస్తున్నారు వసునందన్.

చారిత్రక (Historical) తాత్విక (Philosophical) మత (Roligious), నైతిక (Ethical), సాంఘిక (Social) సాహిత్య (literary) వాదాలు "విశ్వంభర" కనిపించే తీరును వివరిస్తున్నారు



వసునందన్. ఈ ఆరు మానవతా వాద ముద్రలు ఈ కావ్యంలో ఎలా, "రవి కిరణ సహస్రం" వలె ప్రకటిత మవుతున్నారో చెబుతున్నారు.

పై ఆరు గుణాల వివరణలకు అనుబంధంగా విశ్వంభర కావ్యాన్ని విహంగ వీక్షణం గావిస్తూ "సమకాలీన సాహిత్యోద్యమాల మూలతత్త్వాన్నీ, మానవ జీవన పరిణామ తత్త్వాన్ని జీర్ణం చేసుకుంటూ, ప్రగతిశీల మాధవతావాద దృక్పథంతో అవతరించింది "విశ్వంభర" అంటూ ముక్తాయింపు పలికారు వసునందన్. ఒక గొప్ప కావ్యానికి మరో గొప్ప వివరణ ఈ పుస్తకం.

ప్రతులకు: ఆచార్య రావికంటి వసునందన్
6-35/26,
మల్లారెడ్డి ఎన్‌క్లేవ్,
సాయికాలనీ, బీరంగూడెం,
హైదరాబాద్-502 032.
సెల్: 9849852182

-కూర చిదంబరం
సెల్: 8639338675

కరోనా అవేర్ నెస్ పాట

రాకు రాకు సోదరా - ఇల్లు వదిలి రాకురా
గుంపు వద్దు సోదరా -రోడ్డు మీదికొద్దురా
కరోనాను తరిమి కొట్ట-ఇంట్లో ఉండు సోదరా
ఒంటి గానే ఇంట్లో ఉండి - ఉద్యమాన్ని నడపరా ॥రాకు॥

ఎక్కడెక్కడో పుట్టి - ఎక్కడెక్కడో పెరిగి
అగ్ర దేశములన్నీ తిరిగి - ఆగమాగమును జేసే
భారతదేశం వచ్చి- బగబగబగ మండుతుంది
కరోనా ఆ కర్కశాన్ని -తరిమి తరిమి కొట్టుదాం ॥రాకు॥

చిన్న పెద్ద వయస్సు లేదు - పేద ధనిక తేడ లేదు
తగులుకుంటె వదలదంట- కాటిదాక పయనమంట
మోడిసార్ కేసిఆర్ - వైద్యులతో జత కలిసి
కర్షక రక్షకులతోటి - కదనరంగమున దూకిరి ॥రాకు॥

చేతులు బాగా కడుగు - శానీటైజర్లు రుద్దు
పార్టిలొద్దు పబ్ లొద్దు- పక్కోడితో మాటలొద్దు
పదిహేను రోజులేగా - పట్టుపట్టి పక్క నుండు
పరిశుభ్రత పాటించూ - దాన్ని బొంద తీసి పాతిపెట్టు ??రాకు??

-ఇలిటం గాలయ్య
ప్రధానోపాధ్యాయులు ,
సెల్: 9010097108

కరోనా రేపురా రేపురా!

కలలింకా తీరలా
కోర్కెలింకా ఇంకలా
దయుంచి రేపురా!
బ్రతుకు ప్రయాణంలో
అవసరాలు తీర్చు వేటలో
పేదని ఏ రోజూ నెమ్మదిగా తినలా
దానికంత తీరికింకా దొరకలా!
పూర్ణాయుష్షని ప్రమలో
పరుగాపక ఇహలో కలలో
పొరుగుతో పోటీలో
అబ్బే లెక్కలింకా తేలలా!
పొందాల్సిన సుఖాలూ
చేరాల్సిన తీరాలూ
అందాల్సిన హోదాలూ
అబ్బే ఇంకా దొరకలా!
కట్టాల్సిన మేడలూ
కొనాల్సిన ఆస్తులూ
ఎక్కాల్సిన కుర్చీలూ
అబ్బే ఇంకా అవ్వలా!
స్విస్సు బాంకులో డబ్బులూ
బినామీల కాడున్న ఆస్తులూ
అమాత్యున్ని నాకొచ్చే ఆమ్యామ్యాలూ
అబ్బే నేనింకా తెచ్చుకోలా!
అందుకే ఓ కరోనా రేపురా
కలలింకా తీరలా
కోర్కెలింకా ఇంకలా
దయుంచి రేపురా!

- రవి కిషోర్ పెంట్రాల,
లాంగ్లీ, లండన్!

బహుశా ఇదేనేమో మొదట

ప్రపంచం
ప్రతి ఒక్కరికి మొక్కడం
కాళ్ళ మీద పడి ప్రాణ భిక్ష కోరడం
బహుశా ఇదేనేమో మొదట.
దేవుడికి క్రొత్త నిర్వచనమిచ్చి
కోరికలో వ్యక్తిగతాన్ని కత్తిరించి
సంఘం శుచిగా ఉండాలని కోరుకోవడం
బహుశా ఇదేనేమో మొదట.
శాస్త్రం చిటికిన వ్రేలు పట్టుకొని
పాత తరం విలువలను
మనసంతా పులుము కోవడం
బహుశా ఇదేనేమో మొదట.
కంటిలో కులం నలకలు తొలిగించి
మనసులో మతం మత్తు వదిలించి
మనిషి మానవతకు మోకరిల్లడం
బహుశా ఇదేనేమో మొదట.
యావత్ ప్రపంచం ఒకే సమయంలో
కనిపించని శత్రువుతో
నిశబ్దంగా యుద్ధం చేయడం
బహుశా ఇదేనేమో మొదట.
దేశాల మనుగడను విచ్ఛన్నం చేసే
వైరస్ నిరోధానికి మనిషి
స్వీయ నియంత్రణ ఆయుధంగా
బహుశా ఇదేనేమో మొదట.
కాలు బయట పెట్టకుండా
చేయి చేయి కలపకుండా
ఐక్యంగా కలసి మెలసి బతకటం
బహుశా ఇదేనేమో మొదట.
భూమి నిశబ్దానికి
అంతరిక్షం శుభ్రపడి
ఓజోన్ పొర పండుగ చేసుకోవడం
బహుశా ఇదేనేమో మొదట.
మనిషి రక్షణకు
మనుగడ భద్రతకు
మానవ విలువలే మూలమని గ్రహించడం
బహుశా ఇదేనేమో మొదట.

-చందలూరి
నారాయణరావు
9704437247

కారణమెవరు...?

సృష్టికి ప్రతిసృష్టిని చేసే
సాంకేతిక జ్ఞానముండి
సృష్టి జీవుల మనుగడకు
ముప్పు కల్గించేదెవరు..?

అరచేతితో భూగోళాన్ని
అమాంతం పైకి లేపుతానని
భూమి మీద తన ఉనికిని
ప్రమాదంలోకి నెట్టేదెవరు..?

ప్రకృతి పంచభూతాలను
తన గుప్పిట్లో బంధించి
సకల జీవజాతి మీద
ఆదిపత్యం చేసేదెవరు..?

తన స్వార్థం కోసమే
శాస్త్రాలను వాడుకుంటూ
స్వేదం చిందించకుండా
భోగం కోరేదెవరు..?

అనాగరికపు అలవాట్లను
ఆధునిక పోకడలనీ
అంధకార జీవనానికి
బీజం వేస్తుందెవరు..?

ప్రపంచం కలవరపడే
వినాశన కారకాల
క్రూర వైపరీత్యాలకు
ఎవరి కృత్యాలు కారణం..?

-రాచర్ల శ్రీనివాస్
9704246125

సంబరం

కరోనా పుణ్యమా అని
ఇల్లు కళకళలాడుతున్నాయి
ఆప్యాయతలు వెలివిరుస్తున్నాయి
బంధాలు పెనవేసుకుంటున్నాయి
అనుబంధాలు కళ్లకు కడుతున్నాయి
నమస్కారాలు మొదలయ్యాయి
ప్రేమలు పెరిగాయి
కలిసి ఉంటే కలదు సుఖంలా
ఆ రోజులు మళ్ళీ వచ్చాయనిపిస్తూ
ఇదంతా నువ్వు తెచ్చిన సంబరమే!



-యలమర్తి అనూరాధ
9247260206

కరుణలేని కరోనా... !

మాయదారి గొచ్చె:మనుషుల తినుటకై
కదలిక లిలలేని:కబళ జీవి!
కరుణ జాలి రహిత:కాఠిన్య రక్కసి
సున్నితంబునిజము:సునిత పల్కు!!

ప్రాణదాతగాను:పరమవైద్యులసేవ
ఆప్తమిత్రులమాట:అరయబలము
సూక్ష్మజీవితినును:కులమతములులేక
సున్నితంబునిజము:సునితపల్కు!

గుంపుకూడవలదు:గూడిఇంట్లోనుండు
పేదరాజు యనెడి:తేడలేక
తిరుగవద్దుజనత:తిరుగరానియుచోట్ల
సున్నితంబునిజము:సునీతపల్కు!

పుడమియంతదీని:పుణ్యాన భీతిల్లి
ఇక కరోన తోడ:బ్రతుకు టెట్లు?
మానసికమెబలము:మంచిమాటవినుడి
సున్నితంబునిజము:సునిత పల్కు!

కదనరంగ మాయె:కల్లోల భూ లోక
మంత,విషపుదాడి:మయము నిండ
ఎన్నివచ్చిపోగ:వెలుగునునాజాతి
సున్నితంబునిజము:సునిత పల్కు!

-సునిత బందారు
9440671530

మానవత్వం పరిమళించే

కరోనా కలకలంలో
ప్రాంతాలు విల విల
నిర్మానుష్యమైనాయి
నిశ్శబ్దమైనాయి
ఆరోగ్య భద్రతకై
రక్షక భటుల సేవ
రోగుల ఆయుర్వృద్ధికై
వైద్యుల అహర్నిశలు సేవ
వీధుల శుభ్రతకై
పారిశుద్ధ్య కార్మికుల సేవ
జీవన అవసరాల నిమిత్తం
వాలంటరీల సదా సేవ
అనాధల ఆపన్నహస్తాలై
ధాతల నిర్విరామ సేవ
మానవత్వం
పరిమళించిన వేళ
ఏ కరోనా ఐనా కొన్నాళ్ళే
సమస్తం సుఖినోభవంతు



-నరెడ్డుల రాజారెడ్డి
9866500305

మొగ్గలు ప్రక్రియలో కరోనాపై కవుల స్పందన

ఈశాన్యదేశాన భీకర ప్రాణహాని ఉద్భవించి
ప్రపంచాన్ని విలయతాండవం ఆడిస్తున్నది
విశ్వవిహారం చేస్తున్నది మాయదారి కరోనా

దేహాంతరాలలో తిష్టేసి మరణమృదంగం మోగిస్తున్న
ప్రాణవాయు నిరోధి మందులేని అంటుచుట్టం
నిద్రాహారాలు లేకుండాచేస్తున్న మహమ్మారి కరోనా

నిర్జీవకణాన్ని నిర్దాక్షిణ్యంగా మాయంచేస్తేనే
కరోనా కాలయముడిని ధిక్కరించేది
లాక్ డౌన్ ను పాటిస్తేనే జనాలంతా సురక్షితం

వ్యక్తిగత నియంత్రణను పాటిస్తూ కట్టడిచేస్తేనే
మానవ మనుగడను బాధ్యతగా కాపాడుతాం
కరోనాను కాష్టం చేసే నిప్పురవ్వ లాక్ డౌన్

ప్రాణాలను ఫణంగాపెట్టి కరోనా బాధితులకు
అండగా నిలుస్తున్నవారంతా అభినందనీయులు
వైద్యుల,రక్షకభటుల అవిరళసేవలు ప్రశంసనీయం

- జి.శాంతా రెడ్డి,
8008177325

సూక్ష్మజీవి కరోనా కబంధహస్తంలో చిక్కినా
దానిని కట్టడి చేయడానికి క్వారంటైనే నేస్తం
కనిపిస్తే కాల్చివేసే అంతర్జాతీయ ఉగ్రవాది కరోనా

కులమతవర్గాలకు అతీతమవుతూనే
ప్రపంచాన్ని దావానంలా దహించి వేస్తున్నది
కనీసం కనికరంలేని వైరస్ కరోనా

ప్రపంచమంతా ఆకలికేకలు వినిపిస్తున్నా
కోవిడ్-19 మరణమృదంగం ఆగడం లేదు
పంజా విసిరిన కోరలు తీసిన మృగం కరోనా

బాహుబలివని బయట తిరగకుండా
సూక్ష్మజీవి దెబ్బకు స్వీయనియంత్రణే ముద్దు
బాహుబలి కన్నా మించినది కరోనా వైరస్

దగ్గు జలుబులను వ్యాప్తి చేస్తూనే
శ్వాస వ్యవస్థను ధ్వంసం చేస్తుంది
ఊపిరి తీసే యమకింకరి కరోనా

విపత్కరమైన విషపరిస్థితుల్లో కూడా
నిర్లక్ష్యంగా జనం మూగుతున్న వైనం
క్షణాల్లో బలిచేసే మహమ్మారి కరోనా

కంటికి కనిపించని అంతుపట్టని శత్రువై
కళ్ళముందే విపత్తును సృష్టించింది
కనిపించని కరాళభూతం కరోనా వైరస్

పరమాణువులా విశ్వవ్యాప్తంగా వ్యాప్తిచెంది
ప్రపంచ జనాన్ని కకావికలం చేస్తున్నది
కరుణలేని కర్కోటకమైన కాలాంతకి కరోనా

అగ్రరాజ్యాల దేశాధినేతలను సైతం
ఆకస్మికంగా దాడిచేసి కబలించింది
ఎవ్వరినీ వదలిపెట్టని బాహుబలి కరోనా

ప్రపంచమంతా మార్మోగుతున్న మరణ మృదంగానికి
చిగురుటాకులా రాలుతున్న సామాన్యజనం
అందర్నీ మాయంచేసే మాయావి కరోనా

నిరంతరం మన క్షేమం కోరి పాటుపడుతున్న
రక్షకభటులు మనకందరికీ ఆపద్బాంధవులు
జీవితాలను ఖతంచేసే కరోనాకు యమభటులు

- బందారు సునీత
9440671530

మాస్కులు ధరిస్తూ శుభ్రంగా చేతులు కడుగుతూ
జనులందరూ శుచి శుభ్రతలను పాటించాలి
మన పరిశుభ్రతే మనకు శ్రీరామరక్ష

ఇరుగుపొరుగువారితో మీటరు దూరంలో ఉంటూ
నమస్కారంతో ముద్దుగా పలకరించుకోవాలి
నమస్కారమే మన భారతీయ సంస్కారం

మానవాళి మనుగడకు పెనుముప్పుగా మారిన
కరోనా మహమ్మారిని మంటకలిపితేనే భవిష్యత్తు
మన దృఢమైన సంకల్పమే మన మహాబలం

భయం గుప్పిట్లో జనాలను బంధీ చేస్తూ
కరోనా భయభ్రాంతులకు గురిచేస్తున్నది
ప్రాణాంతకమై కబలిస్తున్నది కరోనా

అమ్మ శార్వరీమాత మీ శరణార్థులమై
అడుగుతున్నాము మమ్ము కాపాడరావా
శరణుశరణు అంటే రక్షించే మాత శార్వరీ

- చెన్న పద్మ
73962 67442

భల్లుమని దిక్కులు పిక్కటిల్లేలా వదిలిపోమన్నా
పట్టించుకోక మనుషులపైన పగబట్టింది
ఎంత రోదన చెందిన వేదన తీరదు

మహమ్మారి కరోనా జన్మస్థానం చైనా ఐనా
భూమండలమంతా దానికి ఆస్థానమై కక్ష్యగట్టింది
ఏడనో పుట్టి ప్రపంచ జనుల ప్రాణాలు తీస్తున్నది

ఓ వైపు మానవత్వాన్ని గుర్తుచేస్తూనే
మరోవైపు మనిషినే మాయంచేసే లీలలు
చెడుకూడ కొన్నిసార్లు మంచికొరకే

కలిసున్నా మేము మనసులో కల్మషాన్ని పెట్టుకుని
ఎవడో చస్తే మాకేందిలే అని మానవత్వాన్ని మంటగలిపాం
మేము కలిసున్న మానవత్వాన్ని పంచుకోలే

అల్లకల్లోల్లంగా లోకాన్ని చావుకేకలు పెట్టిస్తూ
భయంతో గుప్పెట్లో ప్రాణాలను పెట్టుకుంటున్నాం
పాపమెవరిదో శాపం మాత్రం అందరికీ

- సహని
80743 18053

శుభ్రంగా చేతులు కడిగి పరిశుభ్రతను పాటిస్తేనే
మహమ్మారి కరోనా రోగం మాయమవుతుంది
ప్రపంచాన్ని భయపెడుతున్న భూతం కరోన

దగ్గు తుమ్ములకు దూరంగా ఉంటూనే
రక్షణకవచంగా మాస్కులను ధరించాలి
కరోనా పారద్రోలడమే మనందరి లక్ష్యం

భయం గుప్పిట్లో ప్రపంచాన్ని ఉంచుతూ
మనుషుల ప్రాణాలతో చెలగాటమాడుతుంది
లోకమంతటినీ అల్లకల్లోలం చేస్తున్నది కరోనా

జనసందోహంలోనే ఉంటుందని చెబుతూ
ఇంట్లో వారందరినీ బందీలను చేసింది కరోనా
మనుషుల్లో మమతానురాగాలు పెంచింది కరోనా

ఇకనైనా కరోనా నువ్వు దూరంగా వెళ్ళిపోతేనే
మా వైద్యులు ప్రశాంతంగా వైద్యసేవలు చేస్తారు
ఇక నువ్వు దేశం విడిచి చలోనా ఓ కరోనా

-యం.అనితారమణ
94928 09752

ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తూ
చాపకింద నీరులా దేశంలోకి అడుగుపెట్టింది
భారతీయులను క్లిష్టపరిస్థితుల్లోకి పడవేసింది కరోనా

సూక్ష్మాతి సూక్ష్మజీవిగా అగుపిస్తూనే
మానవజాతిని అతలాకుతలం చేస్తుంది
సంఘజీవికి మరణశాసనం రాసింది కరోనా

మానవులపై దాడిని యుద్ధంలా కొనసాగిస్తూనే
మూడవ ప్రపంచ యుద్ధాన్ని తలపింపజేసింది
లక్షల ప్రాణాలను హరిస్తున్నది కరోనా వైరస్

కత్తులు, తుపాకులు, ఆయుధాలు లేకుండానే
స్వీయనిర్బంధమనే ఆయుధంతో ఓడిద్దామురారం
మన అప్రమత్తతే కరోనాకు మరమశాసనం

పగలనకరాత్రనక కరోనా బాధితులకొరకై
సేవలందిస్తున్న వైద్యులు ఆధునిక దేవుళ్ళు
కరోనా రక్షకుల సేవలు అజరామరం

- కె.సువర్ణాదేవి
99632 22178

కంటికి కనిపించని వైరస్ తో
పడరాని పాట్లన్నీ పడుతున్నారు
మాయవిలా వచ్చి కష్టాలు పెట్టిస్తున్న కరోనా

పొట్టకూటికోసం పట్నాలకు వలసపోతే
అడుగు బయటపెట్టొద్దని ఆంక్షలు పెట్టిండ్రు
రెక్కాడితే కానీ డొక్కనిండని దుస్థితి

యదాదికోసారోచ్చే ఉగాది పండుగను
కరోనా రాక్షసి కనికరంలేకుండా మింగేసింది
కరోనా మహమ్మారి కదలకుండా చేసింది

ఎలా ఉంటుందో తెలియదు కరోన
ఊహాలోకంలో హడలెత్తిస్తున్నది
మాయజాలమై మరిపిస్తున్నది కరోనా

కుటుంబంతో కలిసి పండుగ జేద్దామంటే
కరోనా కలువకుండా జేసింది
కరోనా ఎడబాటుకు ప్రతిరూపం

- బర్క శశాంక్
89195

బయటకు వచ్చి గంటలు గడవలే గానీ
అప్పుడే కరోనా రక్కసి కమ్మేసింది
కాలు బయట వెడ్తే కరోనా కాగిలించుకుంటది

వారు కరోనతో పడుతున్న బాధ కంటే
కుటుంబ ప్రేమకు దూరమైన బాధే ఎక్కువ
ప్రేమలను బంధాలను కాటేస్తుంది కరోన

నోట్లినిండ పిలిచేవారే ఇప్పుడు
మనుషులు కనిపిస్తే పారిపోతుండ్రు
కరోనా బంధాలను సంపి ఎడబాటును కోరే

నల్లగొరిలో నవ్వులు పంచుకునే వారిప్పుడు
నాలుగు గోడల మధ్య ఇరుక్కపోయిండ్రు
కరోనా వల్ల ఇల్లే అందరికి ప్రపంచమయింది

చైనాలో పుట్టి పెరిగిన కరోననే
ప్రపంచ దేశాలను వణికిస్తుంది
చైనాలో జననం ప్రపంచమంత ప్రళయం

- అనుపటి హేమలత
8886878207

చైనాలో పుట్టిన విష వాయువే
ప్రపంచాన్ని కబలించే కాలరాక్షసిగా మారింది
ప్రాణభయంతో ప్రపంచాన్ని వణికిస్తున్న కరోన

మూగ జీవులపై మనిషి చేసే స్వార్థపు చేష్టలే
తనని కాటేసే విషపునాగులై బుసలుకొడుతున్నయి
మనిషి మనుగడే కరోనా విషపుపడగలో మూలుగుతుంది

కంటికి కూడా కనిపించని గాలే
తుమ్ముల తుంపెరతో చావును పిలుస్తుంది
గాలే యమపాశమై స్వైరవిహారం కరోనా

వైరస్ రూపేనా వచ్చి మనిషిని మందలిస్తూ
మరిచిన మన సంస్కృతిని యాదిజేసింది కరోనా
చెడు కూడా మంచిని బోధించగలదు

మనిషి తప్పులే కొత్తగా రూపాంతరం చెందిన
మనుషులుగా మారని కర్కశలోకం మనది
తప్పు సరిచేసుకోలేని వారి తలరాత మార్చలేము

- కమ్మరి శిరీష
96668 70191

అందరినీ మెల్లగా పలుకరిస్తూనే
తన గుప్పిట్లోకి తెచ్చుకుంటుంది
కరుణకు నిధి కాదు కరోన

బలవంతులను బలహీనులని చేస్తూనే
అనుబంధాలను దూరం చేస్తున్నది
బకాసురుణ్ణి మించిన రాక్షసి కరోన

ఆంటి అంకుల్ అంటూ
అమెరికాను మింగేస్తున్నది
అంటురోగపు మహమ్మారి కరోన

విదేశంలో పుట్టిన విద్రోహి
ఈ దేశంలో అంటురోగమైనది
మాయదారి మహమ్మారి కరోన

ఇల్లుఇర్కటం ఆలిమర్కటం అంటుంటే
దేశం మీద విరుచుకుపడుతుంది
పగలాడి మహమ్మారి కరోన

- కోలంట్ల రామకృష్ణ
9966804126

ప్రపంచాన్ని గడగడలాడిస్తూ
జనుల ప్రాణాలతో ఆడుకొంటున్నది
వైరస్ రూపంలో పొంచివున్న కరోనా

ఆరోగ్యంగానే మనిషిని చూపిస్తూ
లోలోపల జీవశ్చవాన్ని చేస్తున్నది
నిశ్శబ్ద సంక్షోభం సృష్టించే కరోనా

ఒకరిని ఒకరికి దూరం చేస్తూ
సంబంధాలకు సంకెళ్లు వేసింది
జనసందోహంలో ఇమిడే కరోనా

సూక్ష్మంగా శరీరంలోకి ప్రవేశిస్తూ
ఉపద్రవాన్ని ఉప్పెనలా తెస్తోంది
ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరిచేసే కరోనా

విదేశంలో పుట్టినప్పటికీ
దేశాలను గడగడలాడిస్తున్నది
అంటురోగపు మహమ్మారి కరోనా

- కె. శైలజా శ్రీనివాస్
8019736254

- రవి చంచల
8500330700

యుద్ధాన్ని ముద్రించుకో!

రేపటి నీ ఉదయం కోసం
నీ వెనుకో యుద్ధమే జరుగుతోంది
నిన్ను కాపాడుకోవడానికి
చీకట్లో నీ దేశం నీచుట్టూ నిలబడింది.

రేపు నువ్వు కిటికీ తెరిచినప్పుడు
నువ్వుతూ నిన్ను తాకే గాలినడుగు
ఎన్ని చేతులడ్డుపెడితే నీవేపుకు వీచిందో
నువ్వు తలుపు తెరిచినప్పుడు
నీ భుజంమీద వాలే ఎండపిట్టనడుగు
ఎన్ని కారుమేఘాల్ని చీల్చుకొని
నీవేపు ఎగురుకుంటూ వచ్చిందో!

ఒక అన్నం ముద్ద కథెప్పుడన్నా
ఆసాంతం విన్నావా?
ఎన్ని మట్టిచేతుల స్వేదమో
ఎన్ని వంగిన వెన్నెముక కష్టమో
ఎన్ని తెగిపడిన ఊపిరుల ఫలితామో!
ఒక అన్నముద్దలో
నీ దేశాన్నెప్పుడైనా చూసుకున్నావా?

రూపాయి నాణేనెప్పుడన్నా
నీ గుండెల మీదుంచుకున్నావా?
వంద హృదయస్పందనలై
నీ దేశం మ్రోగడాన్ని
ఎప్పుడైనా విన్నావా?

ఇప్పుడీ లాక్ డౌన్
నీకో ఆటవిడుపు
గదిలో నిశ్శబ్దం మధ్య కూర్చొని
నీ దేశపటాన్ని సులువుగా గీయగలవు
నీ పొలిమేరలకావల
ఆకలికేకలమధ్య
కన్నీటి వాకిట్లో
అక్కడ!
అక్కడ కూర్చుని
నీ దేశపటాన్ని గీయగలవా!

రేపు నీ దేశపు వాకిలి తెరిచాక –
ప్రతి వస్తువుమీదా
నీ విలాసం ఖరీదు రాయబడుతుంది
ప్రతి సేవమీదా
కన్నీళ్లతో ఓ హేలోగ్రామ్
ముద్రితమౌతుంది
ఎవరో విసిరేసిన యుద్ధంలో
ఎవరెవరో నీ తరుపున పోరాడుతున్నారు
ఆ ఖడ్గప్రహారాలు
నిన్ను చేరుతూనే వున్నాయి
క్షతగాత్రుల ఆఖరి హెచ్చరికలు
నీ చుట్టూ మార్మోగుతూనే ఉన్నాయి
ఈ యుద్ధంలో నువ్వు పౌరుడివి కావు

సైనికుడివి
మరి యుద్ధంలో నువ్వెక్కడున్నావో
నీ గుండెనడిగి తేల్చుకున్నావా?
నీ ప్రతి రుధిరకణం మీదా
యుద్ధాన్ని ముద్రించుకున్నావా?

-సాంబమూర్తి లండ
9642732008

తస్మాత్ జాగ్రత్త

నేడు మనిషి మనుగడ ఒక ప్రశ్న
అలాగే ఓ జవాబు కూడా....

ప్రశ్నను ప్రశ్నించుకోక....
జవాబుకై యత్నించక...
తన గుండెను అరచేతిలో పెట్టుకొని...
క్షణం క్షణం నరకాన్ని అనుభవిస్తున్న జనం
ప్రపంచం మొత్తం నేడు చూస్తుంది....

ప్రేమగా కన్న పిల్లలను సైతం ఆదరించని
దౌర్భాగ్యం ముందు
ఇప్పుడు సైకత శిల్పాలు ఎన్నో..
ఇక...ఏది ఏమైనా...
అందరి మనసుల్లో ఏదో తెలియని
ఆందోళన...
అదే...ఒక ప్రశ్న గా...మన మదిలో
కదలాడుతూనే ఉన్నది...

ఎన్నాళ్ళు ఇలా...బ్రతకాలి....
అంటూ...
అందరిలోనూ... నిర్వేదం..
ముగిసి పోతుందేమో
జీవితం అనే మీమాంస.....
సందేహం...కూడా
ఒంటరిగానేనా.....
ఇక మన ప్రయాణం
అనే...ఆలోచన..

కాదు....
కానే కాదు....
మనం ఒంటరి ఎప్పుడూ కానేకాదు..
మన కంటూ ఓ కుటుంబ...
మన కోసం తపించే స్నేహితులు..
మనమే లోకమనుకొనే..
మనను నమ్ముకొన్న వారు

అందుకే...
మనం వెతుకుతున్న జవాబు ఇదే
నిరంతరం...మనకై మనం...
మనను నమ్ముకొన్న వారికై మనమే
జనతా కర్ఫీకి సహకరిచాలి...
ఇల్లే స్వర్గసీమ....అంటూ
నీ ఇంటి గడపలోనే... నీవుంటే...
నీవే ఇప్పుడు ఓ వీర సైనికుడివి...
నీ కుటుంబం సంతోషంగా ఉంటే...
అదే నీకు ఎప్పుడూ బృందావనం....
అప్పుడే...నీ జీవితం శత కోటి వసంతాల హరివిల్లు...
లేకుంటే....
కాదంటే...
గతి తప్పితే
నీకు...మరి ...ఇంకొందరికి ....
స్మశానమే....గతి....
తస్మాత్...జాగ్రత్త...

-సృజామి
8639260193

కరోనా పరార్!

ఆధునిక కరచాలన పలకరింపులు మాని
సంస్కారవంతమైన నమస్కారం చేయాలి
నమస్కారమే సర్వజనులకు శ్రేయస్కరం

సాంకేతికత పరిజ్ఞానానికి అంతుచిక్కని
మాయదారి మహమ్మారి కరోనా వైరస్
చాపకింద నీరై పారుతున్న కరోనా రోగం

కరోనా వడివడిగా దేశదేశాలలో వ్యాపిస్తూనే
పెనుప్రమాదమై విలయతాండవం చేస్తోంది
భయం గుప్పిట్లో వణుకుతున్న ప్రపంచ దేశాలు

శీతల పానీయాలను సేవించడం మాని
సినిమాలకు సమూహాలకు దూరంగా ఉండాలి
విందువినోదాలకు విరామమివ్వడమే ఉత్తమం

దగ్గులు తుమ్ములకు మాస్కులను ధరిస్తూనే
వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి
సనాతన ఆరోగ్యాన్ని ఆచరించడమే మన ధర్మం

కంటికి కనిపించని కఠిన శత్రువును తరిమివేయ
సమరానికి సర్వజనులు సన్నద్ధం కావాలి
అందరూ జాగ్రత్తగా వుంటే కరోనా పరార్

-పులి జమున
8500169282

సామాజిక విలువలు కోరుకుంటూ

'నిద్రలేచిన నిశ్శబ్దం'

అంతా నిశ్శబ్దం బతుకు బతుకంతా నిశ్శబ్దం. మన చుట్టూ ఎంతో బీభత్సం తాండవిస్తున్న మౌనమే, నిశ్శబ్దమే. అసమానతలు, ఆకలి, దోపిడి దౌర్జన్యం, సెటిల్మెంట్లు, దందాలు, కుంభకోణాలు, హత్యలు ,అత్యాచారాలు మతమౌఢ్యం, ర్యాలీలు, ధర్నాలు నిరసనలు ,వరకట్న హత్యలు నిరర్థకమైన సహజీవనం ఇలాంటి బీభత్సమైన సమాజం మన చుట్టూ ఉన్న లేక కష్టమైనా నోరు తెరవక నిద్రిస్తున్న వాళ్లను తట్టిలేపుతున్నాడు దుప్పటి మొగిలి తన "నిద్ర లేచిన నిశ్శబ్దం" కవితా సంపుటి ద్వారా.

తను రాసిన కవితా సంపుటిలో కవితల క్రమము తల్లి, తండ్రి, గురువు మాతృభాష,, రైతు ,దేశ సైనికులు చూసినప్పుడే అతని క్రమశిక్షణ, ఆలోచన ,ఆశ అర్థమవుతుంది. త్రిమూర్తుల సతులు సరిరారు నీకంటూ/ అమ్మ ప్రేమను / నీ కాలి చెప్పునై రుణం తీర్చుకుంటానంటూ/ నాన్న త్యాగాన్ని /మహి పై వెలసిన మహిమగల దేవుళ్ళు/ అంటూ గురువు గొప్పతనాన్ని చాటుకున్నాడు. "మదురమైన భాష" అనే కవితలో/ జగమంత వెలుగు భాష/ అంటూ తెలుగు భాష గొప్పతనాన్ని, /దేశ భద్రతకై రక్షణ చేసే జవాను రక్తం/ అంటూ పుల్వాలా అమరులకు "అమరులకు వందనం" కవితలో జోహార్లు అర్పించారు." రైతు అనే రాజును నేను "అనే కవితలో /జై కిసాన్ అన్న పదం దళారుల కాళ్ళ కింద నలిగి పోయే/ అంటూ రైతు బాధను వర్ణించాడు.

ఏ దేశంలో అయితే యువత నిష్క్రియ పరంగా పడి ఉంటుందో ఆ దేశం బాగుపడదని ఆ దేశానికి అభ్యుదయం ఉండదని మన దేశాన్ని త్యాగంతో తేజోమయం చేసిన మహనీయుల గురించి తెలుసుకుంటూ జీవిత ధర్మాలను పుణికి పుచ్చుకోవాలని యువకులకు" కదలిరా" అని పిలుపునిచ్చారు. దేశం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన భగత్ సింగ్ అంబేద్కర్ నేతాజీ గాంధీజీ లాంటి వాళ్లని స్మరిస్తూ వారిని యువకులు ఆదర్శంగా తీసుకోవాలని సమాజం కోసం పనిచేయాలని ప్రబోధించాడు.

"ప్రజా సేవకైరా ఉడుకు నెత్తురు ఉప్పొంగే భగత్ సింగ్ లా
భారత భాగ్య విధాతవై బాధ్యతలు నిర్వర్తించా
భావి భారత నిర్మాణానికి అంబేద్కర్ ఆశయమై
రా..! యువత కదిలిరా..!"

నేడు ఈ దేశ యువత తన చుట్టూ ఒక సమాజం ఉంది. ఆ సమాజము నుండే తాను రూపొందు తున్నాను అని మర్చిపోయింది. అందుకే ఈ కవి ఆవేదన చెందుతూ

"సోమరివై నిద్రించితివా
రాజీపడి రాకపోతివా
రాక్షస సమాజంలో బ్రతకలేవు సోదరా
నీ జీవితం నీది కాదురా
బ్రతుకంతా దేశసేవ చేయరా
జాతి ఖ్యాతి నిలిపి
కలకాలం నిలువ కదలిరా" అని యువకులకు పిలుపునిచ్చారు.

"రాకెట్లెన్నో ఎక్కుతున్న రాల్లకే మొక్కుతాం
గుండెలు మార్చే సర్జరీలున్న గుడ్డిగానే నమ్ముతాము
పరిశోధనలెన్ని చేసిన పనిచేయని పద్ధతులే ఆచరిస్తాము" అంటూ "అంతఃకరణ శుద్ధితో" అనే కవితలో అన్ని తెలిసి కూడా మారడం లేదంటూ అంతః కరణ శుద్ధితో మారాలని పిలుపునిచ్చాడు.

"అత్యాచారాలను నిరసిస్తూ
"చిన్నారుల మాన ప్రాణాలు తీసే
మహిషాసురులను మట్టిలో పాతరేయ ఆడపులి నేనౌతా " అంటూ "ఆదిశక్తి నేనౌత" అనే కవితలో స్త్రీలు ఎదిరించాలని , "అద్భుత శక్తులు నాకున్న" అనే కవితలో

"అరచేతిలో సప్త సముద్రాలను ఒడిసిపడుతాను.
అగ్ని ఉద్యానవనములో పొర్లి పారుతాను" అంటూ అద్భుత శక్తులున్న భారతదేశంలోని కుల వ్యవస్థను రూపుమాపే శక్తి లేదని నిరసిస్తాడు .

"శ్రామికులం, సమాజ సేవకులం" కవితలో
"కార్మికులం, కర్షకులం ప్రపంచ దిశానిర్దేశకులం
లోకానికి వెలుగు నిచ్చే వెన్నెలం
విలయానికి భయపడని వీరులం"
అంటూ కార్మికులను శ్రామికులను కర్షకులను ఉన్నతంగా ప్రబోధించాడు.



భూమిపై జరిగే అరాచకాలను రూపుమాపడానికి దేవుడవని ఉంటే ఏ రూపంలోనైనా రా అంటూ "ఏ రూపంలోనైనారా "కవితలోను పిలుపిచ్చారు. "మేమేమో వేశ్యలం.. మరి" అనే కవితలో వేశ్యల వ్యధలను చిత్రించి నారు.

"వెన్నెల రాత్రుల్లో కన్న కలలు కరిగిపోయి వేదన జీవితాలు వెక్కిరింపులు అవమానాలతో కాలం వెళ్లదీసే" వేశ్యల బాధలను ఏకరువు పెట్టారు.

బాల కార్మికులను ఉద్దేశించి ఓ కవిత వ్రాస్తూ
"బానిసలు కాదు మీరు భావి భారత పౌరులు
యాచించే స్థాయి నుండి శాసించే స్థాయికి ఎదగాల"ని సూచించారు. జీవిత భాగస్వామి గురించి
"ఎక్కడో పుట్టి ఎన్నో ఆశలతో తాళి తో ఆలీవై
నా ప్రయాణంలో తోడువై నీకంటూ స్వేచ్ఛ లేక
నా మాట నీకు వేదమై నా క్షేమమే నీకు ధ్యేయమై
కుటుంబమే లోకమై
నీ జీవితమంతా త్యాగమే భార్యగా తల్లిగా"
అంటూ "త్యాగ జీవితం" అనే కవితలో భార్య యొక్క త్యాగాన్ని వర్ణించాడు. యువత స్వేచ్ఛ పేరిట చెడిపోతుంది.

"కోరుకో స్వేచ్ఛను కాలరాయకు భవితను స్వేచ్ఛ నాకుందంటూ తెంచకు మానవతా విలువలు
వ్యక్తిగత స్వేచ్ఛ వ్యవస్థకు తేవద్దు మచ్చ"అని స్వేచ్ఛ పేరిట యువత చెడి పోవద్దంటూ కోరుకున్నాడు.

"సతి"అనే కవితలో
"చక్కగా ముస్తాబైయితే సోకులంటారు
నంగా ఉంటే మూడురాలంటారు
ముక్కు సూటిగా మాట్లాడితే గయ్యాళి" అంటారు
ఏ విధంగా మసలుకొన్న ఏదో వంకతో అవమానించే అవహేళన చేసే సమాజము ఉందంటాడు.

"ఆశయం నెరవేర్చే ప్రయత్నంలో వేసే అడుగులు ఆపకు
ఆశయ సాధనలో అందంకులు ఎన్ని ఎదురైనా పట్టువదలకు
ఆశయాన్ని సాధించా తప్పటడుగులు వేయకు
అవినీతిని అంటకు లోకహితం మరువకు
మృత్యువు ఎదురొచ్చినా సంజీవిని కలిగిన చిరంజీవిలా సాగిపో..."

ఆశయం సాధించే క్రమంలో సమాజ శ్రేయస్సును మరవద్దంటూ అవినీతి అక్రమాలకు తావు ఇవ్వకూడదు అని

"కట్నం కావాలంటే పంపాలా" అనే కవితలో
"మూడు రాత్రులు గడవ నే లేదు
నా జీవితానికి ముగింపు ఎందుకు పలికావు"
కవి ఆడవారి కట్నం బాధలను వివరించారు.

స్వతంత్ర భారతం ఏ విధంగా ఉందో తెలియజేస్తూ .
"కులాల పేర కొట్లాటలు
మతాల పేర మారణహోమాలు
ఆత్మ హత్యలు ,అత్యాచారాలు
కరువులతో రైతుల ఆత్మహత్యలు నిరుద్యోగం, నిస్పృహ
పట్టణాలు విధ్వంసం ,పల్లెల్లో ప్రగతి శూన్యం
అధికారంలో ఉన్నవాళ్లు
కాంట్రాక్టులు కోట్ల ముడుపులు
కమిషన్లు ,కట్టు కథలు
రాజ్యహింస, కుట్రల కేసులు
అధికారంలో లేని వాళ్ళు
బందులు, ఆందోళనలు
నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు" అంటూ పాలకులు ప్రజల సంబంధాలపై కవితలో చక్కగా వర్ణించాడు. "కార్పొరేట్ కాలేజీ" అనే కవితలో "విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను, స్వేచ్ఛ, సంతోషంతో గడపలేక మార్కులు రాకపోయేసరికి ప్రాణాలు తీసుకునే విధానం చక్కగా వ్రాసారు."

"సూరేళ్ల జీవితాన్ని ఏ పిశాచి కబలించిందో
కన్నవారి ఆశలు తుంచి తిరిగి రాని లోకాలకు తరలి వెళ్ళిరి
కన్నవారికలల సౌధం కూలి కడుపుకోత మిగిలిపోయే
జరిగిన ఘోరాలకు కారకులెవరు
కలిగే నష్టాలు పూడ్చేదేవరు"
అని ప్రభుత్వ కార్పొరేట్ విధానాలను ఎండగట్టాడు కవి దుప్పటి మొగిలి.

ప్రజాకవి కాళోజీ గురించి, సావిత్రిబాయి పూలే గురించి అంబేద్కర్ గురించి ఈ కవితా సంపుటిలో చక్కగా రచించారు. కవి కలంలో ఆవేదన, ఆవేశంతో పాటు సమసమాజ స్థాపన కోసం ఆరాట పడుతున్నట్టు కలబోసిన కవితా కుసుమమే ఈ కవితసంపుటి .

సమాజంలో స్త్రీలు , యువత, కార్మికులు
నిరుద్యోగం, కులమత బేధాలు, విద్యార్థులు వ్యేశ్యలు,మూఢనమ్మకాలు, రైతు ప్రతి కవితా వస్తువు నిశ్శబ్దాన్ని బద్దలు చేసే కవిత్వమే "నిద్రలేచిన నిశ్శబ్దం" కవితా సంపుటి .కవితా సంపుటిలోని 60 కవితలు చదువుతున్నంతసేపు మనసు కట్టిపడేసేవే , మొదటి నుండి చివరి వరకు చదివించే పుస్తకం. మంచి సాహిత్యం తో పాటు సామాజిక విలువలను కోరుకుంటూ కవితా సంపుటి వ్రాసిన దుప్పటి మొగిలి గారు అభినందనీయులు . చదివిన ప్రతి ఒక్కరూ అభినందించి తీరాలిసిందే.

ప్రతులకు: దుప్పటి మొగిలి
19-88 భూపాలపల్లి
జయశంకర్ జిల్లా
8466827118

- గడ్డం లక్ష్మయ్య
సెల్: 98486932820

వందనం

ప్రాణములు పణములుగ పెట్టి
బాధితులకు సేవచేసే
వైద్యులారా వందనం!
నర్సులారా వందనం!

నిద్ర యెరుగక, నీరమెరుగక
సమయముకు భోజనము చేయక
రోడ్డుపై పహారాను కాసే
పోలీసులారా! వందనం

పొద్దు పొడువక ముందె వచ్చి
ఒంటికంతా దుమ్ము పాకగ
పారిశుధ్యపు పనులు చేసే
కార్మికులకు వందనం!

ప్రజల రక్షణ కోసము
పలు చర్యలే చేపట్టుతున్న
ప్రభుత్వాధినేతలారా వందనం!
అధికారులారా వందనం!

కరోనా వ్యాపించ వద్దని
నిర్లక్ష్య మసలే వద్దని
ప్రజలలో చేతనను నింపే
ప్రచారకర్తలారా వందనం!

అవసరములను తీర్చడానికి
కరోనా నరికట్టడానికి
అవిరళముగ విరాళమిచ్చే
దాతలారా వందనం!

కరోనాకు వ్యాక్సిన్
కనిపెట్టడానికి అహర్నిశలు
పరిశోధనలు చేయుచున్న
శాస్త్రజ్ఞులారా వందనం!

భర్త,పిల్లల కింటివద్దనె
కడుపు నిండా తిండి పెట్టి
కంటిరెప్పల వలెను కాచే
గృహిణులారా వందనం!

బయట ఎక్కడ కడుగు పెట్టక
కరోనా కవకాశమివ్వక
ఇంటికే పరిమితము అయ్యే
ప్రజలందరికి వందనం

-ఎ.గజేందర్ రెడ్డి
9848894086

ఇంటిపట్టున ఉండు

ఇంటిపట్టునుండరా ఇగురంతో ఉండరా
ఇల్లు దాటి బయటికెళ్తే
నువ్ కాటికే పోతవురా

రోడ్లపైన కరోన దయ్యం ఉందట
రోడ్ పైకి నీవు అసలే వెళ్ళకురో
కరోనా నిన్ను ఆం బుక్కంటూ
మాయం చేయును

చేతులను పదే పదే సబ్బుతో కడుగుము
నోటిని, ముక్కును గుడ్డతో కట్టుము
మనిషి మనిషికి మధ్యన
మూడు మీటర్ల దూరము
కరోనాని ఖతం చేయ
నీ వంతు బాధ్యతే అది

నీ పిల్లా పాపలు, నీ కుటుంబం కోసము
పోలీసులు జెప్పిరి మీ ఆరోగ్యం కోసము
పోలీసోళ్ళు పడరాని
కష్టాలు రోడ్లపై పడుతున్నా
నే పోకిరీ లెక్కనే తిరుగుతానంటవురో

స్వీయ నియంత్రణలో ఉండుము
స్వచ్ఛమైన ఆరోగ్యం నీదవును
లేదంటేనూ కరోనా మింగును
ఇంట్ల ఉంటే మాత్రం
కలకాలం ఉందువు..

-విజయలక్ష్మి మార
9533333191

కరోనా!

కాలధర్మమే నీకు కోరోనా
మారణ హోమం చేసి మంటలు పెడుతున్నావు
కనిపించని కరోనా దేశదేశాలు తిరుగుతూ
జ్వరము, దగ్గు చేత జగమేలుచున్నావు
శ్వాసతోనే మా ఉసురు తీస్తున్నావు.

జనుల ఆర్తనాదాల విని ఆనందించుచున్నావు
జయించినానని విర్రవీగకుమా...
కొండెక్కి కూర్చొని కోరి గంతులేయకు
కొలిమిలో కుక్కెదరు కోవిడ్19 నిన్ను....

భువిలో ప్రజలు బీతిల్లుచుండగా
బుద్ధిగా వెళ్ళిపో భూమికి దూరంగా
నరుని మేధస్సు చేత నేలమట్టమే నీవు
కాలధర్మం తప్పదు నీకు కడకు సుమా

సామాజిక దూరము చేత సాగనంపుదురే
క్వారంటైన్ చేత కొట్టి చంపుదురే
ఐసోలేషన్ చేత అంతమొందించుదురే నిన్ను
ఇకనైనా వినుమా జనుల మాట
నెరుపటి వారి నోట!

మాస్కు పెట్టుకున్న మనుషులను చూడు
శుభ్రమైన చేతులతో చుక్కలే నీకు .....
బందించేదరే నిన్ను,
మా ఇంట్లో మేము బందీలమై ఉండి
నీకొక నమస్కారమే
ఇకనైనా వెళ్ళిపో ఇలలో నుండి!

-నెరుపటి ఆనంద్
9989048428

గెలుద్దాం.. నిలుద్దాం..!

విశ్వమెల్ల నిత్య సత్య చైతన్య సంపూర్ణ ఆరోగ్య సిద్ధికై సకల చరాచర జీవ జగత్తు తపిస్తున్న వేళ ! సృష్టి కర్త బ్రహ్మ తమకొసగిన అత్యద్భుత స్వీయ నియంత్రణా శక్తిని మానవాళి పరిపుష్టమొనర్చుకోవాల్సిన ఆవశ్యకత !

ప్రాచీన వేద సంస్కృతి పుణికి పుచ్చుకున్న భారతీయ సనాతన ధర్మ నిరతి తొడుగ విశ్వ మానవాళి సానుకూల స్పందనాత్మక చైతన్యమై పరిఢవిల్ల ! ప్రకృతి అనునిత్యం ఈ ఇలకు నేర్పెడి మైత్రీ భావనాత్మక సువ్యక్తిత్వ ధర్మ ఛాయలుట్టిపడగ ! ఈ పవిత్ర పృధ్విపై అనాదిగా స్థిరీకృతమై నెలకొన్న సాధ్యాసాధ్య విశ్లేషణను సవిస్తరంగ విప్పి చెప్ప ! సకల చరాచర జీవ జగతి సంక్షేమార్థమై విశ్వ మానవాళి తన తక్షణ కర్తవ్యంగ కలసి నడువ ! సంయమన శక్తి తోడుకొనగా, అందరు ఒక్కటై సమున్నత రీతిన విశ్వ ప్రశాంతతకై, సత్వర సకలారోగ్య సిద్ధికై సాగాల్సిన సమయమిది !

సువిశాల విశ్వ సమైక్యతా భావనాత్మక యోచనా సుహృద్భావ దార్శనికత కావాల్సిన ఆవశ్యకత ! జీవులన్నిటిలో కడు మిక్కిలి వైశిష్ట్యం పొందిన మానవాళి విశ్వానికే తలమానికమైన రీతిన చూపాల్సిన విధి విధానం, " జీవకారుణ్యత " ! ప్రతి వ్యక్తీ తన తక్షణ బాధ్యతగా సువ్యక్తిత్వ మానసిక వికాసానికై కృషి సల్పాల్సిన నేపథ్యం !

అరమరికలు లేని ఆడంబరాలకు పోని, ఆత్మీయ స్నేహ స్పర్శతో కూడిన సానుకూల దృక్పథమే ప్రధాన లక్ష్యమై నిలిచే సమయం ! మనో నిబ్బరత, ఆత్మ విశ్వాసం ముఖ్యాంశాలై, విశ్వ ప్రజ ముమ్ముందుకు సాగాల్సిన చైతన్య స్ఫూర్తి ! ఈ సువిశాల విశ్వమందు ప్రతి వ్యక్తి తన బాధ్యతగ యావత్ విశ్వ వ్యాప్త జీవ జగత్తు సంక్షేమమునకై యోచించాల్సిన సమయమిది !

ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో యావత్ విశ్వ జీవజాలపు సంపూర్ణ సాధారణ ఆరోగ్య సిద్ధికై, ప్రతి వ్యక్తీ చక్కని సానుకూల దృక్పథ యోధుడై నడవాల్సిన నేపథ్యం ! ఆత్మ విశ్వాసం, నిశ్చల మనో నిబ్బరత, పరిపూర్ణ ఒండొరుల మైత్రీ భావనాత్మక చైతన్య స్ఫూర్తి, ఈ కష్ట కాలాన్ని దాటించగలదనే విశ్వాసమే విశ్వ మానవాళి ప్రస్తుత కర్తవ్యం !

" యద్భావం తద్భవతి ", సర్వే సంతు సుఖినః ! సర్వే సంతు నిరామయా ! సర్వే భద్రాణి పశ్యంతు ! మా కశ్చిత్ దుఃఖ భాగ్భవేత్ !!

-గుళ్లపల్లి ఆంజనేయులు
09848369618
07901238168)

కరోనా నేర్పింది ఘాటైన పాఠం

యావత్ ప్రపంచాన్నీ గడగడలాడిస్తూ,
మొట్టమొదటిసారిగా మరణ భయాన్ని
మనుష్యులకు రుచి చూపిస్తు,
కంటి మీదకునుకు లేకుండా చేస్తున్నది
ఖతర్నాక్ కరోనా

కంటికి కనబడని వైరస్సులా ప్రభలి
ఒంటినున్న జీవక్రియను పాడుచేసి
ఆయువును హరించే మహమ్మారి కరోనా

మనిషికి మనిషికి మధ్య దూరాన్ని పెంచి
నిర్బంధ ఖైదీని చేసి
చెరసాలలో బందీని చేసింది
మృత్యుభయాన్ని చూపింది

కరోనా నువ్వు మా పాలిట యమపాశమైనా
నీ రాక మాకు దురదృష్టమైనా,
నీ వలన మేము ఓ పాఠం నేర్చుకున్నాం
"అతి" ఎప్పుడూ ప్రమాదమే,
ప్రకృతి విరుద్ధపు చర్యలు
మానవాళిని మ్రింగే చావుచర్యలే

ఇకనైనా మేల్కొంటాము.లాక్ డౌన్ పాటిస్తు
వ్యక్తిగత దూరంగా వుంటు,పరిశుభ్రతకు
ప్రథమ ప్రాధాన్యతనిస్తు,
ఘాటుగా విజృంభిస్తున్న నీపై
కఠినమైన పోరాటంచేస్తాం

మనిషి సంకల్పబలంతో నిరంతపోరాడితే
సాధించలేనిది లేదు అని విశ్వానికి చాటుదాం
స్వీయ రక్షణతో కరోనాని తరిమి కొడదాం

- విశ్వనాథ నరసింహం
9490971589

మందులేని మహమ్మారి

దేశమంతా అష్టదిగ్బంధనం
ప్రతి ఇల్లు లాక్ డౌన్
కనిపిస్తే లాఠీతో సిక్సర్ల మోతలు
రైలు బోగీలన్ని ఆస్పత్రులౌతున్నయి
బస్టాండులన్ని రైతు బజార్లయినయి
డబ్బాల దూరంలో సరుకులన్ని కొంటుంటే
ఎవరైనా కనిపించి పలకరించబోతే
దాగుడు మూతలతో దొరకని బతుకైంది
ఇంటి నుండి కదలలేని దుస్థితి
కంటికి కనిపించని కరోనా
ఏ రూపానుందోనని
డెటాల్ నీళ్లలో ప్రతి వస్తువు కడుగుతూ
అంటు ముట్టంటూ ఆలోచనల జీవితమాయే
ఇంట్లో కూర్చుంటే అవ్వయ్యలు గుర్తుకొచ్చే
అత్తమామలు ఎట్లున్నరోనిపించే
తోబుట్టువులు గుర్తుకొస్తే దుఃఖమొచ్చే
నిత్యం కలిసి తిరిగే ఆత్మీయులు యాదికొచ్చి
గుండెలన్నీ అవిసిపోవట్టే
ఫోన్ లో ఎవరిని పలకరించినా ఒక్కటే మాట
నిర్లక్ష్యం వద్దు మిత్రమా..!
జాగ్రత్త సుమా..! అంటూ
చిట్కాల పురాణం చెప్పవట్రి
టీవీల్లో అలనాటి రామాయణం రావట్టే
అష్టా చమ్మ ఆటలు ఇంటింటా ఆడవట్రి
ఇంటిల్లిపాది ఆనందలోకమే
అయినా అందరికీ ఒకటే దిగులు
అగ్ర రాజ్యాలే నేడు అతాలకుతలమైనయి
రాజు,రాణి లు సైతం
కరోనాకు కాకా వికలమైనారు
మందులేని మహమ్మారికి
దొరకక పోవడమే ఉత్తమం
అలసత్వం వద్దు మిత్రమా..!
ఆవల అడుగెయ్యకు నేస్తమా..!

-ఉరిడ్రాళ్ళ రాజేశం
9966946084



మధురవాణిలు

ఓ దళిత కుటుంబంలో పుట్టెనతడు
కడు పేదరికంలో పెరిగెను చూడు
మహారాష్ట్రాలో చిన్న పల్లె అది
కష్టాలెన్నో దిగమింగి గొప్పగా ఎదిగెనతడు
చిన్ననాటి నుండే చవిచూచె కష్టాలు
కష్టాలనే మలచుకునే తనుకు ఇష్టాలుగా
ఎన్ని కష్టాలు వచ్చినా గాని
చెదరలేదు బెదరలేదు తాను చివరగా
చిన్నతనంలో చదువు కష్టమాయె తనకు
అంటరాని వాడని దూరముంచిరి నాడు
అటులనే దీక్షబూని చదివె ఆనాడు
అందుకే పేదలకు దేవుడాయే నేడు
గొప్ప చదువది ఎవరు చదవలేరు
గొప్ప జ్ఞానమది ఎవరు పొందలేరు
ఇంత జ్ఞానివంతుడు భూమిపైన లేడు
తనురాసే రాజ్యాంగము ఎవరు రాయలేరు
దేశదేశాలు తిరిగి తిరిగి చదివే
డాక్టరు, బ్యారిష్టరు, న్యాయశాస్త్ర చదువులు
పొందేను గొప్పగొప్ప పట్టాలను అతడు
ఇంకెవరు చదవలేరు ఇంతగొప్ప చదువులు
అంటరాని తనమును రూపుమాప నీవు
కుల కుమ్ములాటలకు స్వస్తిపలుక నీవు
నడుముకట్టి ధైర్యంగా నిల్చుండి నీవు
పేదల జీవితాల్లో వెలుగు నింపినావు
ఎవరికి చేతకాని పనులు చేసినావు
ఎవరును రాయలేని రాత రాసినావు
ఎందరి పాలిటనో దేవుడివై నీవు
ఎందరో అభాగ్యుల తలరాత మార్చినావు
పాతకాలం నుంచి వచ్చిన ఆచారాలు
తప్పుడు ఆచారాలని తేల్చి చెప్పినావు
సరయిన పద్ధతిని మాకు నేర్పినావు
మాపాలిట నీవు నిజంగానే దేవుడైనావు
నీ జాతిని కాపాడుకొన నీవు
నీవారు అందరిని వదిలి పెట్టినావు
భార్యా బిడ్డలను లెక్క జేయకుండా
నాజాతి, నావాళ్ళని అక్కున జేర్చుకున్నావు
ఎవరు జేతురీ సహాసము భువిలో
ఎవరు జేతురీ సహాయము ఇలలో
నిమ్న జాతుల ఉద్ధరణకై నీలాగా
ఎవరు జేతురీ యుద్ధమీ నేలలో

-డా. జలంధర్ వాగ్మారే
9989597929

రాజ్యాంగ నిర్మాత..

సంఘ సంస్కర్త సాధకుడు
బడుగుజీవుల జీవితాల్లో
చీకట్లు పారద్రోలి
వెలుగులు నింపిన
బహుజన హితుడు
బడుగుల ఆశాజ్యోతి!!
మార్గదర్శకుడు
సకల విజ్ఞాన పారంగతుడు
రాజ్యాంగ నిర్మాణ దక్షుడు
బాబాసాహెబ్ అంబేద్కరుడు!!
కష్టాల కడలిని ఈది
చదువు విలువ తెలిసి
శ్రమ సౌందర్యంతో
అట్టడుగు స్థాయి నుండి వచ్చి
అంటరాని తనాన్ని
ఎదిరించిన జ్ఞానయోధుడు
ఎన్నో ఉన్నత శిఖరాలను
అధిరోహించిన ధీశాలి
బడుగు బలహీన వర్గాలకు అండ
భారత రాజ్యాంగ రూపకర్త
స్వతంత్ర భారతదేశానికి
ప్రథమ న్యాయశాఖ మంత్రి
నిగర్వి అందరి ఆత్మబంధువు!!
కులం అడ్డు గోడలను త్రోసిరాజని
ఆటుపోట్లను అధిగమించి
కృషి పట్టుదలతో
జ్ఞాన సంపద నార్జించి
ముళ్లబాటను పూలబాటగా
మలుచుకున్న మహనీయుడు
ఆదర్శప్రాయుడు
భరతమాత ముద్దుబిడ్డ భారతరత్నం
డాక్టర్ బాబా
సాహెబ్ అంబేద్కర్!!

-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి
9490367383.

అంబేద్కర్ మధురవాణి

భారత జాతి దీపం అంబేద్కర్
భారత దేశ ఖ్యాతి అంబేద్కర్
భారతీయుల ఆశ కిరణం అంబేద్కర్
భారతీయుల జీవన దాత అంబెద్కర్.
కులాల పోరు వద్దన్నాడు అంబేద్కర్
మాతాల పోరు వద్దన్నాడు అంబేద్కర్
మానవులంత ఒక్కటే అన్నాడు అంబేద్కర్
మానవులంత సమానం అన్నాడు అంబేద్కర్.
అంబేద్కర్ మాట మూత్యాల మూట
భారత రాజ్యాంగం పూల తోట
అంబేద్కర్ చూపెను బంగారు బాట
వినాలి అందరు అంబేద్కర్ మాట.
దేశాలు ఎన్నో తిరిగాడు అంబేద్కర్
పుస్తకాలు ఎన్నో చదివాడు అంబేద్కర్
ఆరవ వేదం రాశాడు అంబేద్కర్
ఋషుల సరసాన నిలిచాడు అంబేద్కర్.

-జాధవ్ పుండలిక్ రావు పాటిల్
9441333315

అంబేద్కర్ మహాశయుడు

అతడు అద్భుత జ్ఞానసంపద గలవాడు
అతడు అచంచల దేశభక్తి ఉన్నవాడు
అతడు మహోన్నత హృదయుడై నిలచినవాడు
అతడే మన అంబేద్కర్ మహాశయుడు
విద్యార్థుల మార్గదర్శి అయినవాడు అతడు
విద్యావిధాన దిక్సూచిగా మెలిగినవాడు అతడు
మూకనాయక్, జనతా సంపాదకునిగా నిలచినవాడు
అతడే మన అంబేద్కర్ మహాశయుడు
రచయితగా వ్యాసాలు పుస్తకాలు వెలువరించినవాడు
ఆర్థికవేత్తయై ఆంగ్లేయులను ఆశ్చర్యపరచినవాడు అతడు
ఉద్యమకారుడై అస్పృశ్యులకు అండగా నిలచినవాడు
అతడే మన అంబేద్కర్ మహాశయుడు
చౌదర్ చెరువు సత్యాగ్రహంతో అస్పృశ్యతను ధిక్కరించినవాడు
నాగపూర్ సహపంక్తిభోజనంతో ఏకతను సాధించినవాడు
కార్మికమంత్రిగా దేశ మొదటిమంత్రివర్గంలో ఉన్నవాడు
అతడే మన అంబేద్కర్ మహాశయుడు
రాజ్యాంగరససుధాకరునిగా పేరుగాంచినవాడు కదా అతడు
భారతదేశ భవితను తీర్చిదిద్దినవాడు అతడు
అతడే మన అంబేద్కర్ మహాశయుడు
ఆమహనీయునికి అక్షరాంజలులు
అర్పిస్తున్నాడీ రాంనరేషుడు.

-రాంనరేష్ కుమార్
9492682285

ముందు నీ అంతర్గత శత్రువును ఎదిరించు..!

-డా॥ కత్తి పద్మారావు
సెల్:9849741695

సముద్ర గర్భంలో పేరుకుపోతున్న అణు ఇంధనాలు
విశ్వం రోగగ్రస్తం అవుతోంది
మనిషి తన అహంకారం నుండి మెట్లు దిగుతున్నాడు
విశ్వ పరిణామాన్ని అర్థం చేసుకోలేకపోతున్నాడు
జీవ పరిణామాన్ని గుర్తించలేకపోయాడు
పుట్టుకకు మరణానికి ఎంతో వేదాంతాన్ని మప్పాడు
మరణం తంతుపై బ్రతకడం ప్రారంభించాడు
మెదడుల్లో వైరస్‌లా చొరబడ్డాడు
శాస్త్రీయ జ్ఞానం నుండి తప్పించాడు
సూర్యరశ్మినే కల్మషం చేయాలని చూశాడు
దాసంతటికి తానే పుట్టి పెరుగుతున్న మొక్కను
గొడ్డలితో నరికి భూమికి తాపాన్ని కలిగించాడు
ఆ కొలనులో తామర తూళ్ళు
స్వచ్ఛంగా ప్రకాశిస్తున్నాయి
ఆ అమ్మాయి చూపులో సంగీతం పలుకుతుంది
ఆ ముంగురులు కృతులు రాస్తున్నాయి
ఆ పచ్చని పొలాలు చిరుగాలికి ఊగుతున్నాయి
ఆ మంచె మీద ఒడిసెలకు బదులు
గిటారా మ్రోగుతోంది
ఆ నది మీద నడుస్తున్న పడవలో జాలరి
నీటి తరంగాల్లో దాగున్న ఏలపాటలు వింటున్నాడు
ప్రతి చేప ఈతలో ఓ శృతి వుంది సుమా!
అవును! మీ ఇంటిముందు వేప చెట్టును
మీరు నరికేసినపుడు,
మీ ఆయువుల మీద మీరు వేటు వేశారు
వేపచిగురు మిమ్మల్ని సజీవుల్ని చేస్తుందని
మీకు తెలియలేదా!
మీరు పిజ్జాలు, బర్గరులు, పలావుల
వెంటబడ్డప్పుడే భూమికి బరువైయ్యారు
మీరు బుగ్గలో ఉసిరిని ఊసేశారు
చాక్లెట్లు పళ్ళసందుల్లో కుక్కారు
మీ దంతాలను పరాన్న జీవులు ఆశ్రయించాయి
వైరస్ బయటనుండి కాక మీ నోటిలోనే ఏర్పడింది
ఇక బయటినుండి వస్తున్న వైరస్‌ను
లోపలినుండే ఎదుర్కొవాలి సుమా!
ప్రకృతిని, మనో ప్రకృతిని మీరు కృత్రిమం చేసుకుంటున్నారు
చేదులో కూడా రుచి ఉందని తెలుసుకోలేకపోయారు
నీ చేతిలో వున్న నిమ్మకాయను కాలితో తొక్కేశావు
నూనెలో కాగిన మాంసపు ముక్కకు ఎగబడ్డావు
గుంపులో నుండి విడివడి వాట్సప్ దృశ్యాల్లోకి ఎగబాకావు,
ఒంటరయ్యావు
భ్రమపూరితమైన తోడుకు తారట్లాడి
అసలు తోడును నిర్లక్ష్యం చేశావు
వేడి వేడి పాలు త్రాగి నిద్రించాల్సిన నీవు
పులిసిన నీళ్ళతో రాత్రులు గడిపావు
నీ కాలేయం రాత్రింబవళ్ళు పనిచేసి అలసిపోయింది
అంతర్గత వ్యవస్థలన్నీ ధ్వంసం చేస్తూ వెళ్తున్నావు
అవును! నీవు నీ ఎదురుగా వున్న మనిషితో
మాట్లాడటం మానివేశావు
నీ సహచరణి కనుల్లో వుండే శిల్ప రహస్యాలను
చూడటం మానేశావు
నీ చేతిలో రంగుల బొమ్మలను చూస్తూ
ట్యాబ్‌ల్లో తలదూర్చి బ్రతుకుతున్నావు
ఆమె మాటల్లో జీవన సూత్రాలను పెడచెవినపెట్టావు
ఆమె కూడా క్రౌర్య దావానలాన్ని మండించే
టీవీ సీరియల్స్‌లో దగ్ధం అవుతుంది
నిన్నటి కథ నుండి రేపటి కథ కోసం ఎదురుచూస్తోంది
తన భర్త రాక కోసం ఎదురుచూడటం మానివేసింది
మన పిల్లలు కూడా తోటి పిల్లలతో ఆడటం మానివేసి
చైనా బొమ్మలతో ఆడుతున్నారు
అవి విషయుక్తమైన పదార్థాలతో తయారయ్యాయని
అప్పుడు అర్థం కాలేదు
ఇప్పుడు చైనాలో కరోనా వైరస్ ప్రపంచమంతా వ్యాపించింది
చైనా నిరోధించుకుంటుంది
కాని మనం భయంలోనే వున్నాం
మన అంతర్గత వ్యవస్థ నుండి
మనం పరాధీనం అవుతూ వస్తున్నాం
ఆ అంధుడు చూడు జీవితాన్ని పాటగట్టి పాడుతున్నాడు
కనిపించేదానికంటే కనిపించనిదానిలోనే
జీవితసారం వుందని చెప్తున్నాడు
నీలోనే అనేక శక్తులు ఉన్నాయి
కానీ, నీవు వేరేవారి వాక్కుకోసం చిక్కిపోతున్నావు
నీ పెరటిలో వున్న కలబంద ప్రపంచానికే గొప్ప ఔషదం
ప్రాకృతికమైన వాటినంతటినీ నిరాకరిస్తున్నారు
మానవ పరిణామంలో మలుపులు చూడు
మొక్కకి, నీటి చుక్కకి, వేగుచుక్కకి
వున్న అనుబంధాన్ని గుర్తించు సుమా!
తల్లి మాటను పెడచెవిన పెట్టొద్దు సుమా!
ఆ పాటగాడు పబ్‌లో గొడవపడి గాయపడ్డాడు
జీవితం క్రమశిక్షణ తప్పితే ఆత్మహననానికి దారితీస్తుంది
తెరమీద మనల్ని నవ్వించిన ఎందరో కళాకారులు
మత్తుపాన ప్రియులై మృత్యువాతపడ్డారు
కళ ఇతరులకే కాదు మనకి ఊపిరి పోయాలి
ముందు నీలో అంతర్గత శత్రువును ఎదిరించు
ప్రకృతిని, నిన్ను సమన్వయించుకో
జీవితమంటే భారం కాదు భవితవ్యం నిగమన గమనం
జీవితమంటే పునరుజ్జీవన సూత్రం..!

కరోనా కాష్టం

సోదరులారా వినరండి
సాదరముగ ఇది కనరండి
కాలు బయటకు పెట్టకండి
కరోనా బాధలు పడకండి. ॥సో॥

కదులుతున్నది కాల సర్పము
రగులుతున్నది కరోనా కాష్టము
మ్రోగుతున్నది మరణ మృదంగము
జరుగుతున్నది మారణ హోమము ॥సో॥

తెచ్చెనదిగో కరోనా తంట
అంటుకుంటే పోదు మంట
ఒకరికి ఒకరు కలువకుంట
దూరం దూరం గుండాలంట ॥సో॥

ప్రపంచమంతా పాకింది
ప్రాణాలెన్నో మింగుతోంది
లాక్‌డౌన్‌ను పాటించండి
లక్షణంగా ఇంట్లో ఉండండి ॥సో॥

వద్దు వద్దు కరచాలనము
ముద్దు ముద్దు నమస్కారము
పాశ్చాత్య సంస్కృతి పక్కనబెట్టి
భారత సాంప్రదాయములను పాటిద్దాం. ॥సో॥

వైద్యులు సైనికులు
ప్రాణాలొడ్డి పోరాడుతున్నారు
త్యాగధనులకు అండగా నిలవాలి
మన హృద్దుల్లో మనముండాలి. ॥సో॥

మత్తుకోసము బయటకు వస్తే
చిత్తుజేస్తది కరోనా రక్కసి
ఆసన యోగలు చేయాలి
వ్యసనాలకు దూరంగుండాలి. ॥సో॥

గంటగంటకు చేతులు కడిగి
శానిటైషన్‌ను పాటించండి
ఇంట్లో ఉండడం కాదు శిక్ష
అదియే అందరికి శ్రీరామరక్ష. ॥సో॥

పెద్దల మాట చద్దిమూట
హద్దుమీరితే ముళ్ళబాట
కాలు బయటకు పెట్టకండి
కరోనా బాధలు పడకండి.॥సో॥

- డా॥ కూర్మాచలం శంకరస్వామి
సెల్: 7702435110

కరోనా సూక్తి

ప్రకృతి ముందు అందరూ జీరోనే
అది తలుచుకుంటే ఎంతటివారినైనా
చిటికెలో కూల్చేస్తుంది
ఈనాడు చూడండి
మహామహులంతా ఎవ్వరికీ కనబడకుండా
ఏ తొర్రలోనో దాక్కుంటున్నారు భీతిల్లి.

- దారం గంగాధర్
సెల్: 9848384777

నిజదేవోభవ...

(జనం కోసం, సమాజహితంకోసం, శ్రమైక జీవనపథాన సాగుతున్న శ్రామికదైవాలకు అంజలిఘటిస్తున్న శీర్షిక..)

ఇవపరసాధన నిధాన వ్రపోత్రి నమస్తే!

-దోరవేటి
సెల్:9866251679

కం॥ నవనమతో, శాంతముతో
నవరసము శ్రమించు చుందు నమ్మా సరళా
కవనమువలెను మాకందరి
కిపపర సాధన నిధాన! వ్రపోత్రి! నమస్తే!

ఉ॥ కూతురుపై వ్రపమ్మునను కొడలినయ్యి మరోవ్రపమ్మునన్
చేతన నింపుచుందువ్ర సచేతన కార్యనిమగ్నవై సదా
ప్రీతిని గూర్చువమ్మ వ్రపవృత్తికి, నిత్యక్రియాప్రవృత్తికిన్,
రీతికి, సంస్కృతీధృతి పరిఢతకున్ దగు దీపకాంతివై.

కం॥ అందరి అవసరములకును
ముందుగ నీవుందువమ్మ ముదమరగ వ్ర
న్నందెర ముందు నేవ మ
రందమ్మను నిలువుకున్న రమ్యపరిమళా!

ఉ॥ మమకు నీదు నామమది మాటికి మాటికి నోటబల్కు; నీ
మమ సతిమతల్లి కనుమానము లేకను నీదు సాధనా
నిమము మనసంబున నినికముగా దొరలంగ నేర్చు; నీ
ప్రేమను నారు పెళ్ళాటికి ప్రీతిగ నేవట నీవె గావలెన్.

కం॥ అలసి సొలసి కొంత సడిమ నేయుగా
విశ్రమింపనారు వేళయందె
గురుతుకొచ్చునమ్మ కొడలనేవట
అత్తకైన, ఆమె 'పాత్ర'కైన.

మ॥ పతియై, సోష్యము పాలవడయి, నవీబంధమ్ము నందమ్ముగా
శ్రవణన్ జూపుచు, ప్రేమ పంచుచునె సంకీర్ణప్రమోదాప్తి చే
ప్రతికార్యంబున కీవె యాదెరువుగా ప్రస్థానమున్ సల్పుచున్
సుతులన్, పుత్రకలన్ యెసంగగ మనస్సున్ వేడుకన్ చేతువే!

ఆ॥ పిల్లలైన వేళ ప్రేమామృతము ఇంట
పొలగిపొరలుచుండు నింగినంట
ముద్దులందుకొనగ ముదుదురందరు
నేవలందజేయు చేతులేవి?!

చ॥ పెరిమిటి కింటనేది గనిపించదు, అన్నాటికి వేదికున్; నీ
ప్రణయప్రసాద వల్లరికి ప్రాణము, గానము, ధ్యానమవె; భా
జనమకు పిన్నపెద్దలకు చల్లని హస్తము నీవె తల్లి! భా
జనమగు నేవలన్నాటికి చక్కని సంజ్ఞవు ఇంటి దీపమా!

కం॥ సంపాదనపరు లందరు
సంపాదిగ నింట గడుపనేర్దురు, కాలం
బుం పనులన్నకు వదిలి, త
లంపైనను నేయరు వ్రపలక్ష్మీ శ్రమలన్.

ఉ॥ ఇంటికి అద్దమున్ వలెను యెల్లప్పు డూడిచి, తూడిచేవు; వం
టింటికి కమ్మ వాసనల యింపును నింపు రుచుల్ వరింపగా
నొంటికి ధర్మమౌకైక మహాజ్జ్వలకాంతులు నింపుచుండగా
నొంటరిగానె పోరుదువహో! చిరునవ్వు మహాయుధమ్మునన్.

ఆ॥ నీ గుణమ్ముతోనె నిత్యప్రతిష్ఠ స
జనములోన, బంధుజనములోన
కల్మషమ్ము మదికి కించిత్తు రానీకు
తల్లి! నీవె కల్పవల్లివమ్మ!

మ॥ వ్రపమందున్ వివిధాను బంధముల సత్పుత్రత్రయులన్ సల్పుచున్
నవనందుచున్ ప్రకటింతువమ్మ, బయటన్ సారించి నీ నేవలన్
బహురంగమ్ముల, వృత్తులన్, పను ల, సంభావించు నుద్యోగముల్
నవభావంచు నుతింతు నీదు శ్రమలన్ నీమంతినే నిచ్చలన్.

ఆ॥ వేతనమ్ము వేరె, పెలకట్టగా వేరె
నేవలందజేయు నిరుల వల్లి!
ప్రణుతు లందుకొమ్మ ప్రణయ స్వరూపమా!
వ్రపోత్రి నిరత సర్వ సవనమూర్తి!

ఖబడ్దార్

గుళ్ళల్లోని రాళ్లు
ముఖం చాటేస్తుంటే
ఒళ్ళు హూనం చేసుకుంటున్న
దేవుళ్ళు వాళ్ళు
కనబడని శత్రువుతో అలుపెరుగని
పోరాటం చేస్తున్న యోధులు వాళ్ళు
పురాణ ప్రవచనాలు ఆటకెక్కితే
మూఢ భక్తి ప్రభోధకులు తోకలు ముడిస్తే
చక్రధారి క్వారంటయిన్ లో బందీ ఐతే
సమాజం కోసం
నడుం బిగించిన శ్వేతస్కోపధారులు వాళ్ళు.
వేళ్ళ కొసలే మహమ్మారిపై సంధించిన అస్త్రాలు
మాస్కులు, ముసుగులే రక్షణ కవచాలు
మృత్యు కుహరంలో గంటల తరబడి
ఊపిరి బిగబట్టి
తమ ప్రాణాలను
ఫణంగా పెడుతున్న
త్యాగధనులు వాళ్ళు.
అలసిన ఒళ్ళు,
నిద్రలేమి కళ్ళు సేదదీరాలని వస్తే
తాళాలు వేసి "నో ఎంట్రీ" అంటారా?
మానవతా మూర్తులను "రావద్దు"బొమ్మంటారా?
స్వంత ఇళ్లున్నాయి సరే
సూది మొనంత మానవత్వం ఉండొద్దు?
ప్రాణాలను కాపాడే వాళ్లే
నిస్సహాయులై వెనుదిరిగారో
మీ చప్పట్లే మీకు చావు దెబ్బలవుతాయి
ఖబడ్దార్!!

-రమణ వెలమకన్ని
సెల్: 9866015040

కరోనా పాట

గడప దాట వద్దురా, అది లక్ష్మణ గీత!
కరోనా రావణుడు, దాటకురా, నువ్ సీత! ॥గడప॥
ఆరు బయట తిరగాలని, రానీయకు భావాలు!
ఇంటి గాలిలో ఇప్పుడు, ఎన్నెన్నో పరిమళాలు!
పరుపు కింద పాములా, ప్రపంచాన కరోనా!
గృహ వాసం కర్రతో, చంపాలి ఎలాగైనా! ॥గడప॥
ఎవరు పలకరించినా, కలషవద్దు నీ కరాలు!
సంస్కారం మెరిసేలా, చెప్పు నమస్కారాలు!
మనసు కడుగుకోవటం. అపుడపుడూ ముఖ్యం,
చేతులనూ కడగటం, ఇపు డింకా ముఖ్యం. ॥గడప॥
కరోనా తిరుగుతోంది, కంటికి కనబడకుండా!
పోలీసులు డాక్టర్లు, ముందు నిలిచి మన కండ!
పారిశుధ్య కార్మికుల, సేవకు సెల్యూట్ చెయ్యి!
గృహ వాసం కర్రతో, కరోనాను చంపెయ్యి! ॥గడప॥

-డా. రావి రంగారావు
9247581825

భోది సత్యుడు

స్వార్థం
అదొక ప్రళయం
అజ్ఞాతమైన పులకరింత
మనిషి హృదయానికి
ఎన్ని తోటల్లో
అనాధి పుష్పాలు పుష్పించినా...
తనకేమీ ఎరుక
ఏమార్చడంలో మనిషి
రాక్షసుడిలా ప్రవర్తించడంలో
స్వార్థం మనసుతో
నిత్యం నిచ్చెనలు వేసి
నిన్ను ఈ సమాజంలో
ఎదిగి ఎదగకుండా
ఓ కురీపిని చేస్తుంది
అంతిమంగా ముద్దాడుతూ
క్షణ క్షణం అరణ్యాల సమూహంలోకి
అడుగులు వేయిస్తుంది.
మాటలు తెగి పోతాయి
పదాలు మారి పోతాయి
చూపులకు చిక్కకుండానే
జీవితం జారి పోతుంటుంది
అరే బాబు...!
విశ్వంలో చీకటే కాదు
వెలుగులో అనేక సంకేతాలు ఉంటాయి
శాంతి కపోతాలు ఉంటాయి
పోరాడే క్రమంలో2
మనసు విశ్వం కంటే గొప్పది
ముందు నీతోనే నువ్వు
యుద్ధం చేసుకో...
నగ్నంగా నిద్ర పోతున్న
స్వార్థం అనే రక్కసిని
గండ్ర గొడ్డలితో నరికేసుకో
యుగ యుగాల చరిత్ర లో
నీవో బోధి సత్యుడవుతావు.

- ఏటూరు నాగేంద్ర రావు
సెల్ 7416665323

కరోనాతో విలవిల

శౌనీగా వస్తావనుకున్నా
శార్వరీ ఉగాదీ
శానా శానా కష్టాలు తెచ్చావు.
కరోనా గండం వచ్చింది
కరాళ నృత్యం చేసింది
క్వారంటైన్‌లో లోకం బందీ అయ్యింది.
లాక్‌డౌన్‌తో సర్వం లాక్
ఆకలితో పేగులు మలమల
ప్రజలందరూ విలవిల
మూగ జీవాల గోస గోస
కరోనా రోత రోత
స్వయం నిర్బంధమే, కరోనాకు బంధనం
"సఫాయిసే రహోనా, భగావో కరోనా"
షేక్‌హ్యాండ్ వీడండి
నమస్కారం చేయండి
జనతా కర్ఫ్యూను పాటించండి
కరోనా రాక్షసిని బొందపెట్టండి.

- శ్రీమతి ఇస్రత్ సుల్తానా
సెల్: 9440739159

అస్త్రం గురి తప్పొద్దు



డా॥ తెలుగు తిరుమలేష్ కవితా సంపుటి 'అక్షరాస్త్రం' కు డా॥ ఏనుగు నరసింహారెడ్డి రాసిన ముందు మాట ఇది.

కవిత్వం పట్ల ఆకర్షణ పెరిగింది. ఇటీవల కవిత్వం పట్ల ప్రేమ పెరగడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఆకర్షణ మాత్రం కాదు, ఆకర్షణ పెరిగితే రాస్తారు. ప్రేమ ఉంటె చదువుతారు. చదువడంలో ఆనందం పొందుతారు. తదాత్మం చెందుతారు. పలవరిస్తారు. వల్లె వేస్తారు. అట్లా జాషువా కవిత్వాన్ని, గోరేటి వెంకన్న పాటను, గద్దర్ పాటవిరుపుల్ని, ఫొట్ల పల్లి రామారావు చుక్కల్ని ఇష్టపడుతారు. ఇతరులకు చెబుతూ కోట్ చేస్తూ ఎంజాయ్ చేస్తారు.కవిత్వమంటే కెమిస్ట్రీ అనీ, హార్ట్ సైన్స్ అనీ, ఏకానమీ ఆఫ్ వర్డ్స్ అనీ పోటీలు పడి చెప్పుకుంటారు. అలా చదువుకుంటూ, పాడుకుంటూ, తవ్వుకుంటు, అనుకోకుండా, ఆవేశంలో, ఆవేదనలో, అప్రయత్నంగా, తనలో కొన్ని పాదాలు పుడుతాయి. అది కవిత్వం, అప్రయత్నాంగా వస్తుంది. అప్పుడు కావాలంటే దిద్దుకుంటాం, చెక్కుకుంటాం, మెరుగుపెడుతాం. అలా కవులు పుట్టారు పుడుతారు.

ఇప్పటి ఆకర్షణ సంగతి వేరు. ఇతరులది చదివే ఓపిక లేదు. ప్రసిద్ధ గ్రంథాలను కూడా పఠించే ఆసక్తి లేదు. ఒక పేజీ సృష్టించడానికి కనీసం వంద పేజీ లైనా చదివామా అని ఆలోచించడం లేదు. అంతా ఇన్ స్టంట్. ఇమ్మీడియేట్ పబ్లిసిటీ. రాస్తుండగానే లైకులు, ఇంకు తడారకముందే కామెంట్లు. ఇది సోషల్ మీడియా పెట్టిన భుక్తి. మరి కవిత్వం ఎలా వస్తుంది.

ధ్వని కదా కవిత్వం. సంకేతం కదా కవిత్వం, నిరలంకారమనే అలంకారం మీద కవిత రాసి అమ్మ అని పేరుపెడితే ఎలా, ఏనుగు బొమ్మ గీసి ఏనుగని రాస్తే ఎలా. స్నేహం మీద స్నేహమనీ, కాలం మీద కాలమనీ, రాయినీ రాయనీ, చెట్టును చెట్టనీ రాస్తే కవిత్వమెలా అవుతుంది. ఇప్పటికిప్పుడు కవిత్వం ఏ ఉపదేశం ఇవ్వడానికి సిద్ధంగా లేదు. అనుభూతుని సరిగ్గా పలికిస్తే చాలు. అదే అసలైన ఉపదేశం. అదే అసలైన కావ్యప్రయోజనం. కావ్యత్వ సిద్ధి కలగడానికి కవి కవిత్వంలో దుబాయించాలి.

డాక్టర్ తెలుగు తిరుమలేష్ అక్షరాస్త్రానికి ముందు మాట రాయమంటే ఈ అప్రస్థుత ప్రసంగమేమిటి అనిపిస్తుండవచ్చు. అప్రస్థుత ప్రసంగం నుండి సమాజం తప్పించుకోలేదు. సమాజంలో నిలబడి చేసే ఏ ఆలోచనలోనైనా సమాజం ఉండకుండా తప్పించు కోలేదు.ఈ పుస్తకం లోని కవితల నిండా డా. తెలుగు తిరుమలేష్ సమాజాన్నే గుదిగుచ్చాడు. సాహిత్యం చుట్టూ పారాడుతున్నాడు. కవిత్వపు చిలుకలందు కోవడానికి, ఊయలలో బలం సిద్ధం చేసుకుంటు న్నాడు. డా. తిరుమలేష్ ఎదుగుతాడు. ఊయలకు కట్టిన చిలుకలను పొందుతాడు.అందుకు తన కవిత్వం లో మూల కణాలున్నాయి. డాక్టర్ తెలుగు తిరుమలేష్‌కు అభినందనలు.

ప్రతులకు:
తెలుగు తిరుమలేష్
సెల్:7789295689

డా॥ -ఏనుగు నరసింహారెడ్డి
8978869183

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com